PRAJASAKTI Regd.No. 15795/68

సిటీ

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 42 సంచిక : 196 | విజయవాడ, శుక్రవారం 17 ఫిబ్రవరి 2023 | 8 + 8 పేజీలు వెల : 5.50

Vol No | Vijayawada, Friday 17 February 2023 | Rs

ఉపాధి హామీ వేతనాల్లో

సగం రాష్ట్రాలు చెల్లించాల్సిందే..

- రాష్ట్రాలకు కేంద్రం అల్టిమేటం

లోపలి పేజీలో..

ఐటికి గమ్యస్థానంగా విశాఖ

- గుడివాడ అమర్‌నాథ్

లోపలి పేజీలో..

హిందూత్వ, కార్పొరేట్లపై ద్విముఖపోరు

వ్యవసాయ కార్మిక సదస్సులో ప్రకాశ్‌కరత్

జ్యోతిబసు నగర్ (హౌరా) నుంచి ప్రజాశక్తి ప్రతినిధి

కార్పొరేట్లు, మతోన్మాదులు కూడబలుక్కుని ప్రజలపై మోపుతున్న భారాలు, మతతత్వ దాడులను తిప్పికొట్టేందుకు ద్విముఖ పోరు సాగించాలని సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు ప్రకాశ్‌కరత్ పిలుపునిచ్చారు. అఖిలభారత వ్యవసాయ కార్మిక సంఘం మహాసభలో భాగంగా రెండోరోజు 'మతోన్మాదం, కార్పొరేట్ల అనుబంధం, రాజ్యాంగంపై దాడి, ఆహారభద్రత, భూ పంపిణీ' అనే అంశాలపై సదస్సు జరిగింది. ఈ సందర్భంగా కరత్ మాట్లాడుతూ కార్పొరేట్లు, మతోన్మాద శక్తుల పొత్తు 2014లో మోడీ గద్దెనెక్కిన తరువాత మరింతగా బలపడిందదని అన్నారు. మోడీ వచ్చిన తొమ్మిది సంవత్సరాలకాలంలో బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్ సరళీకరణ విధానాలను పూర్తిగా బలపరుస్తున్నాయన్నారు. క్రోనీ కేపిటలిజాన్ని మోడీ పెంచి పోషిస్తున్నారన్నారు. ఆర్‌ఎస్‌ఎస్ మొదటి నుండి ప్రైవేటీకరణకు అనుకూలం, జనసంఘ్‌గా ఉన్నప్పుడు మార్కెట్‌శక్తులకు అనుకూలంగా వీళ్ల విధానాలు ఉన్నాయన్నారు. 1991లో పివి నరసింహారావు సరళీకరణ విధానాలు బడ్జెట్లో ప్రతిపాదించినప్పుడు అద్వానీ పార్లమెంటులో మాట్లాడుతూ, తాము సూచించిన విధానాలనే కాంగ్రెస్ అమలు చేస్తోందని చెప్పిన విషయాన్ని గుర్తుచేశారు. నెహ్రూ ప్రభుత్వం పంచవర్ష ప్రణాళికలు, ప్రభుత్వ రంగాన్ని బలపరిస్తే, బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్ దాన్ని తీవ్రంగా వ్యతిరేకించాయని అన్నారు. బ్యాంకుల్లోని ప్రజల సొమ్మును పెట్టుబడిదారులకు మోడీ దోచిపెడుతున్నారని ఆయన విమర్శించారు. ముఖ్యంగా అదానీ, అంబానీ, టాటాలు మోడీ పాలనలో సంతోషంగా ఉన్నారని చెప్పారు. రతన్‌టాటా కూడా మోహన్‌భగవత్‌తో కలిసి 2015లో హెగ్డేవార్ సమాధి వద్దకు వెళ్లి శ్రద్ధాంజలి ఘటించారని తెలిపారు. మోడీ నిరంకుశంగా ఏకపార్టీ పాలన సాగిస్తున్నారని అన్నారు. హిందూ రాష్ట్ర నినాదం మైనార్టీలపైన, దళితులపైనా దాడులకు ఉద్దేశించినవేనన్నారు.

కార్మికవర్గం రైతాంగం, వ్యవసాయ కార్మికులు హక్కులను మోడీ ప్రభుత్వం కాలరాస్తోందన్నారు. హిందూత్వ ఒక్కటే ప్రజలను ఉత్సాహపరుస్తుందని మోడీ చెబుతున్నారని అన్నారు. ఆచరణలో దళిత గిరిజనులపై దాడులు చేస్తూ వారిని అణచివేస్తున్నారని చెప్పారు. ప్రభుత్వ సరళీకరణ విధానాలకు వ్యతిరేకంగా పోరాడుతూనే మిగతా 2లో

కేంద్ర ప్రభుత్వ విధానాలతో గ్రామాలు అతలాకుతలం

- పోరాటాలు.. సేవా దృక్పథంతో సంఘ విస్తరణ
- కార్యదర్శి నివేదికలో వెంకట్

7

త్రిపురలో భారీ పోలింగ్

92.40 శాతం ఓటింగ్ !

పలు చోట్ల హింసాత్మక సంఘటనలు

ఒక సిపిఎం నేతతో పాటు ఇద్దరు ఎన్నికల ఏజెంట్లకు గాయాలు

అగర్తలా : త్రిపుర అసెంబ్లీ ఎన్నికల్లో భారీ స్థాయిలో పోలింగ్ నమోదైంది. గురువారం జరిగిన పోలింగ్ ప్రక్రియకు ఉదయం ఏడు గంటల నుండే ఓటర్లు బారులుదీరారు. ప్రారంభమైన మొదటిగంట నుండే పోలింగ్ స్టేషన్లు కిక్కిరిసి కనిపించాయి. దీంతో గంట,గంటకు పోలింగ్‌శాతం పెరుగుతూ వచ్చింది. రాష్ట్ర వ్యాప్తంగా నాలుగు గంటలకు పోలింగ్ ప్రక్రియను ముగించారు. ఆ సమయానికి 81.10 శాతం ఓట్లు పోల్ అయినట్లు ఎన్నికల కమిషన్ ప్రకటించింది. ఆ సమయానికి కూడా పోలింగ్ బూత్‌ల దగ్గర ఓటర్లు పెద్ద సంఖ్యలో ఉండటంతో వారందరికీ ఓటు వేయడానికి అవకాశం కల్పించారు. దీంతో భారీగా ఓటింగ్ శాతం పెరగనుంది. అనధికారిక వర్గాల ద్వారా తెలిసిన సమాచారం ప్రకారం రాత్రి పొద్దుపోయే సమయానికి 92.40 శాతం ఓటింగ్ నమోదయింది. ఇది త్రిపుర చరిత్రలోనే రికార్డు. పూర్తిస్థాయి ఓటింగ్ శాతాన్ని శుక్రవారం ఎన్నికల కమిషన్ ప్రకటించనుంది. పోలింగ్ సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా అనేక ప్రాంతాల్లో హింస చెలరేగింది. ఈ ఘటనల్లో సిపిఎంకు చెందిన ఒక నాయకుడితో పాటు ఇద్దరు పోలింగ్ ఏజెంట్లు తీవ్రంగా గాయపడ్డారు. వీరిని ఆస్పత్రికి తరలించారు. భారీ సంఖ్యలో తరలివస్తున్న ఓటర్లను అడ్డుకోవడానికి పలుచోట్ల బిజెపి ప్రయత్నించింది. ఆ పార్టీ కార్యకర్తలు కర్రలు, రాడ్లతో ఓటర్లను భయభ్రాంతులకు గురిచేసే ప్రయత్నం చేశారు. అనేక గ్రామాల్లో వీరిని స్థానిక ప్రజలు ప్రతిఘటించి ఓటు వేశారు. మాజీ ముఖ్యమంత్రి, సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు మాణిక్ సర్కార్ రామ్‌నగర్ నియోజకవర్గంలోని శిశువిహార్ హయ్యర్ సెకండరీ స్కూల్ బూత్‌లో ఓటు వేశారు. సబ్‌రూమ్‌లో అభ్యర్థిగా ఉన్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జితేంద్ర చౌదరి తన నియోజకవర్గ బూత్‌లో ఓటు వేశారు. మొత్తంమీద పోలింగ్ ప్రశాంతంగా జరిగిందని ముఖ్య ఎన్నికల అధికారి గిట్టె కిరణ్ కుమార్ దినకర్ రావు ప్రకటించారు. రెండు దశాబ్దాల క్రితం మిజోరాం నుండి త్రిపురకు వలస వచ్చేసిన బ్రూ తెగకు చెందిన కుటుంబాలు మొదటిసారిగా ఈ ఎన్నికల్లో ఓటు వేశాయి. త్రిముఖ పోటీ జరుగుతున్న త్రిపురలో 259మంది అభ్యర్థులు బరిలో వున్నారు. 45 చోట్ల ఇవిఎంలు పని చేయలేదు.

దాడులు ఇలా...

బిషాల్‌గఢ్, శాంతిర్‌పూర్, రాంనగర్, ధన్‌పూర్, బముతియా, సూర్యమీనగర్, బ్రజాలాలో బిజెపి సభ్యులు ఓటర్లను బెదిరించే ప్రయత్నం మిగతా 7లో

ఆర్‌జెడి ప్రతాప్‌రెడ్డిపై విచారణ

- ఆదేశించిన ఎన్నికల కమిషన్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఎంఎల్‌సి ఎన్నికల్లో అధికార దుర్వినియోగం, అవకతవకలకు సంబంధించి కడప ఆర్‌జెడి ప్రతాప్ రెడ్డిపై విచారణ నిర్వహించాలని ఎన్నికల కమిషన్ ఆదేశించింది. ఈ మేరకు ఎన్నికల సంఘం ముఖ్య కార్యదర్శి ముఖేష్ కుమార్‌మీనా ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నెల 11వ తేదినే ఈ మేరకు ఉత్తర్వులు జారీ అయినప్పటికీ గురువారం వెలుగులోకి వచ్చాయి. పశ్చిమ రాయలసీమ నియోజకవర్గం ఎమ్మెల్సీ ఎన్నికల్లో ప్రతాప్‌రెడ్డి అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్నారని ఎన్నికల సంఘానికి పలు ఫిర్యాదులు అందిన విషయం తెలిసిందే. టిడిపి ఎమ్మెల్సీ పి అశోక్ బాబు, యుటిఎఫ్ ప్రధాన కార్యదర్శి కెఎస్‌ఎస్ ప్రసాద్, ఎస్టియు ప్రధాన కార్యదర్శి తిమ్మన్న తదితరులు ఈ ఫిర్యాదులు చేశారు. ఈ ఫిర్యాదులపై వెంటనే విచారణ జరిపించి నివేదిక అందించాలని కడప, కర్నూలు జిల్లాల కలెక్టర్లకు మీనా ఆదేశాలు జారీ చేశారు. పశ్చిమ రాయమలసీమ ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా అభ్యర్థిగా వైసిపి తరపున పోటీ చేస్తున్న ఎంవి రామచంద్రారెడ్డికి ప్రతాప్ రెడ్డి సహకరిస్తున్నారని ఎన్నికల సంఘానికి ఫిర్యాదులు అందాయి. రామచంద్రారెడ్డికి ఓట్లు వేయాలని మండల విద్యాధికారులు, ప్రధానోపాధ్యాయుల ద్వారా ఉపాధ్యాయులపై ఒత్తిడి చేస్తున్నారన్నది ఈ ఫిర్యాదుల సారాంశం, కర్నూలు ఎస్వీ కాంప్లెక్స్, ఆదోనిలో జ్యోతిర్మయి డిగ్రీ కళాశాలల్లో సమావేశాలు నిర్వహించి ప్రచారం కూడా చేశారన్న ఆరోపణలు ఉన్నాయి. ఎస్‌సిఇఆర్‌టి డైరెక్టర్లుగా ఉన్న ప్రతాప్ రెడ్డిని రాష్ట్రప్రభుత్వం ఇటీవల కడప ఆర్‌జెడిగా అదనపు బాధ్యతలు అప్పగించింది.

30 ఇళ్లకు ఓ సాధికార సారధి

- రాష్ట్రాన్ని వైసిపి భ్రష్టు పట్టించింది
- రోడ్ షోలో టిడిపి అధినేత చంద్రబాబు



ప్రజాశక్తి - కాకినాడ ప్రతినిధి

ప్రతి 30 కుటుంబాలకు ఒకరిని సాధికార సారథులుగా నియమిస్తామని టిడిపి జాతీయ అధ్యక్షులు చంద్రబాబు అన్నారు. ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమంలో భాగంగా తూర్పు గోదావరి, కాకినాడ జిల్లాల్లో గురువారం ఆయన పర్యటించారు. జగ్గంపేట, పెద్దాపురం నియోజకవర్గాల్లో రోడ్ షో నిర్వహించారు. జగ్గంపేటలో పార్టీ కార్యకర్తలతో నిర్వహించిన సమావేశంలో చంద్రబాబు మాట్లాడుతూ... ఇకపై పార్టీలో ఉన్న సెక్షన్ ఇన్‌ఛార్జులందరినీ కుటుంబ సాధికార సారథులుగా పిలుస్తామన్నారు. ఆర్థిక అసమానతలు తొలగించేలా వీళ్లు పనిచేస్తారని చెప్పారు. సాధికార సారథులుగా మహిళలకు ప్రాధాన్యం ఇస్తామన్నారు. ప్రతి నియోజకవర్గంలో కుటుంబ సాధికార సారథి విభాగం ఉంటుందని చెప్పారు. ప్రతి కుటుంబానికీ న్యాయం చేసేందుకు ఈ విభాగం పనిచేస్తుందని తెలిపారు. అనంతరం పెద్దాపురం డైలీ మార్కెట్ సెంటర్‌లో బహిరంగ సభ నిర్వహించారు. సహజ సంపదను దోచేస్తూ, ధరలను పెంచుతూ, కుంభకోణాలు చేస్తూ వైసిపి ప్రభుత్వం రాష్ట్రాన్ని పూర్తిగా భ్రష్టు పట్టించిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. నాడు విభజన కష్టాల్లో సైతం విద్యుత్ ఛార్జీలు పెరగలేదని, నేడు ఏడుసార్లు విద్యుత్ ధరలు పెంచారని చెప్పారు. వైసిపి పాలనలో నిత్యావసర వస్తువుల ధరలు అన్నీ భారీగా పెరిగాయని తెలిపారు. 48 రకాల పన్నులు వేసి ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. గోదావరి జిల్లాలో కూడా ఇసుక ఎందుకు దొరకడం లేదో ప్రజలు గమనించాలన్నారు. మద్యం అమ్మకాల డబ్బు తాడేపల్లి ప్యాలెస్‌కు పోతోందని చెప్పారు. అమరావతి రాజధానిపై ప్రభుత్వం రోజుకో మాట మాట్లాడుతోందన్నారు. పోలవరం ప్రాజెక్టును గోదాట్లో కలిపేశారని విమర్శించారు. రాష్ట్రంలో పరిశ్రమలు వెనక్కి పోయాయని, పెద్ద ఎత్తున ఉపాధి అవకాశాలు తగ్గడంతో యువత పక్క రాష్ట్రాలకు వలస పోతున్నారన్నారు. మళ్లీ యువతకు ఉద్యోగాలు రావాలంటే టిడిపితోనే సాధ్యమని తెలిపారు. కేంద్రం రెండున్నర లక్షల ఇళ్లు మంజూరు చేస్తే నాలుగేళ్లలో జగన్ 823 ఇళ్లు మాత్రమే కట్టించారని, పేదల ఇళ్ల స్థలాల పేరుతో రాష్ట్రంలో రూ.ఆరు వేల కోట్ల అక్రమాలు చేశారని విమర్శించారు.

బిజెపికి కన్నా గుడ్‌బై

ప్రజాశక్తి - గుంటూరు జిల్లాప్రతినిధి

కన్నా లక్ష్మీనారాయణ

బిజెపి జాతీయ కార్యవర్గ సభ్యులు కన్నా లక్ష్మీనారాయణ ఆ పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి గురువారం రాజీనామా చేశారు. ఈ మేరకు పార్టీ జాతీయ అధ్యక్షులు జెపి.నడ్డా పేరున రాసిన రాజీనామా లేఖను గుంటూరులోని తన నివాసంలో మీడియాకు విడుదల చేశారు. రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వం అవలంభిస్తోన్న ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాడటంలో పార్టీ రాష్ట్ర నాయకత్వం విఫలమైందని, రాష్ట్ర అధ్యక్షులు సోము వీర్రాజు వ్యవహారశైలి సరిగా లేదని అన్నారు. రాష్ట్రంలో నాయకుల వైఖరి సరిగా లేనందున తాను పార్టీలో మనుగడ సాగించలేక రాజీనామా చేయాలని నిర్ణయించుకున్నట్టు తెలిపారు. తన రాజకీయ భవిష్యత్తుపై త్వరలో తన అనచురులతో చర్చించి నిర్ణయం తీసుకుంటామని అన్నారు. ఇదిలా ఉండగా త్వరలో ఆయన టిడిపిలో చేరతారని ప్రచారం జరుగుతోంది.

వేలాది మందితో పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి రమాప్రభ నామినేషన్ ర్యాలీ

పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి రమాప్రభ నామినేషన్

- విశాఖలో భారీ ర్యాలీ, సభ

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

విద్యార్థులు, సామాజిక కార్యకర్త, ఉత్తరాంధ్ర పట్టభద్రుల నియోజకవర్గం పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి డాక్టర్ కోరెడ్ల రమాప్రభ నామినేషన్ కార్యక్రమం గురువారం విశాఖలో అత్యంత ఉత్సాహపూరిత వాతావరణంలో సాగింది. స్వచ్ఛందంగా తరలి వచ్చిన ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, ప్రజా సంఘాలు, పట్టభద్రులు, నిరుద్యోగులు, మహిళల సందడితో అత్యంత కోలాహలంగా వేలాది మందితో ర్యాలీ జరిగింది. ర్యాలీ అగ్రభాగంలో పిడిఎఫ్ ఎమ్మెల్సీలు కెఎస్.లక్ష్మణరావు, ఐ.వెంకటేశ్వరరావు (ఐవి), యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు నక్కా వెంకటేశ్వర్లు, ఉత్తరాంధ్ర పట్టభద్రుల నియోజకవర్గం మాజీ ఎమ్మెల్సీ ఎంవిఎస్.శర్మ, వామపక్షాల నేతలు సిహెచ్.నర్సింగరావు, మరుపల్లి పైడిరాజు, కె.లోకనాథం, ఎం.జగ్గునాయుడు, ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక ప్రధాన కార్యదర్శి ఎ.అజశర్మ సహా ఉమ్మడి శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం జిల్లాలకు చెందిన 250 సంఘాల నాయకులు ఈ ప్రదర్శనలో పాల్గొన్నారు. నగరంలోని సరస్వతీ పార్కు నుంచి జిల్లా కలెక్టరేట్ వరకూ ర్యాలీ సాగింది. దారిపొడవునా అభిమానులు, ప్రజా సంఘాలకు చెందిన మహిళలు ర్యాలీని ఆశీర్వదిస్తూ పుష్పాలతో స్వాగతం పలికారు. అనంతరం కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జునకు నామినేషన్ పత్రాన్ని రమాప్రభ అందజేశారు.

మండలిలో ప్రశ్నించే వాణిగా ఉంటా : రమాప్రభ

'ఉత్తరాంధ్ర వెనుకబాటుతనంపై ప్రశ్నించే పార్టీల్లేవు. శాసన మండలిలో ఆ ప్రశ్నించే వ్యక్తిగా నేను ఉంటాను. నాకు మొదట ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించండి' అంటూ రమాప్రభ నామినేషన్ సందర్భంగా తెలిపారు. ఉత్తరాంధ్రకు ప్రత్యేక ప్యాకేజీ, ప్రభుత్వ రంగాన్ని కాపాడుకునే ఉద్యమాలకు, వైజాగ్ స్టీల్‌ప్లాంట్ రక్షణ కోసం అండగా నిలుస్తానని ఆమె ఉద్ఘాటించారు. ర్యాలీ అనంతరం కలెక్టరేట్ వద్ద జరిగిన సభలో పిడిఎఫ్ ఎమ్మెల్సీల డిప్యూటీ ఫ్లోర్ లీడర్ కెఎస్.లక్ష్మణరావు మాట్లాడుతూ.. 2007లో శాసన మండలి పునరుద్ధరణ జరిగిన తర్వాత పిడిఎఫ్ ఏర్పాటు చేసి 15 ఏళ్లుగా ఉద్యోగులు, ఉపాధ్యాయులు, కాంట్రాక్టు ఉద్యోగులు, రైతులు, కార్మికుల సమస్యలపై చట్టసభల్లోనూ, బయటా ఉద్యమాలు చేస్తున్నామన్నారు. పిడిఎఫ్ ఎమ్మెల్సీ ఐవి మాట్లాడుతూ.. పిడిఎఫ్ అభ్యర్థులది ప్రజాపక్షమని, అందుకే శాసన మండలిని ప్రజా సమస్యలను చర్చించే వేదికగా మార్చామని చెప్పారు. యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఎన్.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. ప్రశ్నిస్తే సహించలేని ప్రభుత్వం అధికారంలో ఉందని, ప్రాథమిక విద్యను నాశనం చేసే విధానంపై పిడిఎఫ్ పోరాడుతోందని తెలిపారు. మాజీ ఎమ్మెల్సీ ఎంవిఎస్.శర్మ మాట్లాడుతూ.. ప్రజా సమస్యలు తెరమీదకు రావాలంటే పిడిఎఫ్ అభ్యర్థిని గెలిపించుకోవాలని అన్నారు.

మృత శిశువుకు అంబులెన్స్ కరువు

- స్కూటీపైనే 120 కిలోమీటర్లు తీసుకెళ్లిన గిరిజన కుటుంబీకులు
- విశాఖలో అమానవీయ ఘటన

చిన్నారి మృతదేహాన్ని స్కూటీపై తీసుకెళ్తున్న కుటుంబీకులు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్, ఎంవిపి.కాలనీ, ముంచంగిపుట్టు, పాడేరు టౌన్

విశాఖలో అమానవీయ ఘటన చోటు చేసుకుంది. మృత శిశువును స్వగ్రామానికి తరలించేందుకు విశాఖ కెజిహెచ్ సిబ్బంది అంబులెన్స్‌ను సమకూర్చలేదు. ప్రైవేటు అంబులెన్స్‌కు డబ్బులు ఇచ్చుకోలేక విశాఖపట్నం నుంచి అల్లూరి జిల్లా కేంద్రం పాడేరు వరకూ సుమారు 120 కిలోమీటర్లు స్కూటీపైనే చిన్నారి మృతదేహాన్ని గిరిజన కుటుంబీకులు తీసుకెళ్లారు. అధికారుల తీరుపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అల్లూరి జిల్లా ముంచింగిపుట్టు మండలం కుమడకు చెందిన చెండా మత్స్య కొండబాబు, మహేశ్వరి దంపతుల చిన్నారి అనారోగ్యంతో విశాఖ కెజిహెచ్‌లో చికిత్స పొందుతూ గురువారం మరణించారు. మృతదేహాన్ని తీసుకెళ్లేందుకు అంబులెన్స్ కోసం తల్లిదండ్రులు ఎంత ప్రాధేయపడినా ఫలితం దక్కలేదు. ప్రైవేట్ అంబులెన్స్‌కు డబ్బులు ఇచ్చే స్థోమత లేక మృతదేహాన్ని స్కూటీపై మధ్యలో కూర్చోబెట్టుకొని పాడేరు వరకు తీసుకువచ్చారు. చివరకు అల్లూరి జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ స్పందించి పాడేరు నుంచి కుమడకు అంబులెన్స్ ఏర్పాటు చేశారు. బిడ్డ మృతదేహాన్ని ఇంటికి తీసుకెళ్లేందుకు అంబులెన్స్ ఇవ్వాలని కోరినా కెజిహెచ్ సిబ్బంది ఇవ్వలేదని, ట్రైబల్ సెల్‌ను సంప్రదించినా ఫలితం లేకపోయిందని బాధిత కుటుంబ సభ్యులు వాపోతున్నారు. ఆసుపత్రి సిబ్బంది నిర్లక్ష్యం కారణంగానే తమ శిశువు మృతి చెందిందని వారు చెబుతున్నారు.

అంబులెన్స్ ఏర్పాటు చేసేలోపే వెళ్లిపోయారు : కెజిహెచ్ సూపరింటెండెంట్

మృతి చెందిన శిశువు గిరిజన ప్రాంతానికి చెందినవారని, వారికి కెజిహెచ్ ట్రైబల్ సెల్ అధికారులు వాహనం ఏర్పాటు చేస్తారని, వాహనం అందుబాటులో లేని పక్షంలో ట్రైబల్ సెల్ కో-ఆర్డినేటర్ రామకృష్ణ తమను సంప్రదిస్తుంటారని కెజిహెచ్ ఆర్ఎంఒ తెలిపారు. తమకు వాహనం కావాలని ఎవరూ కోరలేదని ఆయన తెలిపారు. శిశువు మృతదేహానికి అంబులెన్స్ సమకూర్చలేదన్న ఆరోపణ పూర్తి అవాస్తమని కెజిహెచ్ సూపరింటెండెంట్ అశోక్ తెలిపారు. అంబులెన్స్‌ను ఏర్పాటు చేసేలోపే వారు వెళ్లిపోయారని తెలిపారు.

ఢిల్లీ మద్యం కుంభకోణంలో నిందితులకు బెయిల్ నిరాకరణ

- సిబిఐ ప్రత్యేక కోర్టు తీర్పు

లోపలి పేజీలో..

కొత్త జిల్లాల్లో ప్రమోషన్లతో ఖాళీల భర్తీ

- అధికారులకు సిఎస్ ఆదేశం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

నూతనంగా ఏర్పాటు చేసిన జిల్లాల్లోప్రస్తుతం ఉన్న ఉద్యోగులకు ప్రమోషన్లు ఇవ్వడం, క్రమబద్ధీకరించడం ద్వారా ఖాళీలను భర్తీ చేయాలని అధికారులను ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.ఎస్ జవహర్ రెడ్డి ఆదేశించారు. ఈ మేరకు త్వరితగతిన చర్యలు తీసుకోవాలని చెప్పారు. వివిధ శాఖల కార్యదర్శుల సమావేశం గురువారం రాష్ట్ర సచివాలయంలో జరిగింది. ఈ సమావేశంలో సిఎస్ మాట్లాడుతూ కొత్త జిల్లాల్లో గ్రామ, వార్డు సచివాలయాలు సహా వివిధ విభాగాల్లో ఖాళీల భర్తీకి చర్యలు తీసుకోవాలని చెప్పారు. ఇక్కడ ఇప్పటికే పనిచేస్తున్న ఉద్యోగుల ప్రొబేషన్ డిక్లరేషన్‌కు చర్యలు తీసుకోవాలన్నారు.

వివిధ శాఖల్లో ఖాళీగా ఉన్న గ్రూప్-1,2 స్థాయి పోస్టుల ఖాళీల వివరాలను వెంటనే సాధారణ పరిపాలన శాఖకు అందజేయాలని చెప్పారు. అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో ఇ-ఆఫీస్ విధానం కింద ఇ-రిసిప్ట్స్,ఇ-డిస్పాచ్ విధానాన్ని పూర్తిస్థాయిలో అమలు చేసేందుకు చర్యలు చేపట్టాలని చెప్పారు. వివిధ శాఖల్లో పెండింగ్‌లో ఉన్న ఎసిబి, విజిలెన్స్ కేసులను నిరంతరం మానిటర్ చేస్తూ సత్వర పరిష్కారానికి కృషి చేయాలని చెప్పారు. ఎపి ఆన్‌లైన్ లీగల్ కేసుల మేనేజ్‌మెంట్ విధానం కింద వివిధ శాఖల్లో నమోదవుతున్న కోర్టు కేసులు సకాలంలో కౌంటర్లు దాఖలు చేయడం, కోర్టు కేసులపై జాప్యం లేకుండా సకాలంలో చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

పాలిసెట్ దరఖాస్తుల స్వీకరణ ప్రారంభం

- మే 10న పరీక్ష

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఇంజినీరింగ్, నాన్-ఇంజినీరింగ్ డిప్లమో కోర్సుల ప్రవేశానికి నిర్వహించే పాలిసెట్-2023 పరీక్షకు దరఖాస్తుల ప్రక్రియ గురువారం ప్రారంభమైంది. సాంకేతిక విద్య కమిషనర్ సిహెచ్ నాగరాణి ఇందుకు సంబంధించిన ఆనలైన్ ఫైలింగ్ ప్రక్రియను ప్రారంభించారు. సాంకేతిక విద్య కమిషనర్ కార్యాలయంలో వివరాలతో కూడిన కరపత్రాన్ని కూడా ఆవిష్కరించారు. పాలిసెట్‌కు ఏప్రిల్ 30వ తేదీ వరకు విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చని వెల్లడించారు. మే 10వ తేదీన పరీక్ష ఆఫ్‌లైన్ విధానంలో ఉంటుందని తెలిపారు. అభ్యర్థులు polycetap.nic.inను సందర్శించాలన్నారు. మరిన్ని వివరాలను సమీపంలో ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలల్లోని సహాయ కేంద్రం వద్ద పొందవచ్చునని వివరించారు. ఈ కార్యక్రమంలో సాంకేతిక విద్య సంయుక్త సంచాలకులు పద్మారావు, శిక్షణ మండలి కార్యదర్శి విజయభాస్కర్ పాల్గొన్నారు.

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది.

94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.

అభిప్రాయాలు పంపదలిస్తే..

స్పందన, ప్రజాశక్తి తెలుగు డైలీ, ప్రజాశక్తి భవనం-అమరరెడ్డి కాలనీ, అరవింద హైస్కూల్ దగ్గర, తాడేపల్లి, గుంటూరు జిల్లా - 522 501కు కానీ **editorprajasakthi@gmail.com**కు పంపవచ్చు.

వైసిపిలో చేరిన వెంకటరమణ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

టిడిపి సీనియర్ నేత, కైకలూరు మాజీ ఎమ్మెల్యే జయమంగళ వెంకటరమణ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సమక్షంలో గురువారం వైసిపిలో చేరారు. తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో మంత్రి కారుమూరి వెంకటనాగేశ్వరరావు, స్థానిక ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావుతో కలిసి వెంకటరమణ సిఎంను కలిశారు. జగన్ సాదరంగా ఆహ్వానించి వైసిపి కండువా కప్పారు. 2009 ఎన్నికల్లో టిడిపి నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందిన వెంకటరమణ.. కైకలూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జిగా ఉన్నారు. ఇటీవల నియోజకవర్గ ఇన్‌ఛార్జి పదవికి, టిడిపి సభ్యత్వానికి రాజీనామా చేశారు. టిడిపి రైతు విభాగం రాష్ట్ర నాయకులు సయ్యాపరాజు గుర్రాజు కూడా ఈ సందర్భంగా టిడిపిని వీడి వైసిపిలో చేరారు.

సునీల్‌కు బెయిల్ ఇవ్వొద్దు

- హైకోర్టులో ఇంప్లీడ్ పిటిషన్

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో రెండో నిందితుడు సునీల్ యాదవ్‌కు బెయిల్ ఇవ్వొద్దని వివేక భార్య సౌభాగ్యమ్మ, కుమార్తె సునీతారెడ్డి హైకోర్టులో ఇంప్లీడ్ పిటిషన్ దాఖలు చేశారు. యాదవ్‌కు బెయిల్ ఇస్తే కీలక సాక్షాదారాలు, ఆధారాలు తారుమారు చేసే అవకాశం ఉంటుందని వారు తెలిపారు. బెయిల్ కోసం యాదవ్ దాఖలు చేసిన పిటిషన్‌లో వాదనలను ఈ నెల 27కు కోర్టు వాయిదా వేసింది. ఈ నెల 16న కాణిపాకంలో తన సోదరుడి సంస్మరణ కార్యక్రమానికి వెళ్లేందుకు వీలుగా బెయిల్ మంజూరు చేయాలని యాదవ్ హైకోర్టును ఆశ్రయించాడు. ఈ పిటీషన్‌ను గురువారం న్యాయమూర్తి జస్టిస్ సుమలత విచారించారు. ప్రతివాదుల వాదన నిమిత్తం విచారణను కోర్టు 27కు వాయిదా వేసింది.

మానసిక ఒత్తిడిని అధిగమించాలి

- ఎపిఎన్ఆర్‌టిఎస్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

పరీక్షల కాలం వస్తున్నందున విద్యార్థులు మానసిక ఒత్తిడిని అధిగమించేందుకు కృషి చేయాలనే కాన్సెప్ట్‌తో ప్రముఖులతో శిక్షణ ఇస్తున్నట్టు ఆంధ్రప్రదేశ్ నాన్ రెసిడెంట్ తెలుగు సొసైటీ (ఎపిఎన్ఆర్‌టిఎస్) అధ్యక్షులు వెంకట్ ఎస్ మేడపాటి తెలిపారు. ఈ మేరకు ఆయన గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రంలో ఇంటర్మీడియట్ బోర్డు, ఎపిఎన్ఆర్‌టిఎస్ సంయుక్తంగా విద్యార్థులు మానిసిక ఒత్తిళ్లకు గురికాకుండా ఉండేందుకు శిక్షణ కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. ప్రపంచ వ్యాప్తంగా ప్రవాసాంధ్రులు ఇందులో భాగస్వామ్యం కానున్నారని పేర్కొన్నారు. రాష్ట్రంలోని ప్రతి కాలేజీ నుంచి ఇద్దరిని ఎంపిక చేసి శిక్షణ ఇవ్వనున్నామని తెలిపారు. మొత్తం 3,400 ప్రభుత్వ, ప్రైవేట్, కార్పొరేట్ కళాశాలల్లోని 6,800 మంది అధ్యాపకులకు ఈ శిక్షణ ఇస్తున్నామని తెలిపారు. శిక్షణ పొందిన అధ్యాపకులు తమ కాలేజీలో విద్యార్థులకు శిక్షణ అందిస్తారని అన్నారు. ఈ నెల 22 వరకు జరిగే ఈ శిక్షణ అమెరికాలోని అల్బామాకు చెందిన సర్టిఫైడ్ చైల్డ్ అండ్ అడోలసెంట్ సైకియాట్రిస్ట్ డాక్టర్ అపర్ణ వుప్పల, ఎపిఎన్ఆర్‌టిఎస్ వ్యవస్థాపకులు నెల్సన్ వినోద్ మోసెస్ (మెంటల్ హెల్త్ జర్నలిస్ట్ విభాగంలో అవార్డ్ గ్రహీత) పర్యవేక్షిస్తారని తెలిపారు.

'ఉపాధి' కూలి రూ.257 !

- ఈ ఏడాదికి ప్రతిపాదన
- మొత్తం పనులకు అంచనా వ్యయం రూ.11,779 కోట్లు

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

ఉపాధిహామీ పథకం కింద పనిచేసే వారికి రోజు వేతనాన్ని రూ.257 ఇవ్వాలని గ్రామీణాభివృద్ధి శాఖ ప్రతిపాదనలు సిద్ధం చేస్తోంది. ఇది ప్రస్తుతం ప్రభుత్వం వెల్లడిస్తున్న తలసరి వేతన గణాంకాలకు పూర్తి భిన్నంగా ఉండడం గమనార్హం. వచ్చే 2023-24 ఆర్థిక సంవత్సరానికి ఉపాధి హామీపై ప్రతిపాదనలు సిద్ధం చేశారు. ఎంత మందికి పనులు కల్పించాలి, ఎంత వ్యయం అవుతుంది, అందులో వేతన వాటా, మెటీరియల్ వాటా ఎంత ఉంటుందనేది ప్రతిపాదనల్లో ప్రస్తావించారు.

ఏడాది మొత్తం మీద 27.50 కోట్ల పనిదినాలు కల్పించేందుకు ప్రతిపాదించారు. మొత్తం ఉపాధి హామీ వ్యయం రూ.11,779 కోట్లుగా ప్రతిపాదించారు. వేతనాలకు సంబంధించి ఒక్కొక్కరికీ రూ.257 చొప్పున

మొత్తం రూ.7,067 కోట్లు ఖర్చు అవుతుందని అంచనా వేస్తున్నారు. దీనికి అదనంగా మెటీరియల్ కాంపోనెంట్ కింద మరో రూ.4,712 కోట్లు వ్యయం చేయాలని నిర్ణయించారు. మొత్తం వ్యయంలో కన్వర్జెన్స్ పథకాల కింద రూ.4,898 కోట్లు ఖర్చు పెట్టాలని భావిస్తున్నారు.

గ్రామ సచివాలయాల భవనాలు 1,917 నిర్మించేందుకు రూ.2,618 కోట్లు ఖర్చు చేయాలని నిర్ణయించారు. 8320 భారత్ నిర్మాణ్ సేవా కేంద్రాలకుగాను రూ.476 కోట్లు, 10243 వ్యవసాయ ఉత్పత్తుల నిల్వ భవనాలకు రూ.1,390 కోట్లు, 3734 బల్క్ మిల్క్ కూలింగ్ కేంద్రాలకు రూ.551 కోట్లు, మహిళా స్వయం సహాయ గ్రూపుల భవనాలకు రూ.2,147 కోట్లు, రోడ్లు, డ్రెయిన్లు, ఇతర పనులకు రూ.2,090 కోట్లు వ్యయం చేయాలని ప్రతిపాదించారు. కొత్త మొక్కలు నాటేందుకు, పాత వాటిని నిర్వహించేందుకు రూ.200 కోట్లు, ఇతర వ్యయానికి రూ.137 కోట్లు వెచ్చించేందుకు అధికారులు ప్రతిపాదించారు.

వేతనం అతి తక్కువే

ఉపాధి హామీ పథకంలో భాగంగా రోజుకు ఇచ్చే వేతన కూలి రూ.257గా పరిగణించడం చాలా తక్కువగానే కూలీలు భావిస్తున్నారు. కూలి పనుల కోసం బయట ప్రాంతాలకు వలస వెళ్లిన వారికి రూ.350 నుంచి ఐదు వందల వరకు దక్కుతుండగా, స్థానికంగా ఉపాధి హామీలో మాత్రం రూ.257 ఖరారు చేస్తుండడంపై అనేక మంది పెదవి విరుస్తున్నారు. ఇదే సమయంలో తలసరి ఆదాయాన్ని రెండు లక్షల రూపాయలకుపైగా ప్రకటిస్తున్న తరుణంలో హామీ పథకంలో ఇచ్చే మొత్తం నెలకు ఏడు వేలుగా మాత్రమే ఉండగా, ఏడాదికి రూ.93 వేలుగా మాత్రమే కనిపిస్తుండడం గమనార్హం.

ఫోటో : టివి రమణ

విజయవాడలోని స్వరాజ్ మైదానంలో నిర్మిస్తున్న 150 అడుగుల అంబేద్కర్ విగ్రహ నిర్మాణ పనులను మంత్రుల కమిటీ గురువారం నాడు పరిశీలించింది.

'ఉక్కు'పై అఖిలపక్షం వేయండి

- ఎపి పరిరక్షణ జెఎసి కన్వీనర్ ప్రియాంక

ప్రజాశక్తి - ఉక్కునగరం (విశాఖపట్నం)

దీక్షా శిబిరంలో కన్వీనర్ ప్రియాంక

విశాఖ ఉక్కు పరిరక్షణ కోసం ఈ నెలాఖరుకు అన్ని రాజకీయ పార్టీలతో ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేయాలని ఆంధ్రప్రదేశ్ పరిరక్షణ జెఎసి కన్వీనర్ ప్రియాంక దండి డిమాండ్ చేశారు. స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యాన కూర్మన్నపాలెం కూడలిలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు గురువారానికి 735వ రోజుకు చేరాయి. దీక్షల్లో ఒబిసి సంఘం నాయకులు, ఉక్కు కార్మికులు కూర్చున్నారు. వారినుద్దేశించి ఆమె మాట్లాడుతూ రాష్ట్రానికి దశాబ్దాలుగా అన్యాయం జరుగుతూనే ఉందన్నారు. విభజన గాయం నుంచి తేరుకోకముందే రాష్ట్రంలో అతి పెద్ద ప్రభుత్వ రంగ సంస్థగా ఉన్న స్టీల్‌ప్లాంట్‌ను కేంద్ర ప్రభుత్వం ప్రయివేటు వ్యక్తులకు కట్టబెట్టే ప్రయత్నం చేస్తోందన్నారు. దేశంలో అన్ని స్టీల్‌ప్లాంట్లకు సొంత గనులు కేటాయించి విశాఖ ఉక్కు ఫ్యాక్టరీకి కేటాయించకపోవడం దారుణమన్నారు. స్టీల్ ప్లాంట్‌ను నిర్వీర్యం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలను పోరాటాలతో అడ్డుకుంటామని తెలిపారు. గత నెల 30న ఉక్కు పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉక్కు ప్రజా గర్జన సభలో రాష్ట్ర మంత్రి గుడివాడ అమర్‌నాథ్ ప్రభుత్వం తరుపున పోరాటానికి మద్దతు ఇస్తున్నట్టు ప్రకటించినప్పటికీ ఆ దిశగా ప్రభుత్వ చర్యలు కానరావడం లేదన్నారు. కార్యక్రమంలో జెఎసి కార్యనిర్వాహక కార్యదర్శి జగన్ మురారి, కార్యదర్శి నొల్లు నాగరాజు, ఒబిసి సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు అప్పారావు, శ్రీను, ఉక్కు పరిరక్షణ పోరాట కమిటి చైర్మన్ డి.ఆదినారాయణ, నాయకులు గంధం వెంకటరావు, బి.మధు, యు.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

రిషికొండ తవ్వకాలపై కేంద్ర ప్రభుత్వ అధికారులతో కమిటీ

ప్రజాశక్తి-అమరావతి

విశాఖ జిల్లా రిషికొండ తవ్వకాలపై సర్వే చేపట్టే నిమిత్తం కేంద్ర పర్యావరణ, అటవీ మంత్రిత్వ శాఖ (ఎంఒఇఎఫ్) పూర్తిగా కేంద్ర ప్రభుత్వ అధికారులతో ఒక కమిటీని ఏర్పాటు చేసింది. గతంలో కమిటీలో రాష్ట్ర ప్రభుత్వ అధికారులకు స్థానం కల్పించడంపై హైకోర్టు అభ్యంతరం చెప్పిన నేపథ్యంలో ఈ కమిటీని నియమించినట్లు హైకోర్టుకు కేంద్ర ప్రభుత్వం తెలిపింది. కమిటీ నివేదిక ఇవ్వడానికి ఎనిమిది వారాలు గడువు కావాలని కోరగా, హైకోర్టు నాలుగు వారాలు ఇచ్చింది. విచారణను మార్చి 16కు వాయిదా వేస్తూ చీఫ్ జస్టిస్ పికె మిశ్రా, న్యాయమూర్తి జస్టిస్ నైనాల జయసూర్యతో కూడిన ధర్మాసనం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. యందాడ గ్రామంలోని సర్వే నెంబర్ 19 పరిధిలోని కోస్టల్ రెగ్యులేషన్ జోన్లో చెట్ల నరికివేత, భూమి తవ్వకాలకు అధికారులు అనుమతులు ఇవ్వడాన్ని జనసేన కార్పొరేటర్ మూర్తి యాదవ్, విశాఖ తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణ వేర్వేరుగా పిల్స్ దాఖలు చేసిన విషయం తెలిసిందే.

ఐటికి గమ్యస్థానంగా విశాఖ

- రాష్ట్ర ఐటి శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ (విశాఖపట్నం)

ఐటికి గమ్యస్థానంగా విశాఖ నగరం నిలువనుందని రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వంతో కలిసి పల్సస్ సంస్థ దేశంలోని పలు ప్రధాన నగరాల్లో గ్లోబల్ టెక్ సమ్మిట్లు నిర్వహిస్తున్న నేపథ్యంలో విశాఖలో రెండు రోజులపాటు జరగనున్న సమ్మిట్ విఎంఆర్‌డిఎ చిల్డ్రన్స్ ఎరీనాలో గురువారం ప్రారంభమైంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ విదేశాల్లోని దిగ్గజ ఐటి కంపెనీలు ఆంధ్రప్రదేశ్‌లో, మరీ ముఖ్యంగా విశాఖలో తమ కార్యకలాపాలు ప్రారంభించేందుకు ఆసక్తి చూపుతున్నాయని తెలిపారు. ఐటి రంగంలో శిక్షణ పొందిన యువతకు కూడా విశాఖలో పుష్కలంగా అవకాశాలు ఉన్నాయన్నారు. ఇప్పటికే పలు ఐటి కంపెనీలు కార్యకలాపాలు నిర్వహిస్తున్నాయని, వచ్చే రెండు నెలల్లో ఇన్ఫోసిస్ వంటి కంపెనీలు ఇక్కడి నుంచి విధులు నిర్వహించే అవకాశం ఉందని తెలిపారు. విశాఖపట్నం, తిరుపతి, అనంతపురంలో ఇప్పటికే ఐటి పార్కులను ఏర్పాటు చేశామని, భోగాపురంలో త్వరలోనే కొత్త ఐటి పార్కును ఏర్పాటు చేయబోతున్నామని ఆయన వెల్లడించారు.

విశాఖలోని రుషికొండ వద్ద ఏర్పాటు చేయనున్న అదానీ డేటా సెంటర్‌కు సిఎం జగన్మోహన్‌రెడ్డి వచ్చే నెల మూడో తేదీన శంకుస్థాపన చేయనున్నారని పేర్కొన్నారు. రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజని మాట్లాడుతూ ఎపి డిజిటల్ హెల్త్ కేర్‌లో విప్లవాత్మక మార్పులకు నాంది కాబోతోందన్నారు. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి రాజన్నదొర మాట్లాడుతూ టెక్నాలజీ ద్వారా అటవీ ఉత్పత్తులకు ప్రాచుర్యం పెరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో సమ్మిట్ కన్వీనర్ గేదెల శ్రీనుబాబు, ఎంపి ఎంవివి సత్యనారాయణ పాల్గొన్నారు.

అభ్యుదయ సాహిత్యానికి చిరునామా సూర్యారావు

- శత జయంతి సభలో పలువురు వక్తలు
- పుస్తక మహోత్సవ్‌లో పలు పుస్తకాలు ఆవిష్కరణ

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్

అభ్యుదయ సాహిత్యానికి గొప్ప చిరునామా అవసరాల సూర్యారావు అని పలువురు వక్తలు అన్నారు. విజయవాడ బుక్ ఫెస్టివల్ సొసైటీ ఆధ్వర్యాన విజయవాడలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో జరుగుతున్న పుస్తక మహోత్సవ్‌లోని గొల్లపూడి మారుతీరావు వేదికపై రచయిత అవసరాల సూర్యారావు శత జయంతి సభ గురువారం సాయంత్రం జరిగింది. ఈ కార్యక్రమానికి ప్రధాన వక్తగా పెనుగొండ లక్ష్మీనారాయణ పాల్గొని మాట్లాడుతూ.. అవసరాల సూర్యారావు రచనలు అందరికీ నచ్చే విధంగా ఉంటాయన్నారు. ఆయన ఎన్నో రచనలు, కథలు, నాటికలు రాశారని తెలిపారు. సమాజాన్ని చైతన్యవంతంగా ఉండే విధంగా గొప్ప రచనలు చేశారన్నారు. సాహితీవేత్త డాక్టర్ గుమ్మా సాంబశివరావు మాట్లాడుతూ అవసరాల కథల సంపుటాలు పేరుతో రాసినవి ఎంతో మందిని ఆకట్టుకున్నాయన్నారు.

నల్లబూటు అనే నాటిక పోలీసు వ్యవస్థపై చక్కగా రాశారన్నారు. పంజరం నాటకం ఎంతో పేరు తీసుకువచ్చిందని తెలిపారు. ఎక్కువగా దళితులు, స్త్రీ ఇతివృత్తాలను తీసుకుని రచనలు చేశారన్నారు. సమానత్వ భావనను ప్రచారం చేయడానికి సాహిత్యాన్ని ఎన్నుకున్నారన్నారు. ఈ కార్యక్రమంలో గోళ్ల నారాయణరావు, విజయవాడ బుక్ ఫెస్టివల్ సొసైటీ అధ్యక్షులు మనోహర్ నాయుడు పాల్గొన్నారు.

కండీషన్స్ అప్లయ్ పుస్తకావిష్కరణ

గొల్లపూడి మారుతీరావు సాహిత్య వేదికపై లిఖిల ప్రెస్ ప్రచురించిన డాక్టర్ పసునూరి రవీందర్ కథల సంపుటి 'కండీషన్స్ అప్లయ్' పుస్తకావిష్కరణ జరిగింది. ఈ పుస్తకాన్ని ప్రముఖ కవి ఖాదర్ మొహియుద్దీన్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో డాక్టర్ కత్తి కళ్యాణ్, డాక్టర్ కాకాని సుధాకర్, అనిల్ డ్యానీ, కె.సజయ పాల్గొన్నారు.

కరణీయం పుస్తకావిష్కరణ

ప్రముఖ రచయిత ముత్తేవి రవీంద్రనాథ్ రచించిన కరణీయం పుస్తకాన్ని గ్రామీణ పేదరిక నిర్మూలనా సంస్థ సిఇఒ మహ్మద్ ఇంతియాజ్ ఆవిష్కరించారు. ఆంధ్రా లయోలా కళాశాల విశ్రాంత ఉపన్యాసకులు డాక్టర్ గుమ్మా సాంబశివరావు గ్రంథ సమీక్ష నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పోలవరపు సాంస్కృతిక సమితి అధ్యక్షులు గోళ్ల నారాయణరావు, విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్ జనరల్ మేనేజర్ టి. మనోహర్ నాయుడు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న పెనుగొండ లక్ష్మీనారాయణ

సంక్షేమ భవన నిర్మాణ పనుల్లో వేగం

- మంత్రి మేరుగ నాగార్జున

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్ర వ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లో జరుగుతున్న సాంఘిక సంక్షేమశాఖ గురుకులాలకు చెందిన నిర్మాణ పనుల్లో వేగం పెంచాలని అధికారులను ఆ శాఖ మంత్రి మేరుగ నాగార్జున ఆదేశించారు. వీటిపై అధికారుల పర్యవేక్షణ మరింత పటిష్టంగా ఉండాలని చెప్పారు. గురుకుల విద్యాలయాల సంస్థలకు సంబంధించి రాష్ట్రంలో నిర్మాణంలో ఉన్న పనుల పురోగతిని సచివాలయంలో మంత్రి గురువారం సమీక్షించారు. భవనాల నిర్వహణ మరమ్మతులకు సంబంధించి మొత్తం 507 పనులను రూ.1,061 కోట్లతో మంజూరు చేసినట్లు మంత్రి తెలిపారు. 474 భవనాల నిర్మాణాలను ప్రారంభించామని, 420 భవనాల నిర్మాణాన్ని రూ.723 కోట్లతో పూర్తి చేసినట్లు పేర్కొన్నారు. మరో 32 పనులు తుదిదశలో ఉన్నాయని తెలిపారు. 22 పనులు పురోగతిలో ఉన్నాయని చెప్పారు. పనులను పూర్తిచేయడంలో ఎక్కడా జాప్యం జరగకుండా చూసుకోవాలని ఆదేశించారు. ఈ సమావేశంలో ఆ శాఖ డైరెక్టరు హర్షవర్ధన్, గురుకుల విద్యాలయాల సంస్థ కార్యదర్శి పావనమూర్తి, ఎపిఇడబ్ల్యుఐడిసి చీఫ్ ఇంజినీరు గోపిచంద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రశ్నించే హక్కును హరిస్తున్న సిఎం : అయ్యన్న

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

ప్రజాస్వామ్య దేశంలో ప్రభుత్వాలు తప్పు చేస్తున్నపుడు ప్రశ్నించే హక్కు ప్రతి పౌరుడికి ఉంటుందని మాజీ మంత్రి చింతకాయల అయ్యన్నపాత్రుడు అన్నారు. గుంటూరులోని టిడిపి కార్యాలయంలో గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి శాడిజం వల్ల అనేక మంది ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు.

ఎంతోమందిపై హత్యాప్రయత్నాలు, హత్యలు, ఆస్తుల దోపిడీలు జరిగాయన్నారు. వీటిని ప్రశ్నిస్తే కేసులు పెడుతున్నారని విమర్శించారు. తన ఇద్దరు కుమారులు ప్రజావ్యతిరేక విధానాలను అవలంబిస్తోన్న ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాడుతున్నారని తెలిపారు. సమావేశంలో టిడిపి నాయకులు నక్కా ఆనందబాబు, వెలగపూడి రామకష్ణ, బుద్ధా వెంకన్న, చింతకాయల విజయ్ తదితరులు పాల్గొన్నారు.

సిఐడి విచారణకు విజయ్ హాజరు

అయ్యన్నపాత్రుడు కుమారుడు చింతకాయల విజయ్ గురువారం గుంటూరులోని సిఐడి అధికారుల ఎదుట విచారణకు హాజరయ్యారు. గతంలో భారతి పేరిట సోషల్ మీడియాలో వైరల్ అయిన ఓ వీడియోను పోస్టు చేసిన కేసులో విజయ్‌కు సిఐడి అధికారులు నోటీసులు జారీ చేశారు. గత నెల 30న విచారణకు హాజరు కాగా, ఈ నెల

మీడియాతో మాట్లాడుతున్న అయ్యన్న పాత్రుడు

16న మరోసారి రావాలని సిఐడి అధికారులు నోటీసులివ్వడంతో ఆయన విచారణకు హాజరయ్యారు. విచారణ అనంతరం విజయ్ మాట్లాడుతూ.. తనపై 42 ప్రశ్నలు సంధించారని, తనకు సంబంధంలేని ప్రశ్నలతో వేధించారని అన్నారు. విచారణకు తాను పూర్తిగా సహకరించానని తెలిపారు. బిసిలను వేధించడమే ప్రభుత్వం పనిగా పెట్టుకుందని ఆరోపించారు.

హాల్ టిక్కెట్లు ఇవ్వకపోతే చర్యలు

- ఇంటర్ బోర్డు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఇంటర్ విద్యార్థులకు హాల్ టిక్కెట్లు ఇవ్వకపోతే చర్యలు తీసుకుంటామని జూనియర్ కళాశాలల యాజమాన్యాలకు ఇంటర్మీడియట్ బోర్డు కార్యదర్శి ఎంవి శేషగిరి బాబు హెచ్చరించారు. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. నిబంధనల ప్రకారం హాజరు సరిపోయిన ప్రతి విద్యార్థికీ హాల్ టిక్కెట్లు అందించాలని పేర్కొన్నారు. హాల్ టిక్కెట్లు ఇవ్వని కళాశాలలపై విద్యార్థుల తల్లిదండ్రులు తమకు ఫిర్యాదు చేయవచ్చునని తెలిపారు. దీనికోసం టోల్‌ఫ్రీ నెంబర్ 18004257635కు ఉదయం 9 నుంచి సాయంత్రం 6 గంటల లోపు ఫిర్యాదు చేయాలని పేర్కొన్నారు.

ఎన్‌టిఆర్ నాణెం'పై హర్షం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

టిడిపి వ్యవస్థాపకులు, మాజీ ముఖ్యమంత్రి ఎన్‌టి రామారావు బొమ్మను రూ.100 వెండి నాణెంపై ముద్రించేందుకు కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం సంతోషకరమని టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. తెలుగువారందరికీ ఇది గర్వకారణమని పేర్కొన్నారు.

బెంచ్ హంటింగ్‌పై జగన్ నోరువిప్పాలి

- టిడిపి నేత వర్ల డిమాండ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

భారతి సిమెంట్స్ ఆస్తుల జప్తుపై సుప్రీం కోర్టులో జరగబోయే వాదనల్లో బెంచ్ హంటింగ్ జరిగిందన్న వార్తలపై సిఎం జగన్ నోరువిప్పాలని టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు వర్ల రామయ్య డిమాండ్ చేశారు. హంటింగ్ వ్యవహారంతో జగన్ తన పతనానికి తానే నాంది పలికారని విమర్శించారు. టిడిపి కార్యాలయం ఎన్‌టిఆర్ భవన్‌లో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. బెంచ్ హంటింగ్ జరిగిందని ఆధారాలతో జర్నలిస్ట్ సౌరవ్‌దాస్ బయటపెట్టారని తెలిపారు. హంటింగ్ ఎలా జరిగిందో సిఎం జగన్ సమాధానం చెప్పాలని, దీనిపై ఎందుకు ప్రకటన చేయరని ప్రశ్నించారు.

రాణి హత్యపై జాతీయ ఎస్‌సి కమిషన్‌కు ఫిర్యాదు

తాడేపల్లిలో ఇటీవల జరిగిన ఎస్తేర్ రాణి హత్యపై జాతీయ ఎస్‌సి కమిషన్‌లో వర్ల రామయ్య ఫిర్యాదు చేశారు. తాడేపల్లిలో సిఎం నివాసం, డిజిపి కార్యాలయాలు ఉన్నప్పటికీ మహిళలకు రక్షణ కరువైందని పేర్కొన్నారు.

అవినీతికి మారుపేరు చంద్రబాబు

- శాప్ ఛైర్మన్ బైరెడ్డి సిద్ధార్థరెడ్డి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

టిడిపి అధినేత చంద్రబాబు, ఆయన కుమారుడు నారా లోకేష్ అవినీతి పరులని శాప్ ఛైర్మన్ బైరెడ్డి సిద్ధార్థరెడ్డి విమర్శించారు. 2014 నుంచి 2019 మధ్య సీమెన్స్ అనే కంపెనీ నుంచి రూ.250 కోట్లను వారు దోచుకున్నారని తెలిపారు. తాడేపల్లిలోని వైసిపి కేంద్ర కార్యాలయంలో గురువారం ఆయన మీడియాతో మాట్లాడారు. చంద్రబాబు, లోకేష్ ముందు రాష్ట్రంలో నివాసం ఉండాలని, అప్పుడే వారికి రాష్ట్ర రాజకీయాలు చేసే అర్హత వస్తుందని అన్నారు. మహిళ అని చూడకుండా మంత్రి రోజాను ఇష్టమొచ్చినట్లు మాట్లాడటం తగదన్నారు. సీమెన్స్ కంపెనీకి చెందిన రూ.250 కోట్లపై లోతుగా విచారణ చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో విద్య, వైద్య రంగాల్లో సమూల మార్పులు తెచ్చి వైసిపి ప్రభుత్వం ప్రజలకు బాగా చేరువైందని తెలిపారు.

హిందూత్వ, కార్పొరేట్లపై ద్విముఖపోరు

(మొదటి పేజీ తరువాయి)

హిందూత్వ శక్తులకు వ్యతిరేకంగా కూడా పోరాటం చేయడం ద్వారానే బిజెపిని ఓడించలగమని పేర్కొన్నారు. బిజెపి విధానాలకు వ్యతిరేకరంగా రాజకీయ ప్రత్యామ్నాయాన్ని నిర్మించాలని అన్నారు. ప్రజల మౌలిక అవసరాల కోసం పోరాడుతూనే వారి హిందూత్వ సిద్ధాంతానికి వ్యతిరేకంగా పోరాడాలని సూచించారు.

ఆహార భద్రత అనే అంశంపై ప్రొఫెసర్ మధుర స్వామినాథన్ మాట్లాడుతూ, దేశంలో ఆహార భద్రత అవసరాన్ని వివరించారు. ఆహార భద్రత అంటే భౌతికంగా అవసరాలు తీరడమే కాదని, ఆర్థికంగా అవసరాలు కూడా తీరాలని అన్నారు. సరైన ఆహారం, పౌష్టికాహారం ప్రజలకు అందాలన్నారు. నీరు, శానిటేషన్ మెరుగ్గా కల్పించాలన్నారు. ఈ ఏడాది పంటలు బాగా పండి 240 కోట్ల టన్నుల దిగుబడి వచ్చిందని, అయినా పౌష్టికాహారాన్ని అందించలేకపోతున్నారని పేర్కొన్నారు. ఆహార భద్రత విషయంలో 150 దేశాల్లో మనదేశం 137 స్థానంలో ఉందని, నేపాల్, బంగ్లాదేశ్‌కన్నా తక్కువస్థాయిలో ఉన్నామని చెప్పారు. ఆహార భద్రతకు ఈ బడ్జెట్లో 90 వేల కోట్లు తగ్గించారని తెలిపారు. గ్రామీణ ఉపాధి రోజురోజుకూ కుచించుకుపోతోందన్నారు.

వ్యవసాయంలో యాంత్రీకరణ వల్ల ఉపాధి తగ్గుతోందని, దీని ప్రభావం మహిళలపై ఎక్కువగా ఉందని తెలిపారు. వ్యవసాయేతర రంగాల్లోనూ ఉపాధి క్షీణించిందని, మహిళలు వలస బాట పడుతున్నారని ఆమె చెప్పారు. వేతనాల్లోనూ పురుషులకు మహిళలకు మధ్య వ్యత్యాసం చాలా తీవ్రంగా ఉందన్నారు. పురుషులకు 360 రూపాయలు ఉంటే మహిళలకు 269 రూపాయలు ఇస్తున్నారని వివరించారు. 50 శాతం పురుషులకు, 70 శాతం మహిళలకు కనీస వేతనం దక్కడం లేదని, ఒక్క కేరళలో మాత్రమే పురుషులకు 825, మహిళలకు 525 వేతనం ఇస్తున్నారని అన్నారు. యుపి, గుజరాత్, మధ్యప్రదేశ్ రాష్ట్రాల్లో వేతనాలు చాలా తక్కువ అన్నారు. 2011-12 లెక్కల ప్రకారం ఆహార సంక్షోభం తీవ్రమైందని అన్నారు. ప్రజాపంపిణీలో కనీసావసర వస్తువులు కూడా సరఫరా చేయాలన్నారు. గ్రామాల్లోనూ కిరాణా షాపుల్లో వస్తువులు ఎక్కువ ధరలకు అమ్ముతున్నారని, దీనివల్ల పేదలు అనేక ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. గ్రామీణ ప్రాంతాల్లో 30 శాతం ప్రజానీకానికి కనీస మౌలిక సదుపాయాలు లేవని అన్నారు.

భూ పంపిణీ అంశంపై ప్రొఫెసర్ రామ్‌కుమార్ మాట్లాడుతూ.. దేశంలో 1.20 కోట్ల ఎకరాల సాగుకు ఉపయోగపడే మిగులు భూమి ఉందని, దాన్ని పేదలకు పంచకుండా ప్రభుత్వాలు తొక్కిపెడుతున్నాయని చెప్పారు. భూదాన్ భూములని చెప్పినా అవి ఎక్కడ ఉన్నాయో ఎవరి చేతుల్లో ఉన్నాయో ఇప్పటికీ లెక్క తెలియదన్నారు. ఎపి తెలంగాణాలో 54 శాతం భూమిలేని పేదలు ఉన్నారని తెలిపారు.

రాజ్యాంగంపై దాడి అనే అంశంపై వికాస్ రంజన్ భట్టాచార్య మాట్లాడుతూ.. దోపిడీకి, మతోన్మాదానికి వీలుగా రాజ్యాంగాన్ని మార్చేస్తున్నారని తెలిపారు. ప్రశ్నించిన వారిని చంపడమో, అరెస్టులు చేయడమో చేస్తున్నారని విమర్శించారు. విజయరాఘవన్ అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో ఎఐఎడబ్ల్యుయు ప్రధాన కార్యదర్శి వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

హోరాహోరీగా హాకీ పోటీలు

- తమిళనాడు చేతిలో అండమాన్ జట్టు
- మహారాష్ట్ర చేతిలో పాండిచ్చేరి జట్టు ఓటమి

ప్రజాశక్తి - కాకినాడ కార్పొరేషన్

13వ హాకీ ఇండియా సీనియర్ మహిళల జాతీయ ఛాంపియన్‌షిప్ పోటీలు కాకినాడ జిల్లా క్రీడాప్రాధికార సంస్థ మైదానంలో గురువారం రెండో రోజు హోరాహోరీగా జరిగాయి. ఉదయం 9 గంటలకు మహారాష్ట్ర, పాండిచ్చేరి జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో పాండిచ్చేరిపై మహారాష్ట్ర జట్టు ఏడు గోల్స్ వేసి విజయం సాధించింది. మొదటి నిమిషం నుంచే మహారాష్ట్ర దూకుడును ప్రదర్శిస్తూ పాండిచ్చేరి జట్టుకు చుక్కలు చూపించింది. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్‌గా మానశ్రీ నరేంద్ర సుజ్జి నిలిచారు. తమిళనాడు- అండమాన్ నికోబార్ జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో ఏమాత్రం పోరాట పటిమ చూపించకుండానే అండమాన్ జట్టు చేతులెత్తేసింది. ప్రత్యర్థి తమిళనాడు జట్టు గోల్స్ వేస్తుంటే కనీసం గోల్స్‌ను ఆపలేకపోయింది. తమిళనాడు టీమ్ ఏకంగా 32 గోల్స్ వేసిందంటే అండమాన్ నికోబార్ టీం ఏ విధంగా చేతులెత్తేసిందో అర్థం చేసుకోవచ్చు. తమిళనాడు టీమ్ కి చెందిన ప్రియాంక ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ గా నిలిచింది.

నేటి మ్యాచ్ వివరాలు

17న ఉదయం 7:00 గంటలకు: ఒడిస్సా- కేరళ, 8:45 గంటలకు మధ్యప్రదేశ్-తెలంగాణ, 10:30 గంటలకు హిమాచల్ - గుజరాత్, సాయంత్రం 3:45 గంటలకు ఆంధ్రప్రదేశ్ - బెంగాల్ జట్ల మధ్య పోటీలు జరగనున్నాయి.

మృతి చెందిన పెద్ద ఓబయ్య

ఇద్దరు కౌలురైతుల ఆత్మహత్య

ప్రజాశక్తి-యల్లనూరు, చాగలమర్రి

అప్పుల భారం భరించలేక ఇద్దరు కౌలు రైతులు గురువారం ఆత్మహత్య చేసుకున్నారు. అనంతపురం జిల్లా యల్లనూరు మండలం వాసాపురం గ్రామానికి చెందిన మొగోల్లా పెద్ద ఓబయ్య(57) తనకున్న నాలుగు ఎకరాల పొలంతో పాటు మరో నాలుగు ఎకరాలను కౌలుకు తీసుకుని మొక్కజొన్న పంట సాగుచేశారు. పంట సాగు, ఇద్దరు పిల్లల చదువులకు సుమారు రూ.ఎనిమిది లక్షల వరకు అప్పు చేశారు. గత మూడేళ్లుగా పంటలు చేతికందకపోవడంతో అప్పుల భారం అధికమైంది. అప్పులు తీరేదారి లేక పొలంలోనే చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు.

నంద్యాల జిల్లా చాగలమర్రి మండలం చిన్నవంగలి గ్రామం కౌలు రైతు పంగా శివశంకర్(46) ఐదు సంవత్సరాల క్రితం కడప జిల్లా ఈడిగేపల్లె నుంచి చిన్నవంగలి గ్రామానికి కుటుంబంతో కలిసి వలస వచ్చారు. కూలీ పనులు చేసుకుంటూనే రెండు ఎకరాలు కౌలుకు తీసుకుని అరటి, మినుము పంటలు సాగు చేశారు. గత మూడేళ్లుగా పంటలు దక్కకపోవడంతో సుమారు రూ.ఐదులక్షల వరకు అప్పులపాలయ్యారు. అప్పులు తీరే దారిలేక ఇంట్లోకి ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు.

పెన్షన్ స్కీమ్‌లో హయ్యర్ ఆప్షన్ తిరస్కరణ తగదు

- ఎస్‌డబ్ల్యుఎఫ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఆర్‌టిసి ఉద్యోగులకు పెన్షన్ స్కీమ్‌లో హయ్యర్ ఆప్షన్‌ను అమలు చేసే అంశంలో సుప్రీం కోర్టు తీర్పును అమలు చేయాలని ఎపిపిటిడి స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ డిమాండ్ చేసింది. సుప్రీం కోర్టు తీర్పు మేరకు హయ్యర్ పెన్షన్ కోసం ఆర్‌టిసి ఉద్యోగులు దరఖాస్తు చేసుకుంటే వాటిని తిరస్కరించడం తగదని పేర్కొంది. ఈ మేరకు ఎస్‌డబ్ల్యుఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు సిహెచ్ సుందరయ్య, అయ్యపరెడ్డి గరువారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ పెన్షన్ ఆప్షన్ ఫారంలను ప్రావిడెంట్ ఫండ్ సంస్థ తిరస్కరిస్తోందని, ఇది తగదని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం జోక్యం చేసుకుని పెన్షన్ స్కీమ్ హయ్యర్ ఆప్షన్ దరఖాస్తులను ఆమోదించాలని కోరారు.

‘మద్దతు’ కోసం పప్పుశనగ రైతు ఎదురు చూపు..!

- ఆదేశాలే ఆచరణకు రాలేదు..

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

కనీస మద్దతు ధర కోసం పప్పుశనగ రైతులు ఎదురు చూస్తున్నారు. రబీలో సాగైన పంట నూర్పిడులు జరుగుతున్నా సేకరణ మాత్రం ప్రారంభం కాలేదు. దీంతో రైతులు ప్రయివేటు వ్యాపారులను ఆశ్రయిస్తున్నారు. వారు అడిగిన ధరకే పంటను అమ్ముతున్నారు.

ఉమ్మడి అనంతపురం జిల్లాలో నల్లరేగడి నేలలున్న ప్రాంతాల్లో పప్పుశనగ పంట పెద్దఎత్తున సాగవుతుంది. రబీలో 1.60 లక్షల ఎకరాలు సాగు చేశారు. అనంతపురం జిల్లా పరిధిలోనే 1.56 లక్షల ఎకరాల్లో పప్పుశనగ పంట సాగైంది. ఈ పంట ఇప్పుడు చేతికొచ్చి నూర్పిడిలు జరుగుతున్నాయి. ప్రతి పంటనూ కొనుగోలు చేస్తామని ప్రకటించిన ప్రభుత్వం ఇప్పటి వరకు కొనుగోలు ప్రారంభించలేదు. రైతు భరోసా కేంద్రాల్లో పేర్ల నమోదు ప్రక్రియ మాత్రమే మొదలైంది. ఎప్పటి నుంచి సేకరణ ప్రారంభమవుతుందో తెలియక రైతులు ప్రయివేటు వ్యాపారులను ఆశ్రయించాల్సి వస్తోంది.

క్వింటా రూ.4500కే కొనుగోలు

పప్పుశనగ పంటకు ప్రభుత్వం ప్రకటించిన కనీస మద్దతు ధర క్వింటాళుకు రూ.5330 ఉంది. ప్రస్తుతం బహిరంగ మార్కెట్‌లో ప్రయివేటు వ్యాపారులు కొనుగోలు చేస్తున్నది క్వింటా రూ.4500 వరకు మాత్రమే ఉంది. కనీస మద్దతు ధర కంటే రూ.830 తక్కువ ధరకు రైతులు అమ్ముకోవాల్సిన వస్తోంది. పంట విత్తుకునే సమయంలో

ప్రభుత్వం సబ్సిడీతో ఇచ్చిన ధరనే క్వింటా రూ.5200 ఉంది. సబ్సిడీ కాకుండా క్వింటా రూ.6100గా నిర్ణయించి రైతులకు ఇచ్చింది. ఇప్పుడు చూస్తే క్వింటా ధర రూ.4500 మాత్రమే ఉండటంతో ప్రభుత్వం తక్షణం మద్దతు ధరకు పప్పుశనగ కొనుగోలు చేయాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. ప్రభుత్వం కొనుగోలు చేసినా ఒక్కో రైతు నుంచి 25 క్వింటాళ్లు వరకు మాత్రమే పరిమితి ఉంది. ఆపైన పండిన పంటను రైతుల నుంచి కొనుగోళు చేయడం లేదు. దీంతో మూడు ఎకరాలపైనున్న రైతులు తక్కిన పంటను బయట అమ్ముకోవాల్సి వస్తోంది. ఎందుకంటే ఎకరానికి ఎనిమిది నుంచి తొమ్మిది క్వింటాళ్ల వరకు దిగుబడి వస్తుంది. అంటే మూడు ఎకరాల రైతుకు పూరి స్థాయిలో పంట తొమ్మిది క్వింటాళ్లు వస్తే మూడు ఎకరాలకే 27 క్వింటాళ్ల దిగుబడి వస్తుంది. ఆపైన భూమి కలిగిన రైతులు బహిరంగ మార్కెట్‌పైనే ఆధారపడాల్సి వస్తుంది.

తొమ్మిది ఎకరాల్లో పంట వేశాను

తొమ్మిది ఎకరాల్లో పప్పుశనగ పంటను సాగు చేశాను. ఎకరానికి రూ.15 వేల వరకు ఖర్చు వచ్చింది. తొమ్మిది ఎకరాలకు కలిపి మొత్తం రూ.1.35 లక్షలు పెట్టుబడి వచ్చింది. వర్షాలతో దిగుబడి కొంత తగ్గినా మొత్తం 50 క్వింటాళ్ల వరకు దిగుబడి వచ్చింది. ఇప్పుడు ఈ పంటను కొనేవారు లేరు. ప్రభుత్వం కొనుగోలు ఇంకా ప్రారంభించలేదు. కేవలం పేర్లు నమోదు మాత్రమే చేసుకుంటున్నారు. వారు ఎప్పుడు కొనుగోళ్లు ప్రారంభిస్తారో తెలియదు. బయట చూస్తే క్వింటా రూ.4500 వరకు మాత్రమే ధర ఉంది. ఏమి చేయాలో పాలుపోవడం లేదు.

రమేష్ రైతు, రావి వెంకటాంపల్లి గ్రామం, తాడిపత్రి మండలం.

ప్రభుత్వం కొనుగోళ్లు ప్రారంభించాలి

పప్పుశనగను ప్రభుత్వం కొనుగోలు చేస్తామని మాటలు మాత్రమే చెబుతోంది. ఆచరణలో కొనుగోళ్లు ఇంకా ప్రారంభించలేదు. ఇప్పటికే 70 శాతానికిపైగా పంట నూర్పిడి పూర్తయ్యింది. రైతులు ఇళ్లలో పెట్టుకునే పరిస్థితుల్లేవు. బయట ధర కూడా లేదు. అందుకే తక్షణం ప్రభుత్వం కొనుగోళ్లు ప్రారంభించాలి. కనీస మద్దతు ధరకు కొనుగోళ్లు చేపట్టాలి.

చంద్రశేఖర్‌రెడ్డి , ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి.

వ్యవసాయ మీటర్లు పెడుతుంటే తరిమికొట్టండి

- యువగళం పాదయాత్రలో నారా లోకేష్

ప్రజాశక్తి - కెవిబిపురం (తిరుపతి జిల్లా)

‘వ్యవసాయ మోటార్లకు విద్యుత్ మీటర్లు పెట్టేందుకు అధికారులు మీ గ్రామాలకు వస్తే ఊరుకోవద్దు.. తరిమికొట్టండి.. కేసులు పెట్టినా భయపడొద్దు..’ అని టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ అన్నారు. యువగళం పేరుతో లోకేష్ చేపట్టిన పాదయాత్ర గురువారం 21వ రోజుకు చేరుకుంది. తిరుపతి జిల్లా కెవిబిపురం మండలం రాయపేడు విడిది కేంద్రం నుంచి ప్రారంభమైన పాదయాత్ర కెవిపిపురం జంక్షన్, రాజుల కండ్రిగ, రాగిగుంట, తిమ్మనాయుడు గుంట, తిమ్మసముద్రం మీదుగా బైరేజి కండ్రిక వరకు సాగింది.

రాజులకండ్రిగలో రైతులతో లోకేష్ మాట్లాడుతూ సైకో ప్రభుత్వంలో రైతులకు అన్యాయం జరుగుతోందని తెలిపారు. పంటకు సరైన గిట్టుబాటు ధర కల్పించడం లేదన్నారు. వ్యవసాయానికి మీటర్లు పెడితే పగలగొట్టాలని పిలుపునిచ్చారు. మీటర్లు పెట్టేందుకు రైతులు ఎవరూ అంగీకరించొద్దని సూచించారు. రాయపేడులో యువతతో ముఖాముఖి నిర్వహించారు. ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి యువతకు ఇచ్చిన హామీలను అమలు చేయడంతో ఘోరంగా విఫలమయ్యారని అన్నారు. జగన్ ప్యాలెస్‌లో ఉన్నారని, రాష్ట్ర యువత నడి రోడ్డుమీద ఉన్నారని విమర్శించారు. యువకుల జీవితాలను నాశనం చేసిన ఘనత జగన్మోహన్‌రెడ్డికే

రైతులతో మాట్లాడుతున్న నారా లోకేష్

దక్కుతుందన్నారు. తిమ్మసముద్రం గ్రామంలో ఎస్‌టిలతో, రాగిగుంటలో ముదిరాజ్ కులస్తులతో సమావేశమయ్యారు. ముదిరాజ్‌లను బిసి-డి నుంచి బిసి-ఎకి మార్చాలని డిమాండ్ చేశారు. కెవిపురం మండలం పాతపాలు పంచాయతీకి చెందిన వరలక్ష్మి లోకేష్ వద్ద తన ఆవేదనను వ్యక్తం చేశారు. ఇటీవల కురిసిన వర్షాలకు చెరువులో గండి పడడంతో రైతులతో కలిసి తన భర్త కాసరం రమేష్ వెళ్లారని, కట్టపై పనిచేస్తూ ప్రమాదవశాత్తు కాలుజారి తూములో ఇరుక్కుని మృతి చెందారన్నారు. తమను ఆదుకోవాలని లోకేష్‌కు వినతి పత్రం అందజేశారు. దీనిపై లోకేష్ స్పందిస్తూ టిడిపి హయాంలో చంద్రన్న బీమా అందజేసేవారమని, ఈ ప్రభుత్వంలో ఆ పథకం ఆచూకీ లేదన్నారు. ఈ సమస్యను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారమయ్యేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. లోకేష్ పాదయాత్ర బైరేజి కండ్రిక గ్రామానికి చేరుకుంది. రాత్రికి ఆయన అక్కడి విడిది కేంద్రంలో బసచేశారు.

కడపలో ఉద్రిక్తత

- వైసిపి, టిడిపి నాయకుల బహిరంగ చర్చను అడ్డుకున్న పోలీసులు

ప్రజాశక్తి - కడప

కడప నియోజకవర్గ అభివృద్ధిపై వైసిపి, టిడిపి నాయకుల సవాళ్లతో ఉద్రిక్తత చోటుచేసుకుంది. గురువారం చర్చకు సిద్ధమంటూ కడప ఏడు రోడ్ల కూడలి వద్దకు వైసిపి నాయకులు చేరుకున్నారు. దీంతో కడప డిఎస్‌పి వెంకటశివారెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని వారిని అడ్డుకున్నారు. జిల్లాలో 30 పోలీస్ యాక్టు, ఎన్నికల్ కోడ్ అమలులో ఉండడంతో బహిరంగ చర్చలు నిర్వహించరాదని నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. ఈ నేపథ్యంలో పోలీసులకు, వైసిపి నేతలకు మధ్య తోపులాట చోటు చేసుకుంది. వైసిపి నాయకులను అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు. అదే పార్టీకి చెందిన మహిళా నాయకులు రోడ్డుపై బైఠాయించి టిడిపికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఇంతలో డిప్యూటీ మేయర్ నిత్యానంద రెడ్డితోపాటు కార్పొరేటర్లు అక్కడికి చేరుకున్నారు. మరోపక్క బహిరంగ చర్చకు టిడిపి నాయకులు రాకుండా హౌస్ అరెస్టు చేశారు. టిడిపి పోలిట్ బ్యూరో సభ్యులు శ్రీనివాసులరెడ్డి, రాష్ట్ర కార్యదర్శి హరిప్రసాద్ ఇళ్ల వద్ద గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. డిప్యూటీ సిఎం అంజాద్‌బాషా ఇంటి వద్ద పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

అధికారుల ముందు విలపిస్తున్న విద్యార్థినులు

ఆకలేస్తోంది.. అన్నం పెట్టండి..

- కాలేజీ గేటు వద్ద ఎస్‌సి బాలికల హాస్టల్ విద్యార్థుల ఆవేదన

ప్రజాశక్తి-సింగరాయకొండ (ప్రకాశం జిల్లా)

ఆకలేస్తోంది.. అన్నం పెట్టండి అంటూ ఎస్‌సి హాస్టల్‌లో ఉంటున్న ఇంటర్ విద్యార్థులు కళాశాల గేటు వద్ద బోరున విలపించిన ఘటన ప్రకాశం జిల్లా సింగరాయకొండ ప్రభుత్వ సోషల్ వెల్ఫేర్ కాలేజీ వద్ద గురువారం జరిగింది. సింగరాయకొండ గవర్నమెంట్ సోషల్ వెల్ఫేర్ హాస్టల్ మూలగుంటపాడులోని ఓ అద్దె నివాసంలో ఉంది. ఈ హాస్టల్‌లో ఇంటర్ చదివే తొమ్మిది మంది విద్యార్థినులు ఉన్నారు. అన్నం సరిగా ఉండటం లేదని, సరిపడా పెట్టడం లేదని విద్యార్థినులు కన్నీటి పర్యంతమయ్యారు. ప్రతిరోజు ఇలాగే జరగుతుండటంతో విద్యార్థులు రోడెక్కారు. విషయం తెలుసుకున్న కళాశాల అధ్యాపకులు వారి వద్దకు వచ్చి, తినడానికి టిఫెన్ ఇచ్చారు. విద్యార్థులకు భోజనం ఎందుకు పెట్టడం లేదని వార్డెన్‌ను నిలదీశారు. ఈ విషయాన్ని తహశీల్దార్, ఎంఆర్‌ఒకు చేరవేశారు. వారిద్దరూ హాస్టల్ వద్దకు చేరుకుని విద్యార్థులతో మాట్లాడారు. అధ్యాపకులు ఇచ్చిన టిఫిన్ చేసినా.. తాగడానికి మంచి నీళ్లు లేవని విద్యార్థులు అధికారుల దృష్టికి తెచ్చారు. మీ అందరినీ మండల కాంప్లెక్స్‌లో ఉన్న బిసి బాలికల హాస్టల్‌కు తరలించే ప్రయత్నం చేస్తామని, ఉన్నతాధికారులకు నివేదిక పంపించి సిబ్బందిపై చర్యలు తీసుకునే విధంగా చూస్తామని అధికారులు హామీనిచ్చారు.. ఎస్ఎఫ్ఐ మాజీ నాయకులు, కెవిపిఎస్ సింగరాయకొండ మండల అధ్యక్షులు పేమల బాబురావు హాస్టల్‌ను పరిశీలించి.. విద్యార్థులతో మాట్లాడారు. వార్డెన్‌ను సస్పెండ్ చేయాలని జిల్లా అధికారులకు లేఖ రాశారు.

బడ్జెట్‌లో రూ.2 వేల కోట్లు కేటాయించాలి

- ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం డిమాండ్
- 28న సచివాలయాలు, తహశీల్దార్ కార్యాలయాల వద్ద ధర్నాకు పిలుపు

ప్రజాశక్తి - మంగళగిరి (గుంటూరు జిల్లా)

చేనేత రంగానికి 2023-24 రాష్ట్ర బడ్జెట్‌లో రూ.రెండు వేల కోట్లు కేటాయించాలనే డిమాండ్‌తో రాష్ట్రవ్యాప్తంగా అన్ని సచివాలయాలు, తహశీల్దార్ కార్యాలయాల వద్ద ఈనెల 28న నిర్వహించే ధర్నాల్లో చేనేత కార్మికులందరూ పాల్గొనాలని ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.బాలకృష్ణ కోరారు. ఈనెల 15న సంఘం రాష్ట్ర కమిటీ సమావేశం సత్యసాయి జిల్లా ధర్మవరంలో నిర్వహించగా సమావేశ నిర్ణయాలను ఆయన గురువారం ఒక ప్రకటన ద్వారా వెల్లడించారు. నేతన్న నేస్తం పథకాన్ని ప్రతి చేనేత కార్మికునికీ, షెడ్డు కార్మికులకూ వర్తింపజేయాలని, మగ్గం షెడ్డుతో కూడిన ఇంటిని ప్రభుత్వమే ఉచితంగా నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. చేనేతకు కేటాయించిన 11 రకాల రిజర్వేషన్లను అమలు చేయడంతోపాటు దాన్ని ఉల్లంఘించిన వారిపై చర్యలు తీసుకోవాలని, ప్రతి కార్మికునికి 200 యూనిట్ల విద్యుత్‌ను ఉచితంగా ఇవ్వాలని, చేనేతపై జిఎస్‌టి రద్దు చేయాలని కోరారు. చేనేత సహకార సంఘాలకు ఇవ్వాల్సిన బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

ఢిల్లీ మద్యం కుంభకోణంలో

నిందితులకు బెయిల్ నిరాకరణ

- సిబిఐ ప్రత్యేక కోర్టు తీర్పు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

ఢిల్లీ మద్యం కుంభకోణంలో మనీ ల్యాండరింగ్ వ్యవహారంలో అరబిందో శరత్ చంద్రారెడ్డితోపాటు మరో నలుగురు నిందితుల బెయిల్ పిటిషన్లను రౌస్ అవెన్యూలోని సిబిఐ ప్రత్యేక కోర్టు తిరస్కరించింది. వ్యాపార సంస్థలు ఒప్పందం కుదుర్చుకోవడం మద్యం పాలసీ ఉల్లంఘించడమే, కానీ నేరం కాదన్న నిందితుల వాదనను కోర్టు వ్యతిరేకించింది. లిక్కర్ స్కాం వ్యవహారంలో ప్రివెన్షన్ ఆఫ్ మనీ ల్యాండరింగ్ యాక్ట్ (పిఎంఎల్ఎ) సెక్షన్ల కింద అరెస్టై తీహార్ జైల్లో ఉన్న సమీర్ మహేంద్ర, విజయ్ నాయర్, వినోయ్ బాబు, అభిషేక్ బోయినపల్లి, శరత్ చంద్రారెడ్డి తమకు బెయిల్ ఇవ్వాలని సిబిఐ స్పెషల్ కోర్టులో పిటిషన్లు దాఖలు చేశారు. ఈ పిటిషన్లపై పలుమార్లు విచారణ జరిపిన సిబిఐ స్పెషల్ కోర్టు జడ్జ్ నాగ్‌పాల్ గత నెల 25న వాదనలు ముగించి, తీర్పును రిజర్వ్ చేశారు. గురువారం ఈ ఐదుగురు నిందితుల బెయిల్‌పై మొత్తం 122 పేజీలతో సవివరణాత్మకమైన తీర్పును వెల్లడించారు. ఆర్థిక నేరారోపణలకు సంబంధించి వివిధ బెంచ్‌లు జారీ చేసిన తీర్పులు, ఇడి పొందుపరిచిన సాక్ష్యాలను పరగణనలోకి తీసుకున్నట్లు స్పష్టం చేసింది. ప్రివెన్షన్ ఆఫ్ మనీ ల్యాండరింగ్ యాక్ట్ కింద నిందితులపై నేరారోపణలకు సంబంధించిన సాక్ష్యాలు ఉన్నట్లు భావిస్తున్నట్లు పేర్కొంది. గతంలోనే సాక్ష్యాలను మాయం, నాశనం చేయడానికి నిందితులు సెల్‌ఫోన్లను ధ్వంసం చేశారన్న ఇడి ఆరోపణలను గుర్తు చేసింది.

ఆప్ మీడియా ఇన్‌ఛార్జి విజయ్‌నాయర్ లిక్కర్ వ్యాపారుల వాటాదారులతో వేర్వేరు ప్రదేశాల్లో సమావేశమైనట్లు దర్యాప్తులో వెల్లడైందని, మరోవైపు ఎక్సైజ్ విభాగం ఒఎస్‌డిగా విజయ్ నాయర్ పాత్ర పరిశీలించాల్సి ఉందని న్యాయమూర్తి తీర్పులో పేర్కొన్నారు. సౌత్ గ్రూపునకు కిక్‌బ్యాక్స్ రూపంలో రూ.100 కోట్లు బదిలీ కావడంలో ఆప్ నేత విజయ్ నాయర్‌ది కీలకపాత్ర ఉందని న్యాయమూర్తి ఆదేశాల్లో ప్రస్తావించారు.

బెయిల్ నిరాకరణ రిపోర్టులోనూ కవిత పేరు

ఐదుగురు నిందితుల బెయిల్ నిరాకరణలోనూ కవిత పేరు ప్రస్తావకు వచ్చింది. మొత్తం స్కాంలో సౌత్ గ్రూప్‌కు చెందిన అంశాలు, నిందితుల నేరారోపణలో నాలుగు సార్లు కవిత పేరును పొందుపరిచారు. ఎమ్మెల్సీ కవిత, మాగుంట శ్రీనివాసులు, శరత్ చంద్రారెడ్డి, మాగుంట రాఘవరెడ్డితో కూడిన సౌత్ గ్రూప్ విజయ్ నాయర్ ద్వారా ఆప్ నేతలకు, ప్రభుత్వ ఉద్యోగులకు రూ.100 కోట్ల కిక్ బ్యాగ్‌ల రూపంలో అందించారన్న ఇడి ఆరోపణలు అని పేర్కొన్నారు. అలాగే గతేడాది ఫిబ్రవరి, ఏప్రిల్‌లో ఢిల్లీలోని ఒబెరాయ్ హోటల్‌లో కవిత, విజయ్ నాయర్, శరత్ చంద్రా రెడ్డి మధ్య జరిగిన మీటింగ్ అంశాన్ని ప్రస్తావించారు. ఈ భేటీలో కిక్ బ్యాక్ రూపంలో పెట్టిన డబ్బులను తిరిగి వేగంగా, సురక్షితంగా పొందే అంశాలపై చర్చించినట్లు పేర్కొన్నారు. అనంతరం అవంతిక, ఆర్గానోమిక్స్ కంపెనీల ద్వారా పెద్ద మొత్తం మనీ ట్రాన్స్‌ఫర్ జరిగిన విషయాన్ని తెలిపారు.

కలెక్టర్ కారుకు అడ్డుగా నిలిచిన రైతులు

ధాన్యం కొనుగోలు చేయాలని రాస్తారోకో

- రైతులపై కలెక్టర్ ఆగ్రహం- ఏడుగురిపై కేసు

ప్రజాశక్తి - వీరఘట్టం (పార్వతీపురం మన్యం జిల్లా)

ధాన్యం కొనుగోలు చేయాలని పార్వతీపురం మన్యం జిల్లా వీరఘట్టం మండలం చలివేంద్రి గ్రామంలో ధాన్యం బస్తాలను రోడ్డుకు అడ్డుగా వేసి రైతులు గురువారం రాస్తారోకో చేశారు. దీంతో వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. అదే సమయంలో గ్రామ పర్యటనకు వచ్చిన కలెక్టర్ నిశాంత్ కుమార్ కారుకు అడ్డుగా నిలిచి నినాదాలు చేశారు. ధాన్యం కొనుగోలు చేయకపోవడంతో మూడు నెలలుగా కళ్లాల్లోనే బస్తాల నిల్వలు ఉన్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. రోడ్డుకు అడ్డంగా ఉన్న ధాన్యం బస్తాలు తీయాలని రైతులకు స్థానిక ఎస్సై ఎం హరికృష్ణ, తహశీల్దార్ చందక సత్యనారాయణ నచ్చ చెప్పినా వినిపించుకోలేదు. సచివాలయానికి వెళ్లి సమస్యను పరిష్కరించుకుందామని కలెక్టర్ చెప్పడంతో రైతులు ఆందోళన విరమించారు. నలుగురు రైతులు సచివాలయం లోపలికి రావాలని సిబ్బందితో కలెక్టర్ చెప్పడంతో కొంతమంది రైతులు లోనికి వెళ్లారు. వారితో కలెక్టర్ ఏం మాట్లాడారో తెలియదు, ఆయన వెళ్లిపోయిన తర్వాత రైతులు సచివాలయం వద్ద నిరసన తెలిపారు. తమ సమస్యను కలెక్టర్ పరిష్కరిస్తారని లోపలికి వెళ్తే దుర్భాషలాడినట్లు రైతులు నినదించారు. సిబ్బందిని బయటకు పంపించి సచివాలయానికి తాళం వేశారు. అనంతరం ఎస్ఐ సచివాలయానికి చేరుకొని ప్రభుత్వ కార్యాలయాలకు తాళాలు వేయడం సరికాదని సర్దిచెప్పడంతో శాంతించారు. అధికారుల విధి నిర్వహణలో ఆటంకం కలిగిచారని తహశీల్దార్ ఫిర్యాదు మేరకు ఏడుగురి రైతులపై కేసు నమోదు చేశారు.

టిటిడి బోర్డు ఎక్స్‌అఫిషియో సభ్యులుగా

జవహర్‌లాల్ ప్రమాణ స్వీకారం

ప్రజాశక్తి - తిరుమల

టిటిడి బోర్డు ఎక్స్ అఫిషియో సభ్యులుగా రెవెన్యూ ఎండోమెంట్ ప్రిన్సిపల్ సెక్రటరీ (ఎఫ్ఎసి) ఎం.హరి జవహర్‌లాల్ గురువారం ప్రమాణ స్వీకారం చేశారు. వారితో టిటిడి జెఇఒ వీరబ్రహ్మం ప్రమాణం చేయించారు. శ్రీవారి దర్శనానంతరం రంగనాయకుల మండపంలో వేదపండితులు వేదాశీర్వచనం చేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఇఒ కస్తూరి బాయి, విజిఒ బాలిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌జెడి ప్రతాప్‌రెడ్డిని సస్పెండ్ చేయాలి

- సిపిఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ డిమాండ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

అధికార దుర్వినియోగానికి పాల్పడుతూ.. వైసిపికి తొత్తుగా వ్యవహరిస్తున్న కడప ఆర్‌జెడి ప్రతాప్‌రెడ్డిని తక్షణమే సస్పెండ్ చేయాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ డిమాండ్ చేశారు. కర్నూలు జిల్లా ఎఐఎస్ఎఫ్ నేతల అక్రమ అరెస్టులను తీవ్రంగా ఖండిస్తూ.. గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఆదోనిలో 10వ తరగతి పరీక్షల అవగాహన సదస్సు పేరుతో ప్రతాప్‌రెడ్డి ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారని, దీనిని ఎఐఎస్ఎఫ్ నేతలు అడ్డుకోగా.. పోలీసులు అక్రమంగా అరెస్టులు చేశారని తెలిపారు. రాష్ట్రస్థాయిలో ఎస్ఇఆర్‌టి డైరెక్టరుగా ఉన్న ప్రతాప్‌రెడ్డిని రాయలసీమ పశ్చిమ నియోజకవర్గ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని కడప ఆర్‌జెడిగా నియమించడాన్ని తప్పుబట్టారు. పలువురు అధికారులను వెంటేసుకుని ప్రతాప్‌రెడ్డి తన అనుకూల ఎమ్మెల్సీ అభ్యర్థుల తరపున ఎన్నికల ప్రచార సభలు నిర్వహిస్తున్నారని విమర్శించారు. ఉపాధ్యాయులు కానివాళ్లను కూడా ఓటర్లుగా నమోదు చేసి దొంగ ఓట్లను పెద్దఎత్తున చేర్చారని తెలిపారు. కడపలో వైసిపి ఎమ్మెల్సీ అభ్యర్థి రామచంద్రారెడ్డి గెలుపుకోసం ఓటర్లకు బహుమతులు పంచుతున్న వైసిపి శ్రేణులను సిపిఐ నాయకులు పట్టుకుని పోలీసులకు ఇటీవల అప్పగించారని గుర్తుచేశారు. రాజకీయాలకు అతీతంగా జరగాల్సిన ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలను జగన్ తన అధికార దాహంతో భ్రష్టుపట్టిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మొత్తం ప్రభుత్వ యంత్రాంగాన్ని దుర్వినియోగం చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు పేర్కొన్నారు.

తూచ్.. ఆడిట్ లేదు..

- గ్రాంట్ థార్టన్ నియామకం పుకారు
- అదాని గ్రూపు వెల్లడి

న్యూఢిల్లీ : అదాని కంపెనీల్లో అకౌంటెన్సీ సంస్థ గ్రాంట్ థార్టన్‌తో స్వతంత్రంగా ఆడిటింగ్ చేయనున్నట్లు వచ్చిన వార్తల్లో నిజం లేదని అదాని గ్రూపు స్పష్టం చేసింది. అదాని గ్రూపు తీవ్ర ఎకౌంట్స్ అక్రమాలకు పాల్పడుతూ, కృత్రిమంగా షేర్ల ధరలను పెంచుకుంటుందని హిండెన్‌బర్గ్ రిపోర్ట్ నేపథ్యంలో అదాని గ్రూపు లావాదేవీల ఆడిటింగ్‌కు ముందుకు వచ్చిందని.. దీంతో ఆ కంపెనీ తన పారదర్శకతను నిరూపించుకోనుందని రెండు రోజుల క్రితం వార్తలు వచ్చాయి. తమ సంస్థ ఎలాంటి విషయాలను దాచి పెట్టలేదని... ఆర్‌బిఐ ఇతర రెగ్యులేటరీ సంస్థలకు తమ పారదర్శకతను నిరూపించుకోవడానికి అదాని గ్రూపు సిద్ధ పడిందని రిపోర్టులు వచ్చాయి. దీనిపై అదాని గ్రూపు గురువారం బిఎస్ఇకి వివరణ ఇస్తూ.. అలాంటిదేమీ లేదని తోసిపుచ్చింది. తాము ఎలాంటి ఆడిట్ సంస్థనూ నియమించుకోలేదని స్పష్టం చేసింది. అదంతా మార్కెట్ పుకార్లని తెలిపింది. తమ లావాదేవీలను ఎప్పటిలానే సెబీతో పంచుకుంటామని తెలిపింది.

డిబి పవర్‌తో తెగిన ఒప్పందం

హిండెన్‌బర్గ్ రిపోర్ట్ నేపథ్యంలో అదాని కంపెనీలతో పలు విదేశీ సంస్థలు ఇప్పటికే తమ

ఒప్పందాలను రద్దు చేసుకున్నాయి. తాజాగా డిబి పవర్‌కు చెందిన థర్మల్ విద్యుత్ ఆస్తుల కొనుగోలుకు అదానీ పవర్ 2022 ఆగస్టులో కుదుర్చుకొన్న ఒప్పందం సమయం ముగిసింది. ఒప్పందంలో నిర్ణయించిన తేదీ నాటికి లావాదేవీ పూర్తికాకపోవడమే ఇందుకు కారణం. రూ.7,017 కోట్ల విలువ చేసే ఈ ఒప్పందాన్ని 2022 అక్టోబర్ 31 నాటికి పూర్తి చేసుకోవాల్సి ఉంది. తర్వాత ఈ గడువును నాలుగు విడతలు పొడిగించి 2023 ఫిబ్రవరి 15 వరకు పెంచినప్పటికీ.. ఈ గడువు ముగియడంతో ఒప్పందం రద్దు అయ్యింది.

15 కోట్ల 5జి వినియోగదారులు

నోకియా అంచనా

న్యూఢిల్లీ : దేశంలో 5జి వినియోగదారుల్లో భారీ పెరుగుదల చోటు చేసుకుంటుందని నోకియా తెలిపింది. 2024 కల్లా 15 కోట్ల 5జి వినియోగదారులు నమోదయ్యే అవకాశాలున్నాయని పేర్కొంది.

టెలికం సంస్థలు కూడా ఇందుకోసం వేగంగా విస్తరిస్తున్నాయని పేర్కొంది. ఈ ఏడాది చివరకు దాదాపు దేశంలోని అన్ని ప్రాంతాల్లో 5జి సేవలు అందుబాటులోకి రావొచ్చని వెల్లడించింది. 2జి వినియోగదారులు క్రమంగా తగ్గుతున్నారని తెలిపింది. 2024 కల్లా దేశంలో 4జి, 5జి వినియోగదారుల సంఖ్య 99 కోట్లకు చేరొచ్చని పేర్కొంది. ఇదే సమయంలో 2జి వాడకందారులు 15 కోట్లుగా ఉండొచ్చని అంచనా వేసింది. ప్రస్తుతం దేశంలో 2 కోట్ల మంది 5జి వినియోగదారులున్నారని తెలిపింది. దేశంలో గతేడాది దీపావళి నుంచి 5జి సేవలు ప్రారంభమైన విషయం తెలిసిందే. 5జి రాకతో దేశంలో డేటా వినియోగం భారీగా పెరుగుతోందని తెలిపింది.

విచారణకు హాజరుకండి

- జివిఎంసి కమిషనరు రాజాబాబుకు హైకోర్టు ఆదేశం

ప్రజాశక్తి-అమరావతి

విశాఖపట్నం జిల్లా, యందాడలోని 12.50 ఎకరాల భూమిలో హయగ్రీవ ఫార్మ్స్ అండ్ డెవలపర్స్ చేసే నిర్మాణాలపై గ్రేటర్ విశాఖ మున్సిపల్ కార్పొరేషన్ (జివిఎంసి) కమిషనరు రాజాబాబు వ్యక్తిగత హాజరు కావాలని హైకోర్టు గురువారం ఆదేశించింది. కౌంటర్ దాఖలు చేయకపోగా, జివిఎంసి తరపున గత విచారణకు ఒక న్యాయవాది, ఇప్పటి విచారణకు మరో న్యాయవాది హాజరుకావడంపై హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. మార్చి 1న జరిగే విచారణకు హాజరుకావాలని చీఫ్ జస్టిస్ పికె మిశ్రా, జస్టిస్ నైనాల జయసూర్యతో కూడిన డివిజన్ బెంచ్ ఆదేశించింది. యందాడలోని సర్వే నెంబరు 92/3లోని 12.5 ఎకరాల భూమిలో అనాథ శరణాలయం, వృద్ధుల ఆశ్రమం నిర్మించాల్సి ఉండగా, అందుకు విరుద్ధంగా ఆ భూమిని హయగ్రీవ ఫార్మ్స్ అండ్ డెవలపర్స్‌కు కేటాయించారంటూ జనసేన కార్పొరేషన్ పిఎల్‌పిఎన్ మూర్తి యాదవ్ పిల్ దాఖలు చేశారు. గడువు కావాలని జివిఎంసి తరపున ఎస్ లక్ష్మీనారాయణరెడ్డి కోరారు. హయగ్రీవ తరపు న్యాయవాది రాఘవాచార్యులు అభ్యంతరం వ్యక్తం చేశారు. ఒక్కో విచారణకు ఒక్కో న్యాయవాది మారుస్తున్నారని చెప్పారు.

జుకర్‌బర్గ్‌కు సెక్యూరిటీ అలవెన్స్ భారీగా పెంపు

వాషింగ్టన్ : వ్యయాలను తగ్గించుకోవడానికి వేలాది మంది ఉద్యోగులను ఇంటికి పంపిస్తున్న ఫేస్‌బుక్, వాట్సాప్ మాతృసంస్థ మెటా తమ సిఇఒకు మాత్రం భారీ మొత్తంలో చెల్లింపులు పెంచడానికి సిద్ధ పడింది. మెటా సిఇఒ మార్క్ జుకర్‌బర్గ్

సెక్యూరిటీ అలవెన్స్‌ను ఏకంగా 14 మిలియన్ డాలర్లకు (దాదాపు రూ.115 కోట్లు) పెంచింది. ఇంతక్రితం ఈ అలవెన్స్ 4 మిలియన్ డాలర్లు (దాదాపు రూ.33 కోట్లు)గా ఉంది. ఓ వైపున ఉద్యోగులను తొలగిస్తూ.. మరోవైపు కంపెనీ బాస్ ఇంత ప్యాకేజీని పెంచుకోవడం తీవ్ర విమర్శలకు దారి తీస్తుంది. 2021లో జుకర్‌బర్గ్ అన్ని రకాల పరిహారాలను కలుపుకొని 27 మిలియన్ డాలర్ల (రూ.223 కోట్లు) వేతనాన్ని అందుకున్నారు. మెటాలో పని చేస్తున్న 11వేల మంది ఉద్యోగులపై వేటు వేస్తున్నట్లు ఇటీవల ఆ సంస్థ ప్రకటించిన విషయం తెలిసిందే.

గెలాక్సీ బుక్3 సిరీస్ ప్రీ బుకింగ్స్ షురూ

గుర్‌గావ్ : ప్రముఖ ఎలక్ట్రానిక్స్ ఉత్పత్తుల కంపెనీ సామ్‌సంగ్ తమ గెలాక్సీ బుక్3 సిరీస్ ఉత్పత్తుల కోసం ప్రీ బుకింగ్స్‌ను తెరిచినట్లు ఆ కంపెనీ ప్రకటించింది. గెలాక్సీ బుక్3 అల్ట్రా, గెలాక్సీ బుక్3 ప్రో 360, గెలాక్సీ బుక్3 ప్రోలను ఇటీవల ఆ సంస్థ ఆవిష్కరించింది. వీటి కోసం దేశంలోని ప్రముఖ అన్‌లైన్ స్టోర్లు, ఎంపిక చేసిన రిటైల్ స్టోర్లలో ప్రీ బుకింగ్స్‌ను ప్రారంభించినట్లు పేర్కొంది. వీటిపై గరిష్టంగా రూ.16వేల వరకు బెనిఫిట్స్‌ను పొందవచ్చని తెలిపింది.

మారుతితో సౌత్ ఇండియన్ బ్యాంక్ జట్టు

న్యూఢిల్లీ : దేశంలోనే అతిపెద్ద కార్ల తయారీ కంపెనీ మారుతి సుజుకితో సౌత్ ఇండియన్ బ్యాంక్ ఒప్పందం కుదుర్చుకుంది. ఇందులో భాగంగా మారుతి కార్లను కొనుగోలు చేసే వినియోగదారులకు ఆ బ్యాంక్ ఫైనాన్సింగ్ సొల్యూషన్స్‌ను అందించనున్నట్లు తెలిపింది. ఈ ఒప్పంద కార్యక్రమంలో మారుతి సుజుకి సీనియర్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ శశాంక్ శ్రీవాస్తవ్, సౌత్ ఇండియన్ బ్యాంక్ ఎండి, సిఇఒ మురళి రామ క్రిష్ణన్ పాల్గొన్నారు.

సంపాదకీయం

విద్యార్థుల బలవన్మరణాలు!

ప్రతిష్టాత్మక జాతీయ విద్యాసంస్థలలో చదువుతున్న ముగ్గురు విద్యార్థులు నాలుగు రోజుల్లో బలవన్మరణాలకు పాల్పడటం కలవరపరుస్తోంది. ఎన్నో అవరోధాలను అవలీలగా అధిగమించి అత్యున్నత స్థానాలను అధిరోహించాలనే స్వప్నాన్ని సాకారం చేసుకునేందుకు అహరహం జ్ఞాన సముపార్జనలో నిమగ్నమైన భావిభారత ఇంజినీర్లు అర్థాంతరంగా జీవితాలను ముగించడం విషాదం. ఐఐటిలలో సీటు సంపాదించడం కోసం తల్లిదండ్రులు పిల్లలను చిన్నప్పటి నుంచే సిద్ధం చేస్తారు. ఆ ఒత్తిడినంతటినీ అధిగమించి ఐఐటిలలో సీటు సంపాదించడం సాధారణ విషయం కాదు. ఇలాంటి ముగ్గురు విద్యార్థులు ఈ నెల 12, 13, 15 తేదీల్లో వరుసగా ప్రతిష్టాత్మక బాంబే, మద్రాస్ ఐఐటిలు, కాలికట్ ఎన్ఐటిలో ప్రాణాలు తీసుకున్నారు. ఉన్నత విద్యాసంస్థల్లో వ్యవస్థాగత అసమానతలు, వివక్ష, విద్యకు సంబంధించిన తీవ్రమైన ఒత్తిడి బలవన్మరణాలకు ప్రధాన కారణమని నిపుణులు చెబుతున్నారు.

ఈ నెల 12న బాంబే ఐఐటిలో ఆత్మహత్య చేసుకున్న దర్శన్ సోలంకి అహ్మదాబాద్‌కు చెందిన దళిత విద్యార్థి. గత ఏడాదంతా జెఇఇకి సిద్ధమై సాధించి తన కుటుంబానికి, బంధువులకు, తనలాంటి నేపథ్యమున్న ఎందరో విద్యార్థులకు స్ఫూర్తిదాయకంగా నిలిచాడు. దర్శన్ మరణం తర్వాత పోస్టుమార్టం జరిగిన ప్రాంతానికి వచ్చిన ఓ బంధువు 'మా పిల్లలు ప్రాణాలు తీసుకోవడానికి ఇక్కడికి రావాలా?' అని ప్రశ్నించడం వారిలో తలెత్తిన కలవరాన్ని, ఆక్రోశాన్ని తేటతెల్లం చేస్తోంది. ప్రమాదవశాత్తూ హాస్టల్‌లోని ఏడో అంతస్తు నుంచి పడిపోయి మరణించినట్లు ముంబై పోలీసులు కేసు నమోదు చేశారు. కులం ఆధారంగా తీవ్ర వివక్షకు గురవడం, ర్యాగింగ్ వల్లే దర్శన్ బలవన్మరణానికి పాల్పడ్డాడంటున్న తోటి విద్యార్థులు, అక్కడి అధ్యాపకుల వాంగ్మూలాన్ని తీసుకుని దీనిపై పూర్తిస్థాయి దర్యాప్తు చేయించడం అత్యవసరం. దాన్ని హత్య కేసుగా నమోదు చేయాలని, ఐఐటి బాంబే డైరెక్టర్ రాజీనామా చేయాలన్న డిమాండ్లు సహేతుకమైనవే. 2014లో ఇదే ఐఐటిలో అనికేత్ అంబోర్ ఆత్మహత్య చేసుకున్నాడు. నాడు దేశవ్యాప్తంగా వెల్లువెత్తిన విమర్శలతో ఒక కమిటీ ఏర్పాటు చేయగా, 2015లో నివేదిక ఇచ్చింది. ఆ నివేదిక సిఫార్సు ప్రకారం ఎస్‌సి, ఎస్‌టి స్టూడెంట్స్ సెల్‌ను ఏర్పాటు చేయడానికి మరో ఏడేళ్లు పట్టింది. ఈ సెల్ నిర్వహించిన సర్వేలో 15నుంచి 20 మంది విద్యార్థులు సహాయం కోసం ఎదురుచూస్తున్నారని, ఈ విషయంపై సంస్థ నుంచి ఎటువంటి సహాయం అందడం లేదని ఓ సీనియర్ ప్రొఫెసర్ తెలిపారు. అంబేద్కర్ పెరియార్ పూలే స్టడీ సర్కిల్ (ఎపిపిఎస్‌సి), అంబేద్కర్ స్టడీ కలెక్టివ్ (ఎఎస్‌సి) వంటి వాటిని నిర్వీర్యం చేసేలా ప్రస్తుత పరిస్థితులున్నాయి. ఇనిస్టిట్యూట్ డైరెక్టర్ పేరుతో దర్శన్ మరణానికి సంతాపం తెలుపుతూ ఇచ్చిన ఇ మెయిల్‌లో ఆయన పేరు లేకపోవడం గమనార్హం. దళిత, బహుజన విద్యార్థులు మరణిస్తే చదువులో ఒత్తిడిని ఎదుర్కోలేక ఆత్మహత్య చేసుకున్నారని ప్రకటించడం, ఇతరులు మరణిస్తే వారి మానసిక ఆరోగ్యం సక్రమంగా లేదంటూ ప్రకటిస్తున్నారని కొందరు ఆవేదన వ్యక్తం చేయడం కూడా ఈ వివక్షకు దర్పణం పడుతోంది. 2016లో హైదరాబాద్ యూనివర్శిటీలో పిహెచ్‌డి స్కాలర్ రోహిత్ వేముల, 2019లో ముంబైలోని టోపీవాలా నేషనల్ మెడికల్ కాలేజిలో పాయల్ తాద్రి కులవివక్షకు గురై ఆత్మహత్య చేసుకున్న తరువాత ఇలాంటి ఘటనలు పునరావృతం కావడం ఆందోళనకరం. గత ఏడాది ఫిబ్రవరి, జూన్‌లో వివక్షపై రెండు సర్వేలను నిర్వహించినట్లు ఐఐటి బాంబే ప్రకటించింది. వివక్ష, విభజనలను అధిగమించేందుకు చర్యలు తీసుకుంటామని పేర్కొనప్పటికీ ఆచరణ రూపు దాల్చలేదు.

చదువులో పోటీ పేరిట, ర్యాంకింగ్‌ల రేసులో వెనుకబడ్డ విద్యార్థులపై అధ్యాపకుల విపరీతమైన ఒత్తిడి కూడా కొన్నిసార్లు ప్రతికూల ఫలితాలకు కారణమవుతుంది. జాతీయస్థాయి ఉన్నత విద్యాసంస్థల్లోను, ప్రతిష్టాత్మక విశ్వవిద్యాలయాల్లో సైతం సంస్థాగత అసమానతలు, వివక్ష కొనసాగుతున్నాయి. ఫలితంగా విద్యార్థులు తీవ్రమైన ఒత్తిడికి గురికావడం, ఇంకొంతమంది నిరాశా నిస్పృహలకు లోనుకావడం జరుగుతోంది. అది బలవన్మరణాలకు సైతం దారితీస్తోంది. ఇప్పటికైనా పరిస్థితిని చక్కదిద్దేందుకు ప్రభుత్వం తగు చర్యలు చేపట్టాలి.

మహనీయుల మాట



డబ్బు పోతే ఫర్వాలేదు.
ఆరోగ్యం చెడితే ఇబ్బంది.
కానీ...నైతిక విలువలు కోల్పోతే
అన్నీ కోల్పోయినట్లే.

- అబ్రహం లింకన్

Abraham Lincoln

విశ్లేషణ

తె.ర

జస్టిస్ నజీర్‌కు నజరానా!

ఆంధ్రప్రదేశ్‌తో సహా పన్నెండు రాష్ట్రాలకు కొత్త గవర్నర్లను నియమిస్తూ కేంద్రం తీసుకున్న నిర్ణయం రాజకీయ వివాదంగా మారింది. ఇందులో సగం మందిని ప్రస్తుతమున్న చోట్ల నుంచి కొత్త చోట్లకు మార్చగా మరో ఆరుగురిని నూతనంగా నియమించారు. వీరిలో చాలామంది బిజెపి నేతలు, ఒకరు మాజీ సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ అబ్దుల్ నజీర్. పాలక పార్టీల నేతలకు పునరావాస కేంద్రాలుగా రాజ్‌భవన్‌లను ఉపయోగించే రివాజు గతం నుంచి వుంది గనక ఎవరూ ఆశ్చర్యపోరు. అనుభవజ్ఞులైన మాజీ ముఖ్యమంత్రులూ మంత్రులూ సీనియర్ నేతలతో పాటు మాజీ బ్యూరోక్రాట్లను కూడా గవర్నర్లుగా నియమించడం గతంలో జరిగేది. కాంగ్రెస్ హయాంలోనూ చెన్నారెడ్డి, కాసు బ్రహ్మానందరెడ్డి వంటి మాజీ ముఖ్యమంత్రులను కూడా గవర్నర్లను చేశారు. గవర్నర్లు సిఎంలుగానూ మారారు. ఉదాహరణకు మహారాష్ట్ర నాయకుడు సుశీల్ కుమార్ షిండే, యు.పి నేత నారాయణ్‌దత్ తివారి వంటివారు ఉమ్మడి ఎ.పి కి గవర్నర్లుగా పనిచేశారు. కాని నరేంద్రమోడీ అధికారంలోకి వచ్చాక వీటిని మార్చేశారు. ఉదాహరణకు తమిళనాడు బిజెపి అధ్యక్షురాలు తమిళిసైని తెలంగాణ గవర్నర్‌గా నియమించారు. సంఘపరివార్ పెద్దలను నియమించడం వాజ్‌పేయి హయాంలోనూ జరిగింది గాని ఇప్పుడు మరింత పెరిగింది. వారు ఆయా బిజెపి యేతర రాష్ట్రాల వ్యవహారాలలో తలదూర్చడం, ఇబ్బంది పెట్టడం కూడా ఆ మేరకు పెరిగింది. కేరళ, తమిళనాడు, పశ్చిమ బెంగాల్, మహారాష్ట్ర, తెలంగాణ, కర్ణాటక వంటి చోట్ల గవర్నర్ల నిర్వాకాలు నిరోధకాలు నిరసనలకు దారితీశాయని చాలాసార్లు చెప్పుకున్నదే. ఈ సమయంలో కూడా పంజాబ్ గవర్నర్ ముఖ్యమంత్రి మాన్‌పై బహిరంగ విమర్శలు చేస్తున్నారు. తమిళనాడు గవర్నర్ బి.ఎస్.రవి తమిళనాడులో దళితులకు రక్షణ లేదని బాహాటంగా విమర్శిస్తున్నారు. ఇప్పుడు ఉప రాష్ట్రపతిగా వున్న జగదీప్ ధన్‌కర్ గతంలో బెంగాల్ గవర్నర్‌గా వుండి పాలనా తీరుపై నిత్యం వ్యాఖ్యలు చేసేవారు.

రాజ్‌భవన్‌లలో న్యాయం

ఈ తరహా ఉల్లంఘనలన్నిటిలోకీ దారుణమైంది మాజీ న్యాయమూర్తులనూ ప్రధాన న్యాయమూర్తులనూ కూడా గవర్నర్లుగా నియమించడం. వాస్తవానికి జడ్జీలుగా నియమించే ముందు వారి గురించి ప్రత్యేక నిఘా నివేదికలు తెప్పించుకుంటారు. కాస్త వివాదం వుందన్నా నియామకం నిలిపేస్తారు. మోడీ ప్రభుత్వం వచ్చాక తమకు నచ్చని వారిని కొలీజియం సిఫార్సు చేస్తే నియమించకుండా నిలిపేస్తున్నారు. కొలీజియం నిర్ణయాలలో పారదర్శకత వుండటం లేదని కేంద్ర న్యాయశాఖామంత్రి కిరణ్ రిజిజు పదేపదే దాడిచేస్తున్నారు. జడ్జీల నియామకంలో జోక్యం కోసం ఒక అఫిడవిట్ కూడా కేంద్రం సుప్రీం కోర్టుకు సమర్పించింది. ఇటీవలనే ఒక న్యాయమూర్తిని స్వలింగ సంపర్కుడన్న కారణంతో నిలిపేసింది. ఇదంతా కూడా న్యాయమూర్తులుగా వచ్చేవారి సచ్ఛీలత కోసమేనని చెబుతున్నారు. న్యాయమూర్తుల నియామకంపై చర్చ మరోసారి చేయొచ్చు. కాని అంతగా చెప్పే సచ్ఛీలత పదవీ విరమణ తర్వాత అక్కర్లేదా? పదవీ విరమణ తర్వాత మరింత కీలకమైన పదవులు ఎరజూపితే ఇక విలువలు ఏమయ్యేట్లు? 'జై భీమ్' సినిమాతో దేశమంతటినీ ఆకర్షించిన జస్టిస్ చంద్రు తను పదవీ విరమణ తర్వాత ఏ విధమైన కమిషన్ల చైర్మన్ గిరీ కానీ, రాజ్యసభ సభ్యత్వం గానీ, గవర్నర్ గిరీ గానీ తీసుకోబోనని ముందే ప్రకటించారు. యుపిఎ హయాంలో వచ్చిన పదవుల ప్రతిపాదనలన్నిటినీ తిరస్కరించారు. మాజీ సిజెఐ రంజన్ గొగోయ్ పుస్తకానికి ముందు మాట రాయడానికీ, ఆవిష్కరణకూ కూడా నిరాకరించారు. న్యాయమూర్తులు గనక రాజకీయ పదవులకు ఎన్నికైన నేతలకు పుష్పగుచ్ఛాలు అభినందన సందేశాలు పంపించడం మొదలెడితే వారిపై ప్రజల విశ్వాసం సన్నగిల్లిపోతుందని జస్టిస్ తుల్జాపుర్కార్ 1980లో వ్యాఖ్యానించారు. కాని ఇప్పుడు జరుగుతున్నదేమిటి? మాజీ న్యాయమూర్తి అరుణ్ మిశ్రా ప్రధాని మోడీ భజన చేయడం, బహిరంగ విమర్శలకు గురవడం గుర్తుండే వుంటుంది. ఆయన హయాంలోనే అదానీ అక్రమాలను బయటపెట్టిన పాత్రికేయులు పరంజయ్ గుహ ఠాకుర్తా లపై మూడు పరువు నష్టం దావాలు రావడం, వారిని రాయకుండా ఆంక్షలు విధించడం మర్చిపోకూడని విషయం.

మోడీ రాజ్యంలో పరాకాష్ట

కాంగ్రెస్ హయాం లోనూ అనేక అవకతవకలు జరక్కపోలేదు. ఇందిరాగాంధీ సీనియారిటీని ఉల్లంఘించి ప్రధాన న్యాయమూర్తిని ఎంపిక చేసిన ఉదంతాలున్నాయి. అత్యవసర పరిస్థితిలో ఆమె నిబద్ధ న్యాయవ్యవస్థ (కమిటెడ్ జ్యుడిషియరీ) కావాలని అంటుండేవారు. ఆ పార్టీ హయాంలో మాజీ న్యాయమూర్తులను అనేక న్యాయ సంబంధమైన పదవుల్లో నియమించేవారు. 1952లో నెహ్రూ హయాంలో జస్టిస్ ఫజల్ ఎస్ అలీని ఒరిస్సా గవర్నర్‌గా నియమించారు. మళ్లీ దేవెగౌడ ప్రభుత్వం జస్టిస్ ఫాతిమా బీబీని పదవీ విరమణ తర్వాత అయిదేళ్లకు తమిళనాడు గవర్నర్‌గా పంపించింది. నరేంద్ర మోడీ అధికారం చేపట్టగానే కేరళకు మాజీ సిజెఐ పి.సదాశివన్‌ను గవర్నర్‌గా పంపించారు. ఆయన హయాంలో అనేక సమస్యలు రాగా తర్వాత వచ్చిన ఆరిఫ్ మహ్మద్ ఖాన్ మరింత తీవ్రమైన సంక్షోభాలు సృష్టిస్తూనే వున్నారు. నూతన గవర్నర్ల నియామకాలు కొత్త వివాదానికి కారణమైనాయి. ఎ.పి గవర్నరుగా వచ్చిన జస్టిస్ అబ్దుల్ నజీర్ గతంలో సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా అనేక కీలక కేసుల్లో ఇచ్చిన తీర్పులు మోడీ సర్కారుకు ఎంతో సంతోషం కలిగించడమే ఇందుకు కారణం. వాటిలో అయోధ్య రామమందిర తీర్పు కీలకమైంది గాని మిగిలినవి కూడా తక్కువ ప్రాధాన్యత గలవికావు. నోట్ల రద్దు కేసులో ప్రభుత్వం చేసిందాట్లో తప్పు లేదన్న తీర్పు, విద్వేష ప్రసంగాల వివాదంలో ఇష్టానుసారం మాట్లాడకుండా కట్టడి చేయలేమన్న తీర్పు, కాశ్మీర్ 370వ అధికరణం రద్దు చెల్లుతుందన్న తీర్పు, ట్రిపుల్ తలాక్ కేసులో ఇచ్చిన తీర్పు...అన్నీ బిజెపికి ఎంతో ఉత్సాహమిచ్చాయి. ఈ ధర్మాసనాల న్నిటిలోనూ జస్టిస్ నజీర్ భాగస్వామి. ముస్లిం అయినప్పటికీ రామాలయానికి అనుకూలంగా తీర్పు నివ్వడం ఆయన లౌకిక స్ఫూర్తికి నిదర్శనమని పెద్దఎత్తున ప్రచారం నడిచింది. ఎవరి మతం ఏమిటన్న మీమాంస కంటే ఎవరు రాజ్యాంగ లౌకిక స్ఫూర్తిని కాపాడేవిధంగా వ్యవహరించా రన్నది ఇక్కడ ముఖ్యంగా చూడాల్సి వుంటుంది. ఈ తీర్పుపై అనేక భిన్నాభి ప్రాయాలు రావడమే గాకుండా సుప్రీం కోర్టులో సవాలు చేయడం గమనించదగింది. ఏమైనా ఈ తీర్పు తర్వాత ఆ ధర్మాసనంలో సభ్యులైన న్యాయమూర్తులందరినీ పదవులు వెతుక్కుంటూ రావడం యాదృచ్ఛికం కాదు. ముందుగా అప్పటి ప్రధాన న్యాయమూర్తి రంజన్ గొగోయ్ రాజ్యసభకు నామినేట్ అయ్యారు. దీనిపై విమర్శలు ఎన్ని వచ్చినా ఆయన బేఖాతర్ చేశారు. ఇటీవలనే ఆయన పని తీరు ఆరా తీస్తే పార్లమెంటుకు హాజరులోనూ చర్చలలోనూ ప్రైవేటు బిల్లులు ప్రతిపాదించడంలోనూ బాగా వెనకబడి వున్నారు. అందులోని మరో న్యాయమూర్తి అశోక్ భూషణ్ నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్ (ఎన్‌సిఎల్‌టి) చైర్మన్‌గా నియమితులయ్యారు. ఇది కంపెనీల వ్యవహారాలపై తీర్పులిచ్చే అతి కీలక సంస్థ. ఈ కోవలో ఇప్పుడు జస్టిస్ నజీర్ నియామకం మూడవది.



ఈ తీర్పు తర్వాత ఆ ధర్మాసనంలో సభ్యులైన న్యాయమూర్తులందరినీ పదవులు వెతుక్కుంటూ రావడం యాదృచ్ఛికం కాదు. ముందుగా అప్పటి ప్రధాన న్యాయమూర్తి రంజన్ గొగోయ్ రాజ్యసభకు నామినేట్ అయ్యారు. దీనిపై విమర్శలు ఎన్ని వచ్చినా ఆయన బేఖాతర్ చేశారు. ఇటీవలనే ఆయన పనితీరు ఆరా తీస్తే ...పార్లమెంటుకు హాజరులోనూ చర్చలలోనూ ప్రైవేటు బిల్లులు ప్రతిపాదించడంలోనూ బాగా వెనకబడి వున్నారు. అందులోని మరో న్యాయమూర్తి అశోక్ భూషణ్ నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్ (ఎన్‌సిఎల్‌టి) చైర్మన్‌గా నియమితులయ్యారు. ఇది కంపెనీల వ్యవహారాలపై తీర్పులిచ్చే అతి కీలక సంస్థ. ఈ కోవలో ఇప్పుడు జస్టిస్ నజీర్ నియామకం మూడవది.

జస్టిస్ నజీర్ నేపథ్యం

ఎ.పి గవర్నరుగా వచ్చిన జస్టిస్ నజీర్ కేవలం ఆ తీర్పు ఇవ్వడమే కాదు. బిజెపికి అనుకూలమైన లాయర్ల సంస్థ అఖిల భారత అధివక్త పరిషత్ (ఎబిఎపి)లో సభ్యులుగా వుండేవారు. ఆ సందర్భంగా మాట్లాడుతూ భారతీయ న్యాయ వ్యవస్థ మనుస్మృతిని ఎప్పుడూ పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారట. సంఘ పరివార్‌కూ మనుధర్మానికి వున్న అనుబంధం మనువుతో పాటు కౌటిల్య, కాత్యాయన, బృహస్పతి, నారద, యాజ్ఞ వల్క్య వంటి ప్రాచీన పండితుల వారసత్వం కూడా కలుపుకుని మన న్యాయ వ్యవస్థను భారతీయం చేయాలని అభిలషించారు! భారతీయ సమాజంలో దొంతరలను నిర్దేశించే నాటి భాష్యాలు ఈ న్యాయమూర్తికి నచ్చడమేమిటి? అయితే ఈయన చాలా నిరాడంబరుడనీ మతాతీతంగా తీర్పునిచ్చాడనీ సిజెఐ చంద్రచూడ్ కూడా కొనియాడటం గమనార్హం. గతంలో మాజీ రాష్ట్రపతి ఎపిజె అబ్దుల్ కలాం గురించీ ఆయన లౌకికతత్వం గురించీ ఇలాంటి కబుర్లే వినేవాళ్లం. వ్యక్తిగతంగా ఎవరు ఎలా వుంటారనేది ఒకటైతే...ఎవరివైపు వుంటారు? ఏ విలువలవైపు వుంటారు? ఏ వృత్తిలో వున్నారనేది కూడా కీలకం. ఆ విధంగా చూస్తే అబ్దుల్ నజీర్ కూడా సంఘపరివార్‌కు ప్రీతిపాత్రులైన వ్యక్తిగనకే ఇలాంటి తీర్పులు ఇవ్వడం, ఈ పదవులు పొందడం సాధ్యమైందన్నమాట. ఆయనతో పాటు నియమితులైన మరో నలుగురు గవర్నర్లు లక్ష్మి ప్రసాద్ ఆచార్య (సిక్కిం), సి.పి.రాధాకృష్ణన్ (జార్ఖండ్), శివప్రతాప్ శుక్లా (హిమాచల్ ప్రదేశ్), గులాబ్‌చంద్ కతారియా (అస్సాం) కూడా సంఘ్ నేపథ్యం గలవారే. ఆ మాటకొస్తే ఇప్పుడు ఛత్తీస్‌గఢ్‌కు బదిలీ అయిన విశ్వభూషణ్ హరిచందన్ అచ్చంగా అదే తరహాలోని వారే! గవర్నర్ల అనుచిత ప్రవర్తనలు, అప్రజాస్వామిక రాజ్యాంగ విరుద్ధ పోకడలకు కారణాలేమిటో దీన్నిబట్టే తెలుస్తుంది. గతంలో ఇందుకోసం కాంగ్రెస్‌ను తిట్టిపోసిన బిజెపి ఇప్పుడు వ్యవహరిస్తున్న తీరు అంతకంటే దారుణం. తమాషా ఏమంటే మాజీ న్యాయమూర్తుల నియామకాలు పెరిగిన కొద్ది మాజీ బ్యూరోక్రాట్ల నియామకాలు తగ్గిపోవడం!

కిం కర్తవ్యం?

ఈ పరిస్థితి మారాలంటే ముందు కేంద్రం దృష్టికోణం మారాలి. సర్కారియా సిఫార్సుల ప్రకారం గవర్నర్ల నియామకంపై ముందుగా రాష్ట్రాలను సంప్రదించి నిర్ణయించాలి. వారి ముందు ముగ్గురి జాబితా వుంచి ఎంచుకోవడానికి అవకాశమివ్వాలి. తాజాగా పదవులు నిర్వహించిన వారినీ అప్పుడే రాజకీయ పదవుల నుంచి వచ్చిన వారిని దూరం పెట్టాలి. వివాదాస్పద నేపథ్యం వుంటే అసలు పరిశీలనకే తీసుకోకూడదు. ఇక న్యాయమూర్తుల వరకూ బాధ్యతల విరమణ తర్వాత రెండేళ్ల విరామం లేకుండా పదవులు ఆమోదించకూడదు. ప్రధాన న్యాయమూర్తుల జాతీయ సభలో దీనిపై ఖచ్చితమైన నిర్ణయం తీసుకోవాలి. న్యాయ వ్యవస్థపై పాలకుల ఒత్తిడి ఒక సవాలైతే వారి ప్రలోభాలను తోసిపుచ్చే నైతికత నిలబెట్టుకోవాలి. అది లోపిస్తున్నందునే సిజెఐ చంద్రచూడ్ న్యాయ వ్యవస్థకు అతి పెద్ద ముప్పు అంతర్గతంగానే ఉత్పన్నమవుతుందని హెచ్చరించాల్సి వచ్చింది. జస్టిస్ నజీర్ నియామకం దాన్ని మరోసారి గుర్తు చేస్తున్నది.

★

కామెంట్

ఇది ఒక ట్రైలర్ మాత్రమే

అమెరికా పత్రిక వాల్‌స్ట్రీట్ జర్నల్ 2020 ఆగస్టులో ప్రచురించిన వార్త ఒక రాజకీయ తుపాన్ రేపింది. ఫేస్‌బుక్‌లో విద్వేష ప్రచారం చేసే బిజెపి నేతల పోస్టులను తొలగించకుండా సదరు సంస్థ పబ్లిక్ పాలసీ డైరెక్టర్‌గా ఉన్న అంఖీ దాస్ చూశారన్నది దాని సారం కాగా, ఆమె బిజెపికి ఎంత వీర విధేయురాలో సాక్ష్యాలతో సహా వెల్లడించింది. "మనం అతని (నరేంద్ర మోడీ) సామాజిక మాధ్యమ మంట రగిల్చాం. తరువాత చరిత్ర మీకు తెలిసిందే. ఎట్టకేలకు భారత ప్రభుత్వ సోషలిజాన్ని వదిలించుకొనేందుకు గాను దిగువ స్థాయి నుంచి చేసిన పనికి ముప్పై ఏళ్లు పట్టింది" అంటూ ఆమె 2014లో గెలిచిన సందర్భంగా మోడీని పొగడటం, కాంగ్రెస్ ఓడిపోవటం గురించి రాసిన రాతలను ఆ పత్రిక వెల్లడించింది. భారత జార్జి బుష్‌గా నరేంద్ర మోడీని ఆమె వర్ణించారు. 2012 గుజరాత్ అసెంబ్లీ ఎన్నికల కోసం బిజెపి సామాజిక మాధ్యమ విభాగానికి ఆమె ఇచ్చిన శిక్షణ గురించి కూడా పేర్కొన్నది. ఇదంతా ఎందుకు గుర్తుచేయాల్సి వచ్చిందంటే ఇజ్రాయిల్‌కు చెందిన "టీమ్ జార్జి" పేరుతో టాల్ హనాన్ బృందం 33 దేశాలలో ఎన్నికల సందర్భంగా నిర్వహించిన తప్పుడు ప్రచారం గురించి ఒక అంతర్జాతీయ జర్నలిస్టుల బృందం పరిశోధించి వెలుగులోకి తెచ్చిన అంశాలను బ్రిటన్‌కు చెందిన గార్డియన్ పత్రిక తాజాగా వెల్లడించింది. అంతే కాదు! న్యూయార్క్ నగరం కేంద్రంగా ఐరాస-యునెస్కో నిధులతో పని చేస్తున్న జర్నలిస్టుల అంతర్జాతీయ కేంద్రం (ఐసిఎఫ్‌జె) నివేదిక కూడా వెల్లడైంది. దానిలో భారత్‌కు చెందిన మహిళా జర్నలిస్టులు రాణా ఆయూబ్‌ను వేధించుతున్న, గౌరీ లంకేష్ ప్రాణాలను బలిగొన్న బిజెపి అనుబంధ బృందాల గురించి వెల్లడించారు.

ఈ రెండు నివేదికల్లోని అంశాలు ప్రజాస్వామ్యవాదులకు, నిబద్ధత కలిగిన జర్నలిజం వృత్తిగా ఉన్నవారికి ఆందోళన కలిగిస్తున్నాయి. సామాజిక మాధ్యమాల్లో తిష్టవేసిన కాషాయ దళాలు ఎలాంటి పాత్ర నిర్వహిస్తున్నాయో వాల్‌స్ట్రీట్ జర్నల్ వెల్లడించింది. పత్రికలు, టీవీలు మినహాయింపు కాదు. విద్వేష ప్రచారాన్ని గుట్టుచప్పుడు కాకుండా ఫేస్‌బుక్, వాట్సాప్, ట్విటర్లలో ప్రచారం చేయటం ఒకటైతే పత్రికల్లో రాతలు, టీవీల్లో చర్చల పేరుతో రెచ్చగొట్టే అంశాలను ముందుకు తేవటం మరొకటి. టీమ్ జార్జి వంటి సంఘటిత బృందాలు మన దేశంలో కోకొల్లలుగా ఉన్నాయి. ఊరూపేరు లేని వాటి ఉత్పత్తులు నిరంతరం వాట్సాప్‌ల్లో మనం కోరకుండానే వచ్చి పడుతుంటాయి. ఇవి రక్తం చిందకుండానే ప్రాణా లు తీసే ఆయుధాలంటే అతిశయోక్తి కాదు. ఊరూ పేరు లేకుండా, లేదా అపహరించిన ఫొటోలతో వారికి తెలియకుండానే ఖాతాలు తెరిచి తమ ఎజెండా ప్రకారం ప్రచారం చేసే ముఠాలే ఇవి.అలాంటి పని చేస్తున్న టీమ్ జార్జి ముఠా అది తప్పేమీ కాదని చెప్పటమే కాదు, అందుకు గాను ఎంత మొత్తాలను వసూలు చేస్తున్నదీ వెల్లడించారు. ఒక ఆఫ్రికా దేశ నేత ప్రతినిధులమని, ప్రచారం చేసేందుకు సేవలు కావాలంటూ వెళ్లిన జర్నలిస్టులకు వారు చెప్పిన సమాచారం, తమ పనిని ప్రదర్శించిన తీరు దిగ్భ్రాంతి కలిగిస్తున్నది. ఎన్ని దేశాల్లో ఇలాంటి కుహనా ప్రచారకులు ఎందరు ఉన్నదీ ఊహించుకోవాల్సిందే తప్ప లెక్కించలేము. ప్రజాభిప్రాయాన్ని తమకు అనుకూలంగా మార్చుకొనేందుకు, ప్రత్యర్థులను బదనామ్ చేసి దెబ్బ తీసేందుకు గూఢచార సంస్థలు, రాజకీయ పార్టీలు, వాణిజ్య సంస్థలు కూడా ఇలాంటి ప్రచార ఆయుధాలతో దాడులు చేసే కిరాయి మూకలను రంగంలోకి దించుతు న్నాయి. చివరికి ఇవి భార్యాభర్తల ఫోన్లు, సామాజిక మాధ్యమ ఖాతాలలో ప్రవేశించి అనుమానాలు, విబేధాలను రగిలిస్తున్నాయి. అడ్వాన్స్‌డ్ ఇంపాక్ట్ మీడియా సొల్యూషన్స్ (ఎయిమ్స్) అనే సాఫ్ట్‌వేర్ 30 వేల నకిలీ ఖాతాలను నిర్వహిస్తుందంటే తప్పుడు ప్రచారానికి ఉన్న బలం ఏమిటో అర్థం చేసుకోవచ్చు. నరేంద్రమోడీ జి 20 పేరుతో ఉన్న 20 దేశాలకు అధ్యక్షుడిగా ఎన్నికైన ఘనతను సాధించిన నేతగా ఒక దగ్గర పోస్టు తయారు చేయగానే ఇలాంటి సాఫ్ట్‌వేర్ల బటన్ నొక్కగానే రంగంలోకి దిగి నిజమే... నిజమే.., ఆహా... ఓహో... అంటూ లక్షల కొద్దీ లైకులో, ఇతరులకు పంపటమో చేస్తుంటాయి. ఇవి నకిలీ వెబ్‌సైట్లు, బ్లాగులను సృష్టించటంతో పాటు వాటిలో నిర్దేశిత సమాచారాన్ని కూడా నింపుతాయి. ఒకేసారి ఐదువేల మందికి మెయిళ్లు, సందేశాలు పంపగలవంటే క్షణాల్లో ఎంత మందికి తప్పుడు సమాచారం అందుతుందో అర్థం చేసుకోవచ్చు. "విస్మృత కథలు " అనే పేరుతో పని చేస్తున్న ఫ్రాన్స్ లోని స్వచ్ఛంద సంస్థ సమన్వయంతో వివిధ దేశాలకు చెందిన 30 పత్రికల విలేకర్లు మన దేశంతో సహా వివిధ దేశాల్లో సాగిస్తున్న తప్పుడు ప్రచారాలు, దాడులు, హత్యలు, బెదిరింపులకు గురవుతున్న విలేకర్లు, వారి పని గురించి దర్యాప్తు చేశారు.



స్టోరీ కిల్లర్స్ ప్రాజెక్టు పేరుతో మహిళా జర్నలిస్టుల మీద రూపొందించిన వివరాలను ఐసిఎఫ్‌జె వెల్లడించింది. ఈ సంస్థ షెఫీల్డ్ విశ్వవిద్యాలయ కంప్యూటర్ నిపుణుల సహకారంతో భారత జర్నలిస్టులు రాణా ఆయూబ్, గౌరీ లంకేష్, అల్ జజీరా యాంకర్ ఘదా క్వియిస్ తదితరుల గురించి నివేదికలను రూపొందించారు. వీరు కూడా "విస్మృత కథలు" సంస్థతో సమన్వయం చేసుకున్నారు. స్త్రీ ద్వేషం, బూతులు, ఆమె మతం, రాసిన రాతల మీద ద్వేషం వెళ్లగక్కుతూ రాణా ఆయూబ్ మీద ప్రతి పద్నాలుగు సెకండ్లకు ఒక ట్వీట్ చేసినట్లు తేలింది. ఒక ట్వీట్ రాగానే ఒకటి రెండు నిమిషాల్లో దాని మీద వందల వేల ప్రతికూల స్పందనలు వెలువడటం అంటే అవి కంప్యూటర్లకు పుట్టినవి తప్ప మనుషులకు కాదు అన్నది స్పష్టం.ఈ ఆన్‌లైన్ హింసతో పాటు ఆమె ప్రాణాలు తీస్తామని, అత్యాచారం చేస్తామన్న బెదిరింపులు సరేసరి. ఆమెకు ప్రాణ హాని ఉందని ఐదుగురు ఐరాస ప్రతినిధులు 2018 లోనే హెచ్చరికను జారీ చేశారు. ఇక అల్ జజీరా యాంకర్ ఘదా క్వియిస్ గురించి ఒక మహిళ మీద ఎన్ని తప్పుడు ప్రచారాలు చేయవచ్చో అన్నీ చేశారు. గుజరాత్ మారణకాండ గురించి డాక్యుమెంటరీ నిర్మించిన బిబిసి మీద ఉక్రోషంతో దాని కార్యాలయాల మీద జరిపించిన దాడుల గురించి చూసిన తరువాత మన దేశంలో భిన్న గళాలను అణచివేసేందుకే కేంద్ర ప్రభుత్వం పూనుకున్నదని మరోసారి స్పష్టమైంది.

జర్నలిస్టులను బెదిరించటమే కాదు, వారికి ప్రాణహాని కూడా ప్రపంచమంతటా ఉన్నదని చెబుతున్న నివేదికలు మన దేశంలోని ప్రజాస్వామ్యవాదులకు ఒక హెచ్చరిక కావాలి. తన ఎన్నిక కేసులో ఓడిన ఇందిరా గాంధీ అత్యవసర పరిస్థితిని ప్రకటించి పత్రికల మీద సెన్సారు పేరుతో వ్యతిరేక వార్తలను నిషేధించిన దానికి, బిబిసి డాక్యుమెంటరీని సామాజిక మాధ్యమాల్లో నిషేధించిన నరేంద్ర మోడీ సర్కార్ నిర్వాకానికి పెద్ద తేడా లేదు. ఇది ఒక ట్రైలర్ మాత్రమే, సినిమా ఎలా ఉంటుందో ఊహించుకోవాల్సిందే !

/ఫీచర్స్ అండ్ పాలిటిక్స్/

"గుజరాత్ మారణకాండ గురించి డాక్యుమెంటరీ నిర్మించిన బిబిసి మీద ఉక్రోషంతో దాని కార్యాలయాల మీద జరిపించిన దాడుల గురించి చూసిన తరువాత మన దేశంలో భిన్న గళాలను అణచివేసేందుకే కేంద్ర ప్రభుత్వం పూనుకున్నదని మరోసారి స్పష్టమైంది. జర్నలిస్టులను బెదిరించటమే కాదు, వారికి ప్రాణహాని కూడా ప్రపంచమంతటా ఉన్నదని చెబుతున్న నివేదికలు మన దేశంలోని ప్రజాస్వామ్యవాదులకు ఒక హెచ్చరిక కావాలి."

జనవాక్యం

సెల్ - హెల్

మన దేశంలో సగటున యువత రోజుకు 9 గంటలకు పైగా సెల్ వాడుతున్నట్లు నివేదికలు చెబుతున్నాయి. 5 గంటలు దాటి సెల్ వాడితే "సెల్ అడిక్షన్"గా భావించాలని మానసిక వైద్య నిపుణులు సూచిస్తున్నారు. 8-12 సంవత్సరాల పిల్లలు రోజుకు 8 గంటలు సెల్ వాడుతున్నట్లు నివేదికలు చెబుతున్నాయి. దేశంలో 4.7 శాతం జనాభా రోజుకు 9 గంటలు పైబడి సెల్ మత్తులో జోగుతున్నారు. దీంతో భవిష్యత్తులో యువత శారీరక మానసిక అసహజ లక్షణాలతో అనారోగ్యాలకు గురవుతున్నారని వైద్యులు హెచ్చరిస్తున్నారు. భవిష్యత్తులో భారత్‌లో ప్రజలు 12 శాతం సెల్ అడిక్టెడ్‌గా మారనున్న నేపథ్యంలో ఇకనైనా తల్లిదండ్రులు తమ పిల్లల సెల్ వినియోగంపై దృష్టి సారించాలి. ఉపాధ్యాయులు కూడా ఈ విషయంలో తగు జాగ్రత్తగా వ్యవహరించాలి.

- ఐ.పి.రావు

★

పరిశ్రమల వ్యర్థాలతో ముప్పు

తీర ప్రాంతంలోని కొన్ని పరిశ్రమలు నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తుండంతో వ్యర్థ జలాలన్నీ సాగుని చేరుతున్నాయి. పరిశ్రమలు వ్యర్థ జలాలను శుద్ధి చేశాకనే బయటకు వదిలి పెట్టాలి. అలా చేయక యథేచ్ఛగా వదిలి వేస్తుంటే సముద్ర జీవరాశులు మృత్యువాత పడుతున్నాయి. అంతేగాక సమీప భూగర్భ జలాలు కూడా కలుషితం అవుతున్నాయి. తాగేందుకు ఈ జలాలను ఉపయోగిస్తున్న ప్రజలు కిడ్నీ క్యాన్సర్, వివిధ రకాల చర్మవ్యాధులతో ఇబ్బందులు పడుతున్నారు. పరిశ్రమలు వ్యర్థాలను, కలుషిత జలాలను శుద్ధి చేయాలి. లేదా వ్యర్థాలు ఆవిరయ్యేలా యంత్రాలను ఏర్పాటు చేసుకోవాలి. కొన్ని పరిశ్రమలు ఈ నిబంధనలను పాటించక సముద్రాన్ని కలుషితం చేస్తున్నాయి. అధికారులు స్పందించి ఈ దుస్థితిపై సమస్యకు పరిష్కారం చూపాలి.

- ఉప్పలపు శేషునాథ్,
పి నైనవరం గ్రామం, కృష్ణా జిల్లా.

మీ వ్యాసాలను పంపాల్సిన మెయిల్ :
editpageps @ gmail.com

BEFORE THE HONOURABLE DEBTS RECOVERY TRIBUNAL
Gr. & 1st Floor, Door No. 31-31-21, Sri Narayana Bhavan, Sai Baba Street, Dabagardens, Visakhapatnam-530020

O.A. No. 757 of 2020

BETWEEN:
Union Bank of India, Enikepadu Branch,
Rep. by its Branch Manager, ... Applicant
AND :
Mr. J. Bhavan Kumar and Another ... Defendants

SUMMONS BY PAPER PUBLICATION FOR SHOWING CAUSE AS TO WHY THE RELIEFS PRAYED FOR SHOULD NOT BE GRANTED

To
Defendant -1 : Mr. Jonnadula Bhavan Kumar, S/o. Sri Sambasiva Rao, D.No. 23-4-53, Rajyalaxmi Nilayam, Kakarparthi Vari Street, Satyanarayanapuram, Vijayawada - 520011
Also At : Flat No. 502, 5th Floor Kakatiya Towers, 5th Floor, R.S.No. 657/3, Nandigama, Krishna District.
Defendant -2 : Mrs. Jonnadula Tulasi, W/o. Bhavan Kumar, D.No. 23-4-53, Rajyalaxmi Nilayam, Kakarparthi Vari Street, Satyanarayanapuram, Vijayawada - 520011
Also At : Flat No. 502, 5th Floor Kakatiya Towers, 5th Floor, R.S.No. 657/3, Nandigama, Krishna District.

1. Whereas the applicant has instituted an application U/S 19 of the Recovery of Debts Due to Banks and Financial Institutions Act, 1993 against you for the recovery of sum mentioned therein together with current and future interest and other reliefs. You are hereby summoned to appear and file written statement before this Tribunal at 10.30 a.m, or at such time immediately thereafter according to the convenience of Tribunal on 14-03-2023 to answer the claim.
2. You are directed to collect the annexure on your appearance before the Tribunal.
3. If you intend to file any documents, you may file the same with a list along with the written statement.
4. You should file your registered address and a memo of appearance when you enter appearance before the Tribunal either in person or by a Pleader / Advocate duly instructed.
5. Take notice that in default of your appearance on the day mentioned herein before, the proceedings will be heard and determined in your absence.

Given under my hand and seal of this Tribunal on this the 6th day of February, 2023 at Visakhapatnam.
Signature of the Officer Authorised
Debts Recovery Tribunal, Visakhapatnam

PEGASUS
పెగాసస్ అసెట్స్ రీకన్‌స్ట్రక్షన్ ప్రైవేట్ లిమిటెడ్
55-56, 5వ అంతస్తు, ఫ్రీ ప్రెస్ హౌజ్, నారిమన్ పాయింట్, ముంబయి-400 021, Tel: -022-61884700
Email: sys@pegasus-arc.com URL: www.pegasus-arc.com

ఇ వేలం అమ్మకం కొరకు బహిరంగ నోటీసు

సెక్యూరిటైజేషన్ అండ్ రికన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ యాక్ట్ 2002, సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) నిబంధనల్లోని రూల్ 8(6) మేరకు స్థిరాస్తుల వేలం.
ఈ దిగువ పేర్కొన్న ఆస్తులను తనఖా పెట్టుకున్న సెక్యూర్డ్ క్రెడిటార్ పెగాసస్ (గ్రూప్) థర్టీ నైన్ తరపున ట్రస్టీగా వ్యవహరిస్తున్న పెగాసస్ అసెట్స్ రికన్‌స్ట్రక్షన్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ సామాన్య ప్రజలు ముఖ్యంగా దిగువ పేర్కొన్న రుణగ్రహీత/హామీదారులకు ఈ నోటీసు ద్వారా తెలియచేయునది ఏమనగా దిగువ పేర్కొన్న రుణగ్రహీత/హామీదారులకు చెందిన బకాయిలు, వాటికి సంబంధించిన సెక్యూరిటీలను 2002 నాటి సర్ఫేసీ చట్ట నిబంధనల కింద ఆర్‌బిఎల్ బ్యాంక్‌తో కుదుర్చుకున్న ఒప్పందం మేరకు స్వాధీనం చేసుకోవటమైనది.
పెగాసస్‌కు చెందిన అధీకృత అధికారి ఈ దిగువ పేర్కొన్న తనఖా ఆస్తులను సర్ఫేసీ చట్టం, సర్ఫేసీ నిబంధనల మేరకు ది. 01-08-2021న స్వాధీనం చేసుకున్నారు. దిగువ పేర్కొన్న రుణగ్రహీత/హామీదారులు శ్రీమతి గీతా శశిధర్ (రుణగ్రహీత& హామీదారు), శ్రీ కె.ఎస్. శశిధరన్ నాయర్ (సహరుణగ్రహీత, హామీదారు, తనఖాదారు), శ్రీ రాహుల్ శశిధర్ (సహరుణగ్రహీత& హామీదారు) ది. 14-01-2020 నాటికి బకాయిపడిన మొత్తం రు. 3,46,94,731.80పై.లు (మూడు కోట్ల నలభై ఆరులక్షల తొంభై నాలుగు వేల ఏడు వందల ముప్పై ఒకటి రూపాయల ఎనభై పైసలు మాత్రము), 15-01-2020 నుండి తదుపరి ఇప్పటి వరకూ జమ అయిన వడ్డీ, ఇతర ఖర్చుల రికవరీ కోసం ఈ దిగువ పేర్కొన్న తనఖా ఆస్తులను "ఏది ఎక్కడ ఎలా ఉన్నది అది అక్కడ అలాగే" ప్రాతిపదికన 15-03-2023న వేలం వేయాలని నిర్ణయించడమైనది.

స్థిరాస్తుల వివరాలు, రిజర్వ్ ధర

రుణగ్రహీత పేరు	శ్రీమతి గీతా శశిధరన్
హామీదారుల పేరు	శ్రీ కెఎస్ శశిధరన్ నయ్యర్
బకాయిపడిన మొత్తం	ది. 15/01/2020 నాటికి రు. 3,46,94,731.80పై. లు(మూడు కోట్ల నలభై ఆరులక్షల తొంభై నాలుగు వేల ఏడు వందల ముప్పై ఒకటి రూపాయల ఎనభై పైసలు మాత్రము), తదుపరి ఇప్పటి వరకూ జమ అయిన వడ్డీ, ఇతర ఖర్చులు.
స్థిరాస్థి వివరణ	కృష్ణా జిల్లా, విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ ఎస్ఆర్ఓ గుండాలా, ఐటిఐ కాలేజీ రోడ్డు, ప్రశాంత్ నగర్, భారత్ గ్యాస్ దగ్గర, (శ్రీ సత్య టవర్స్, స్టిల్ట్, జి+4 అంతస్తులు) తూర్పు బ్లాకు, రెండవ అంతస్తు, ఫ్లాట్ నం.5, డోర్ నం.54-16-6/1గల నివాసిత అపార్టుమెంట్ మొత్తం- పిన్‌కోడ్-520008 (విస్తీర్ణం 1671చ.అ.లు), సరిహద్దులు: తూర్పు: కారిడార్, దక్షిణం: ఒపెన్ టు స్కై, పడమర: ఒపెన్ టు స్కై, ఉత్తరం: ఒపెన్ టు స్కై, యజమాని పేరు: శ్రీ కె.ఎస్.శశిధరన్ నాయర్.
రిజర్వ్ ధర (ఇంతకు తక్కువ ధరకు ఈ ఆస్తి విక్రయించబడదు)	85,01,212.50
ఎర్నెస్ట్ మనీ డిపాజిట్ (ఇఎండి) రు.లలో	8,50,121.25
ఈ ఆస్తిపై సెక్యూర్డ్ క్రెడిటార్ తెలిసినంత వరకు ఎటువంటి క్లయిమ్‌లు కానీ, బకాయిలు కానీ వున్నాయా..	సమాచారం తెలియదు
ఆస్తుల పరిశీలన	10-03-2023
సంప్రదించాల్సిన వ్యక్తి, ఫోన్ నెం.	విశాల్ కుమార్ శుక్లా (అధీకృత అధికారి) 9591103226
బిడ్‌ల దాఖలుకు తుది గడువు	14-03-2023 సా.4 గంటల వరకూ
బిడ్‌లు తెరచు సమయం, తేదీ	https://sarfaesi.auctiontiger.net వెబ్‌సైట్ ద్వారా ఇ వేలం/బిడ్డింగ్ ది 15-03-2023 తేదీ ఉదయం 11 గంటల నుండి మధ్యాహ్నం 1 గంటల వరకూ.

సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) నిబంధనలోలని రూల్ 8(6) కింద పైన పేర్కొన్న రుణగ్రహీత/హామీదారులకు ఈ నోటీసు ప్రచురణ 15 రోజుల గడువు నోటీసుగా కూడా వర్తిస్తుంది.
విక్రయానికి సంబంధించిన నియమ నిబంధనల కోసం ఇవేలం/విక్రయంకు సంబంధించిన నియమ నిబంధనలు, ఇవేలంకు బిడ్‌లను సమర్పించటానికి ముందు ఇతర వివరాల కోసం సెక్యూర్డ్ క్రెడిటార్ వెబ్‌సైట్ http://www.pegasus-arc.com/assets-to-auction.html లో పొందుపర్చిన లింక్‌ను పరిశీలించగలరు. బిడ్డర్లు https://sarfaesi.auctiontiger.net వెబ్‌సైట్‌ను కూడా సందర్శించగలరు లేదా సర్వీస్ ప్రొవైడర్ మెస్సర్స్ ఇ ప్రొక్యూర్‌మెంట్ టెక్నాలజీస్ లిమిటెడ్, ఆక్షన్ టైగర్, బిడ్డర్ సపోర్ట్: 079-68136805/68136837ను కానీ, మొబైల్ నెం.+91 9265562821, 9374519754 ద్వారా కానీ సంప్రదించదగలరు. ఇ మెయిల్: vijay.shetty@auctiontiger.net, chintan.bhatt@auctiontiger.net @ support@auctiontiger.net

స్థలం: విజయవాడ
తేదీ: 13-02-2023
సం/- అధీకృత అధికారి
పెగాసస్ అసెట్స్ రీకన్‌స్ట్రక్షన్ ప్రైవేట్ లిమిటెడ్
(ట్రస్టీ ఆఫ్ పెగాసస్ థర్టీనైన్ ట్రస్ట్ -2)

PEGASUS
పెగాసస్ అసెట్స్ రీకన్‌స్ట్రక్షన్ ప్రైవేట్ లిమిటెడ్
55-56, 5వ అంతస్తు, ఫ్రీ ప్రెస్ హౌజ్, నారిమన్ పాయింట్, ముంబయి-400 021, Tel: -022-61884700
Email: sys@pegasus-arc.com URL: www.pegasus-arc.com

ఇ వేలం అమ్మకం కొరకు బహిరంగ నోటీసు

సెక్యూరిటైజేషన్ అండ్ రికన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ యాక్ట్ 2002, సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) నిబంధనల్లోని రూల్ 8(6) మేరకు స్థిరాస్తుల వేలం.
ఈ దిగువ పేర్కొన్న ఆస్తులను తనఖా పెట్టుకున్న సెక్యూర్డ్ క్రెడిటార్ పెగాసస్ (గ్రూప్) థర్టీ నైన్ తరపున ట్రస్టీ-2 వ్యవహరిస్తున్న పెగాసస్ అసెట్స్ రికన్‌స్ట్రక్షన్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ సామాన్య ప్రజలు ముఖ్యంగా దిగువ పేర్కొన్న రుణగ్రహీత/హామీదారులకు ఈ నోటీసు ద్వారా తెలియచేయునది ఏమనగా దిగువ పేర్కొన్న రుణగ్రహీత/హామీదారులకు చెందిన బకాయిలు, వాటికి సంబంధించిన సెక్యూరిటీలను 2002 నాటి సర్ఫేసీ చట్ట నిబంధనల కింద ఆర్‌బిఎల్ బ్యాంక్‌తో కుదుర్చుకున్న ఒప్పందం 31.03.2021 మేరకు స్వాధీనం చేసుకోవటమైనది.
పెగాసస్‌కు చెందిన అధీకృత అధికారి ఈ దిగువ పేర్కొన్న తనఖా ఆస్తులను సర్ఫేసీ చట్టం, సర్ఫేసీ నిబంధనల మేరకు ది. 10-02-2023న స్వాధీనం చేసుకున్నారు. దిగువ పేర్కొన్న రుణగ్రహీత/హామీదారులు మెసర్స్ పట్టాభి (రుణగ్రహీత), శ్రీ ఎం. శివ నాగభూషణం (సహరుణగ్రహీత, హామీదారు, తనఖాదారు), మరియు శ్రీమతి మొగొలూరి నాగశాంతి (సహరుణగ్రహీత) ది. 14-01-2020 నాటికి బకాయిపడిన మొత్తం రు. 1,06,19,325.81పై.లు (ఒక కోటి ఆరులక్షల పందొమ్మిది వేల మూడు వందల ఇరువై ఐదు రూపాయల ఎనభై ఒక పైసలు మాత్రము), 15.01.2020 నుండి తదుపరి ఇప్పటి వరకూ జమ అయిన వడ్డీ, ఇతర ఖర్చుల రికవరీ కోసం ఈ దిగువ పేర్కొన్న తనఖా ఆస్తులను "ఏది ఎక్కడ ఎలా ఉన్నది అది అక్కడ అలాగే" ప్రాతిపదికన 15-03-2023న వేలం వేయాలని నిర్ణయించడమైనది.

స్థిరాస్తుల వివరాలు, రిజర్వ్ ధర

రుణగ్రహీత పేరు	మెసర్స్ పట్టాభి ఎస్.
హామీదారుల పేరు	శ్రీ ఎం. శివ నాగభూషణం 2. శ్రీమతి బొగొలూరి నాగశాంతి
బకాయిపడిన మొత్తం	ది. 14/01/2020 నాటికి రు. 1.06,19,325.81పై. లు (ఒక కోటి ఆరులక్షల పందొమ్మిది వేల మూడు వందల ఇరువై ఐదు రూపాయల ఎనభై ఒక పైసలు మాత్రము), 15.01.2020 నుండి తదుపరి ఇప్పటి వరకూ జమ అయిన వడ్డీ, ఇతర ఖర్చులు.
స్థిరాస్థి వివరణ	కృష్ణా జిల్లా, ఎపి, టిఎస్ 521165, వుయ్యూరు గ్రామపంచాయతీ& మండలం, ఆర్ఎస్ నం.1052/1, డోర్ నం.3-267, ఎక్స్‌క్యూసివ్ చార్జ్: రెసిడెన్షియల్ బిల్డింగ్ (గ్రౌండ్ +1 అంతస్తు). (ల్యాండ్ ఏరియా: 149.875చ.గ.లు; జి+1; 2365చ.అ.లు), సరిహద్దులు: ఉత్తరం: ముగులూరి అంకారావు ఆస్తి, దక్షిణం: రోడ్డు, తూర్పు: మగులూరి శివనాగ భూషనం ఆస్తి, పడమర: ఉమ్మడి దారి, ఎం. శివనాగ భూషనం స్వంతం.
రిజర్వ్ ధర (ఇంతకు తక్కువ ధరకు ఈ ఆస్తి విక్రయించబడదు)	84,15,000
ఎర్నెస్ట్ మనీ డిపాజిట్ (ఇఎండి) రు.లలో	8,41,000
ఈ ఆస్తిపై సెక్యూర్డ్ క్రెడిటార్ తెలిసినంత వరకు ఎటువంటి క్లయిమ్‌లు కానీ, బకాయిలు కానీ వున్నాయా..	సమాచారం తెలియదు
ఆస్తుల పరిశీలన	10-03-2023
సంప్రదించాల్సిన వ్యక్తి, ఫోన్ నెం.	విశాల్ కుమార్ శుక్లా (అధీకృత అధికారి) 9591103226
బిడ్‌ల దాఖలుకు తుది గడువు	14-03-2023 సా.4 గంటల వరకూ
బిడ్‌లు తెరచు సమయం, తేదీ	https://sarfaesi.auctiontiger.net వెబ్‌సైట్ ద్వారా ఇ వేలం/బిడ్డింగ్ ది 15-03-2023 తేదీ ఉదయం 11 గంటల నుండి మధ్యాహ్నం 1 గంటల వరకూ.

సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) నిబంధనలోలని రూల్ 8(6) కింద పైన పేర్కొన్న రుణగ్రహీత/హామీదారులకు ఈ నోటీసు ప్రచురణ 15 రోజుల గడువు నోటీసుగా కూడా వర్తిస్తుంది.
విక్రయానికి సంబంధించిన నియమ నిబంధనల కోసం ఇవేలం/విక్రయంకు సంబంధించిన నియమ నిబంధనలు, ఇవేలంకు బిడ్‌లను సమర్పించటానికి ముందు ఇతర వివరాల కోసం సెక్యూర్డ్ క్రెడిటార్ వెబ్‌సైట్ http://www.pegasus-arc.com/assets-to-auction.html లో పొందుపర్చిన లింక్‌ను పరిశీలించగలరు. బిడ్డర్లు https://sarfaesi.auctiontiger.net వెబ్‌సైట్‌ను కూడా సందర్శించగలరు లేదా సర్వీస్ ప్రొవైడర్ మెస్సర్స్ ఇ ప్రొక్యూర్‌మెంట్ టెక్నాలజీస్ లిమిటెడ్, ఆక్షన్ టైగర్, బిడ్డర్ సపోర్ట్: 079-68136805/68136837ను కానీ, మొబైల్ నెం.+91 9265562821, 9374519754 ద్వారా కానీ సంప్రదించదగలరు. ఇ మెయిల్: vijay.shetty@auctiontiger.net, chintan.bhatt@auctiontiger.net @ support@auctiontiger.net

స్థలం: విజయవాడ
తేదీ: 13-02-2023
సం/- అధీకృత అధికారి
పెగాసస్ అసెట్స్ రీకన్‌స్ట్రక్షన్ ప్రైవేట్ లిమిటెడ్
(ట్రస్టీ ఆఫ్ పెగాసస్ థర్టీనైన్ ట్రస్ట్ -1)

బ్రెజిల్‌లో 14వేలకు పైగా మౌలిక వసతుల పనుల పునరుద్ధరణ

- ప్రకటించిన అధ్యక్షుడు లూలా
- ఉపాధి అవకాశాలు, ఆదాయం పెరుగుతాయని వ్యాఖ్య

బ్రసీలియా : బ్రెజిల్‌వ్యాప్తంగా నిలిచిపోయిన దాదాపు 14వేల మౌలిక సదుపాయాల నిర్మాణ పనులు పునరుద్ధరించనున్నట్లు దేశ అధ్యక్షుడు లూలా డసిల్వా బుధవారం ప్రకటించారు. దీనివల్ల ఆదాయం, ఉద్యోగాలు సృష్టించబడతాయని, పేదల ప్రయోజనాల కోసం వారి జీవన ప్రమాణాలు మెరుగుపరిచేందుకు, వినిమయాన్ని పెంచేందుకు ఈ చర్య తీసుకుంటున్నట్లు తెలిపారు. గత కొన్నేళ్ళుగా దేశమంతటా నిలిచిపోయిన 14వేలకు పైగా పనులను తిరిగి పునరుద్ధరిస్తున్నట్లు ప్రకటించారు. హైవే విస్తరణ పనులను చూసేందుకు వచ్చిన అధ్యక్షుడు ఈ మేరకు ప్రకటన చేశారు. ఈ పనుల వల్ల దాదాపు వెయ్యి ఉద్యోగావకాశాలు లభిస్తాయన్నారు. దేశ ఆర్థిక చక్రం మళ్లీ పుంజుకోవడానికి అవకాశం వుంటుందన్నారు. ఆగిపోయిన ఈ పనులను తిరిగి పునరుద్ధరించడం ద్వారా దేశ అభివృద్ధి విధానాలను పునర్నిర్మిస్తున్నామన్నారు. బ్రెజిల్ ప్రజలకు మరింత నాణ్యమైన జీవితాన్ని అందిస్తామని, అందుకు వారు అర్హులని లూలా ప్రకటించారు. నిరుపేద కుటుంబాలకు ఉద్దేశించిన సామాజిక రాయితీ ప్రణాళికను కూడా ఆయన ప్రస్తావించారు. బహుశా దీనిపై వచ్చే వారం ప్రకటన వుండొచ్చునని భావిస్తున్నారు. నెలకు 120 డాలర్ల వరకు ఒక కుటుంబానికి అందజేయడం, స్కూలుకు క్రమం తప్పకుండా వెళ్లే ప్రతి పిల్లవాడికి అదనంగా 30డాలర్లు ఇవ్వాలని భావిస్తున్నారు. కార్మికులు, మహిళలు, పిల్లలు ఇలా ఎవరైనా వారి సంరక్షణను తాము ప్రేమతో చూడాలనుకుంటామని లూలా చెప్పారు. అబద్దాల ప్రభుత్వ పాలన నుంచి వాస్తవాల ప్రభుత్వానికి బ్రెజిల్ మారిందని వ్యాఖ్యానించారు.

ఇరాన్‌పై ఆంక్షలు ఎత్తివేయండి

- ఇరాన్, చైనా సంయుక్త ప్రకటన



బీజింగ్ : ఇరాన్‌పై విధించిన ఆంక్షలను ఎత్తివేయాలని చైనా, ఇరాన్ సంయుక్తంగా డిమాండ్ చేశాయి. చైనాలో ఇరాన్ అధ్యక్షుడి మూడు రోజుల పర్యటన గురువారంతో ముగిసింది. ఈ సందర్భంగా ఇరు దేశాల అధ్యక్షులు ఒక సంయుక్త ప్రకటన విడుదల చేశారు. ఇరాన్‌పై విధించిన ఆంక్షలను ఎత్తివేయాలని ఈ సందర్భంగా విజ్ఞప్తి చేశారు. 2015 ఇరాన్ అణు ఒప్పందాన్ని అమలు చేయాలని ఇరు దేశాల నాయకులు పిలుపునిచ్చారు. ఇరాన్‌ను సందర్శించాలని రైసీ చేసిన ఆహ్వానాన్ని జిన్‌పింగ్ అంగీకరించారు. ఇ-కామర్స్, వ్యవసాయాన్ని ప్రోత్సహించడంతో పాటు అనేక ఒప్పందాలపై ఇరువురు నాయకులు సంతకాలు చేశారు. చైనా అధ్యక్షులు జిన్‌పింగ్ త్వరలో ఇరాన్‌లో పర్యటించనున్నారు. ఇరాన్ అధ్యక్షులు ఇబ్రహిం రైసీ ఆహ్వానం మేరకు ఆయన ఆ దేశంలో పర్యటిస్తారు.

'మహారాష్ట్ర రాజకీయ సంక్షోభం'పై తీర్పు రిజర్వ్

న్యూఢిల్లీ : మహారాష్ట్ర రాజకీయ సంక్షోభంపై గురువారం సుప్రీంకోర్టు తీర్పును రిజర్వ్‌లో ఉంచింది. మహారాష్ట్ర రాజకీయ సంక్షోభంపై తీర్పును ఇచ్చే ముందు 2016లో ఇచ్చిన తీర్పును పున:సమీక్షించాల్సి ఉందని సుప్రీం కోర్టు వ్యాఖ్యానించింది. 2022 ప్రారంభంలో శివసేన నుంచి ఏక్‌నాథ్ షిండే (ప్రస్తుత ముఖ్యమంత్రి), ఆయన అనుచరులు బయటకు రావడంతో మహారాష్ట్రలో రాజకీయ సంక్షోభం ప్రారంభమయింది. మహావికాస్ అఘాడీ ప్రభుత్వం కూలిపోయింది. ఈ క్రమంలోనే ఏక్‌నాథ్ షిండే, మరికొందరు ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయాలని సుప్రీంకోర్టులో వరస పిటీషన్లు దాఖలయ్యాయి. వీటిని ప్రధాన న్యాయమూర్తి డివై చంద్రచూడ్ నేతృత్వంలోని ఐదుగురు సభ్యుల ధర్మాసనం విచారించింది. తీర్పును రిజర్వ్‌లో ఉంచింది. ఈ తీర్పును ఇచ్చే ముందు 2016లో నబమ్ రబియా కేసులో ఇచ్చిన మెజార్టీ జడ్జిమెంట్ తీర్పును పున: సమీక్షించాల్సి ఉందని ధర్మాసనం పేర్కొంది.

భారత్ హిందూ దేశం

- దేశంలోని పౌరులందరూ హిందువులే
- యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్ వివాదాస్పద వ్యాఖ్యలు

లక్నో : యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్ మరోసారి వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. బాధ్యతాయుతమైన ముఖ్యమంత్రి స్థాయిలో ఉండి లౌకికస్ఫూర్తికి విరుద్ధంగా మాట్లాడారు. దేశంలో ఉన్న పౌరులందరూ హిందువులనీ, ఇండియా ఒక హిందూ దేశమని అన్నారు. ఒక వార్త సంస్థకు ఇంటర్వ్యూ ఇస్తూ ఆయన ఈ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. అంతేకాకుండా, సదరు ఇంటర్వ్యూకు సంబంధించిన క్లిప్‌ను కూడా ఆయన ట్విట్టర్‌లో పోస్టు చేశారు. హిందూ గుర్తింపు అనేది మతంతో ముడిపడి ఉండదనీ, అది ఒక సాంస్కృతిక పదమని యోగి అన్నారు. హిందును అర్థం చేసుకునే క్రమంలో మనం తప్పు చేస్తున్నామని చెప్పారు. భారత్ నుంచి ఎవరైనా హజ్‌కు వెళ్లినపుడు అక్కడ ఆ వ్యక్తిని హిందువుగా సంబోధిస్తారని చెప్పారు. అలా వెళ్లిన వ్యక్తిని ఎవరు కూడా హజీగా చూడరనీ, ఇస్లాంకు సంబంధించిన వ్యక్తిగా ఒప్పుకోరని అన్నారు.

ఓరిక్స్ లీజింగ్ అండ్ ఫైనాన్షియల్ సర్వీసెస్ ఇండియా లిమిటెడ్
(గతంలో ఓరీస్ ఆటో ఫైనాన్షియల్ సర్వీసెల్ లిమిటెడ్‌గా పేర్కొనబడినది) (ఓరిక్స్ ఆటో ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ సర్వీసెస్ లిమిటెడ్ యొక్క అనుబంధ సంస్థ)
రిజిస్టర్ ఆఫీస్: ప్లాట్ నం.94, మరోల్ కో-ఆపరేటివ్ ఇండస్ట్రియల్ ఎస్టేట్, అంధేరి-కుర్లా రోడ్డు, అంధేరి (ఇ), ముంబై-400 059
టెలి: 91 22 2859 5093/6707 0100/ ఫ్యాక్స్: 91 22 2852 8549
ఇ మెయిల్: info@orixindia.com/ www.orixindia.com/ సిఐఎన్: U74900MH2006PLC163937

స్వాధీనతా నోటీసు

(సెక్యూరిటీ ఇంట్రస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002, యొక్క రూల్ 8(1) తో చదువుతూ అనుబంధం IV ప్రకారం)

ఏదైతే, ఓరిక్స్ లీజింగ్ అండ్ ఫైనాన్షియల్ సర్వీసెస్ ఇండియా లిమిటెడ్ యొక్క అధీకృత అధికారి అయిన దిగువ సంతకందారుడు సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ మరియు ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూర్డ్ ఇంట్రస్ట్ యాక్ట్, 2002, క్రింద మరియు సెక్షన్ 13(12) రూల్ 3 తో చదువుతూ సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 అతనికి ఇవ్వబడిన అధికారాలను వినియోగిస్తూ నోటీసు అందిన తేదీ నుండి 60 రోజులలోపు నోటీసులో పేర్కొన్న మొత్తాన్ని తిరిగి చెల్లించాలని పేర్కొంటూ డిమాండ్ నోటీసును జారీ చేయడం జరిగింది.మొత్తాన్ని తిరిగిచెల్లించుటలో విఫలమైనారు, రుణగ్రహీతలకు మరియు సాధారణ ప్రజానీకానికి ఇందుమూలంగా నోటీసు ఇవ్వడమేమనగా ఆధీకృత అధికారి అతని అధికారాలను నిర్ణయించి అధ్యాయనం చేస్తూ ఆమె/అతను రూల్ 8 చదువుతూ సదరు చట్టం సెక్షన్ 13లోని సబ్ సెక్షన్ (4) క్రింద దిగువ వివరించిన ఆస్థిని దిగువసంతకందారుడు స్వాధీనపరుచుకున్నాడు.ముఖ్యంగా రుణగ్రహీత మరియు సాధారణ ప్రజానీకాన్ని హెచ్చరించడమేమనగా సదరు ఆస్థితో ఎలాంటి లావాదేవీలు జరుపరాదు మరియు ఏవైనా లావాదేవీలు లోన్ ఒప్పందం ప్రకారం డిమాండ్ నోటీసులో పేర్కొన్న మొత్తాన్ని దానిపై వడ్డీతో సహా ఓరిక్స్ లీజింగ్ అండ్ ఫైనాన్షియల్ సర్వీసెస్ ఇండియా లిమిటెడ్ కి చెల్లించి జరుపవచ్చు. రుణగ్రహీత జాగ్రత్త వహించవల్సింది ఏమనగా సెక్యూర్డ్ అస్సెట్స్‌ను విడిపించుకొనుటకు మీకు లభించిన సమయం మేరకు చట్టం యొక్క సెక్షన్ 13 యొక్క సబ్ సెక్షన్ (8) నిబంధనలను అహ్వానించడమైనది.

క్ర. సం	లోన్ ఎకౌంట్ నం	రుణగ్రహీత/సహ రుణగ్రహీత యొక్క పేర్లు	డిమాండ్ నోటీసు తేది మరియు మొత్తం	స్వాధీనం చేసుకున్న తేది మరియు రకం	స్థిరాస్తుల యొక్క వివరణ
1	LN0000000016131	1. అడపాల శివనాగమణి 2. గోగిశెట్టి లక్ష్మి సామ్రాజ్యం 3. చౌలం శ్రీవల్లి 4. బ్యూటీ లైఫ్ సెంటర్	26-Nov-2022 & Rs. 50,35,632.25/-	13-ఫిబ్రవరి-2023 (లాంఛనప్రాయ స్వాధీనత)	గుంటూరు జిల్లా 522001, 9వ లైన్, నెహ్రూ నగర్ వద్ద ఉన్న మొత్తం ఆ ముక్క మరియు పార్శిల్ సైట్ పరిధిలో 227.70 చ.గజాలు. బేరింగ్ డో.నం.420/బి, ప్లాట్ నం.11, డో.నం.8-13-111, మరియు హద్దులు: ఉత్తరం: ఎస్.పున్నమ్మ యొక్క ఆస్తి 82'-0", దక్షిణం: పి. మల్లయ్య యొక్క ఆస్తి 82'-0", తూర్పు: గుంటూరు మున్సిపల్ రోడ్డు 25'-0", పడమర: పి. వెంకటేశ్వర్లు యొక్క ఆస్తి 25'-0".
2	LN0000000017626	1.వట్టికుటి వి ఎల్ నరసమ్మ 2. ఓం సాయి రామ్ కిరాణా అండ్ ఫాన్సీ 3. గల్ల సీతారామయ్య	29-Nov-2022 & Rs. 54,51,715.05/-	13-ఫిబ్రవరి-2023 (లాంఛనప్రాయ స్వాధీనత)	ఆంధ్రప్రదేశ్-522006, గుంటూరు, 2వ లైన్, స్తాంబలగరువు, నల్లపాడు శివారు వద్ద ఉన్న మొత్తం ఆ ముక్క మరియు పార్శిల్ టి.ఎస్.నం.818, డో.నం.233/ఎ1, మూల్యాకనం నం.1365/3, మున్సిపల్ వార్డు నం.1 (పాత), 2 (కొత్త), బ్లాక్ నం.9, డో.నం.2-2-34 కొలిచే 124 చ.గజాలు. అనగా 103.68 చ.మీటర్లు. మరియు హద్దులు: ఉత్తరం ఎమ్. సుబ్బారెడ్డి యొక్క ఆస్తి 30'-3", దక్షిణం: 12 అడుగుల వెడల్పు రోడ్డు 30'-0", తూర్పు: ఎస్‌కె. సఫియాబీ యొక్క ఆస్తి 37'-9", పడమర: ఎన్. అమల యొక్క ఆస్తి 36'-7".
3	LN0000000016134	1.చిన్న బాబావలి తమ్మ 2. తుమ్మ వెంకటేశ్వర్లు 3. తమ్మ చిన్న బాబావలి ఫిష్ కంపెనీ 4. తమ్మ జలమ్మ 5. అంక నాగరాజు తమ్మ	29-Nov-2022 & Rs. 53,29,370.26/-	13-ఫిబ్రవరి-2023 (లాంఛనప్రాయ స్వాధీనత)	ఆంధ్రప్రదేశ్-522201, గుంటూరు, తెనాలి జిల్లా, తెనాలి మున్సిపాలిటీ, శారద హాస్పిటల్ వద్ద ఉన్న ఆస్తి మొత్తం ఆ ముక్క మరియు పార్శిల్ డో.నం.15-9-40, కొలిచే ఏరియా పరిధిలో 89 చ.గజాలు. లేదా 74.41 చ.మీటర్లు. ఎన్.టి.ఎస్.నం.201, వార్డు నం.4, బ్లాక్ నం.3, మూల్యాంకనం నం.6943 మరియు హద్దులు: తూర్పు: షేక్ కరీమ్ మరియు షేక్ సలీమ్ యొక్క గోడ 26'6", పడమర: మున్సిపల్ రోడ్డు 26'6", దక్షిణం: డో.నం.15-9-41 యొక్క ఆస్తి 30'6", ఉత్తరం: షేక్ రహిమాన్ యొక్క గోడ 30'6".

తేది: 13 ఫిబ్రవరి, 2023
ప్రదేశం: గుంటూరు
సం/-
ఆధీకృత అధికారి,
ఓరిక్స్ లీజింగ్ అండ్ ఫైనాన్షియల్ సర్వీసెస్ ఇండియా లిమిటెడ్.

కేంద్ర ప్రభుత్వ విధానాలతో

గ్రామాలు అతలాకుతలం

- పోరాటాలు..సేవా దృక్పథంతో సంఘ విస్తరణ
- మహాసభలో కార్యదర్శి నివేదిక ప్రవేశ పెడుతూ బి వెంకట్

జ్యోతిబసు నగర్ నుండి ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి

కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న విధానాల కారణంగా గ్రామీణ భారతం అతలాకుతలమవుతోందనిఅఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి వెంకట్ తెలిపారు. హౌరాలోని జ్యోతిబసునగర్(శరత్‌శ్చంద్ర ఆడిటోరియం)లో జరుగుతున్న 10వ మహాసభలో ఆయన కార్యదర్శి నివేదికను ప్రవేశపెట్టారు. కేంద్ర విధానాల కారణంగా వ్యవసాయ రంగం గతంలో ఎన్నడూ లేనివిధంగా సంక్షోభంలో చిక్కుకుందని, దాని ఫలితం వ్యవసాయ కార్మికులపై తీవ్రస్థాయిలో పడుతోందని అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి కోల్పోయి, పెద్ద సంఖ్యలో వ్యవసాయ కార్మికులు పట్టణాల బాట పట్టాల్సివచ్చిందని చెప్పారు. కరోనా కాలంలో పట్టణాల్లో సైతం పనులు లేక తీవ్ర ఇబ్బందులు పడ్డారని గుర్తుచేశారు. అదే సమయంలో బిలియనీర్లు పెరిగారని, దీనికి ప్రభుత్వ విధానాలే కారణమని చెప్పారు. మరోవైపు ఫాసిస్టు దాడులూ పెరుగుతున్నాయని, దీనికి బలవుతోందని కూడా నిరుపేదలు, వ్యవసాయ కార్మికులేనని అన్నారు. భూమిలేని పేదల సంఖ్య క్రమంగా పెరుగుతోందని అన్నారు. వ్యవసాయ కార్మికులతోపాటు చిరు ఉద్యోగులూ ఉపాధిని కోల్పోయారని వివరించారు. ఈ నేపథ్యంలో వ్యవసాయ కార్మికుల సంక్షేమం కోసం, వారి హక్కుల కోసం నిరంతరం పోరాటాలు చేయడంతోపాటు, సేవా ధృక్పథంతో వ్యవసాయ కార్మికసంఘం వ్యవహరిస్తోందని, ఫలితంగా సంఘ సభ్యత్వం గణనీయంగా పెరుగుతోందని అన్నారు. 2020లో కన్నూరులో జరిగిన మహాసభ అనంతరం దేశ వ్యాప్తంగా ఉద్యమం ఊపందుకుందని తెలిపారు. కేరళలో 22 లక్షలు, బెంగాల్లో 19 లక్షల సభ్యత్వం ఉందని వివరిం చారు. అలాగే తమిళనాడు, తెలంగాణా, తమిళనాడు, త్రిపుర, బీహార్, అస్సాం ఇలా అన్ని రాష్ట్రాల్లోనూ క్రమంగా సభ్యతాన్ని పెంచుకుంటున్నామని వివరించారు. బెంగాల్ వంటి రాష్ట్రంలో ఒక్కరోజులోనే ఐదు లక్షల సభ్యత్వం చేర్పించారని, ఉద్యమం ప్రభావం, ఫలితం ఉండటంతోనే అనేకమంది సంఘంలో చేరేందుకు స్వచ్ఛందంగా ముందుకు వచ్చారని అన్నారు. కేరళ రాష్ట్రంలో వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యాన పెద్దఎత్తున సేవా కార్యక్రమాలు చేస్తున్నారని పేర్కొన్నారు. అక్కడ పేదలకు గృహ నిర్మాణంలో సంఘం కీలకపాత్ర పోషించిందన్నారు. ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్, తెలంగాణా వంటి రాష్ట్రాల్లో వందల సంఖ్యలో పేదలు నివశించే ప్రాంతాల్లో పర్యటించి వారి ఇబ్బందులు తెలుసుకోవడంతోపాటు వాటి పరిష్కారానికి కృషి చేస్తున్నారని అన్నారు. తెలంగాణాలో వరంగల్ నగరంలో నిర్వహించిన ఉద్యమం మంచి స్ఫూర్తిగా నిలిచిందని పేర్కొన్నారు.

ఆంధ్రప్రదేశ్‌లోనూ పేదల కాలనీల్లో పర్యటించి సర్వే చేశారని, దీని ఫలితంగా నిజమైన లబ్ధిదారులు ఎవరో ప్రభుత్వానికి తెలిసొచ్చి న్యాయం జరుగుతోందని అన్నారు. కరోనా కాలంలో వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యాన నాయకత్వం సేవా కార్యక్రమాలు చేయడం తోపాటు నిధులు సేకరించి కోవిడ్ బారిన పడిన వారికోసం సేవలందించిందని తెలిపారు.బిజెపి అనుసరిసు_న్న ప్రజా వ్యతిరేక విధానాలను అడ్డుకోవడంతోపాటు, కేంద్రానికి వ్యతిరేకంగా పెద్దఎత్తున పోరాటాలు నిర్వహించాల్సి ఉందని మహాసభ వేదికగా పిలుపునిచ్చారు.

హక్కులకోసం పోరాటం

వ్యవసాయ కార్మికసంఘం మహాసభలో వివిధ రాష్ట్రాల ప్రతినిధులు

హౌరా నుండి ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి

వ్యవసాయ కార్మికుల హక్కుల కోసం అలుపెరుగని పోరాటం చేస్తున్నామని, ఉపాధి హామీ పథకాన్ని బలోపేతం చేయాలని, భూమిలేని పేదలకు న్యాయం చేయాలని, అర్హులైన పేదలందరికీ న్యాయం చేయాలని చేస్తున్న పోరాటాల ఫలితంగా పలు రాష్ట్రాల్లో ప్రభుత్వాల్లో కదలిక వస్తున్నాయని తెలిపారు. హౌరాలోని జ్యోతిబసు నగర్లో జరుగుతున్న అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం మహాసభల్లో రెండోరోజైన గురువారం పలు రాష్ట్రాల నుండి హాజరైన ప్రతినిధులు కార్యదర్శి నివేదికపై మాట్లాడారు.

మహాసభకు హాజరైన ఆంధ్రప్రదేశ్ ప్రతినిధులు

పేదల భూములు లాక్కుంటున్న ప్రభుత్వం

ఆంధ్రప్రదేశ్ ప్రతినిధి నాగరాజు

ఆంధ్రప్రదేశ్‌లో ప్రత్యేక పరిస్థితులు ఉన్నాయని, అక్కడ అధికార, ప్రతిపక్ష పార్టీలు రెండూ బిజెపికి అనుకూలంగా ఉన్నాయని ఆంధ్రప్రదేశ్ నుండి మాట్లాడిన నాగరాజు తెలిపారు. . సంఘం ఆధ్వర్యాన 11 రకాల అంశాలపై తాము పోరాటం చేస్తున్నామన్నారు. రాష్ట్రంలో అనేక ప్రాంతాల్లో పరిశ్రమల కోసం భూములు లాక్కుంటారని, దీనివల్ల ఎక్కువమంది పేదలు భూమి కోల్పోతున్నారని తెలిపారు. దీనిపై తాము పోరాటం నిర్వహిస్తున్నామని అన్నారు. అలాగే దళితులకు పంచిన అసైన్డ్ భూములను ప్రభుత్వం లాక్కుంటుందని వివరించారు. దీనిపై పోరాటంలో అనేకమంది జైళ్లపాలు చేశారని వివరించారు. ఆందోళనకారులను ముందస్తు అరెస్టులు చేస్తున్నారని వివరించారు. భూ పోరాటాలు జరిగే ప్రాంతంలో నాయకులు, పోరాటాల్లో పాల్గొంటున్నవారిని పోలీసులు ముందుగా నిర్బంధిస్తున్నారని తెలిపారు. కేసులు బనాయిస్తున్నారని పేర్కొన్నారు. గిరిజన ప్రాంతాల్లోనూ భూములను కార్పొరేట్లకు కట్టబెతున్నారని, దీనిపైనా పోరాటాలు సాగిస్తున్నామని చెప్పారు.

విస్తరణతోపాటు ప్రజా చైతన్యం

ఈమని అప్పారావు

జ్యోతిబసు నగర్ నుండి ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి

రాష్ట్రంలో వ్యవసాయ కార్మిక సంఘం ఉద్యమాన్ని విస్తరించ డంతోపాటు కార్మికుల్లో చైతన్యం తీసుకొ స్తున్నామని ఆంధ్రప్రదేశ్ ప్రతినిధి ఈమని అప్పారావు తెలిపారు. అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం 10వ మహాసభలో రాష్ట్రాల నివేదికలపై చర్చలో ఆయన మాట్లాడారు. ఇప్పటికే రాష్ట్ర వ్యాప్తంగా పెద్దఎత్తున పేదలు నివసించే ప్రాంతాల్లో సర్వే నిర్వహించి వారి సాధక బాధకాలు తెలుసుకున్నామని దీనికి అనుగుణంగా సమస్యల పరిష్కారానికి పోరాటాలు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. దీనికోసం గ్రామీణ ప్రాంతాల్లో కార్మికుల సమస్యలపై పనిచేస్తూ ముందుకు సాగుతున్నా మని పేర్కొన్నారు. అందరినీ కలుపుకుపోవడం, ఐక్య పనివిధానం ద్వారా ఉద్యమాన్ని విస్తరిస్తున్నామని వివరించారు. సమస్యలు తెలుసుకోవడానికి ప్రాధాన్యత ఇస్తున్నామని పేర్కొన్నారు.పలు ప్రాంతాల్లో ఇళ్ల స్థలాల సమస్య ఎక్కువగా ఉందని, దానికి అనుగుణంగా సమస్యలు తెలుసుకుని వారికి గృహ నిర్మాణం కల్పించేందుకు ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తున్నామని చెప్పారు. మహిళలపై దాడులు ఎక్కువగా జరుగుతున్నాయని, వాటిని అడ్డుకునేందుకు కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. వ్యవసాయ కార్మికులుగా ఉన్న మహిళలపై గ్రామీణ ప్రాంతాల్లో రైతులు, వారి కుటుంబ సభ్యుల నుండి తీవ్ర ఒత్తిడులు ఉంటున్నాయని వాటిని అడ్డుకుంటున్నామని పేర్కొన్నారు.

వీధి నాటకం

ఓ 'అద్భుత చిత్రం' గీస్తున్న కళాకారుడు

కళ్లముందే జీవన 'చిత్రం'

ఆకట్టుకుంటున్న కళాకారుల సృజన

హౌరా నుండి ప్రజాశక్తి ప్రతినిధి

అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం 10వ మహాసభల్లో ఓ 'అద్భుత చిత్రం' ఆవిష్కృతమైంది. బెంగాల్లోని 26 మంది అద్భుత కళాకారులు ఒకేసారి 26 రకాల చిత్రాలను అప్పటికప్పుడు గీశారు. ఇలా గీయడం అదీ కూడా పేరున్న కళాకారులు ఒకచోట చేరడం అత్యంత అరుదైన విషయమని ప్రతినిధులు ఆశ్చర్యం వ్యక్తం చేశారు. ఈ చిత్రాల్లో ప్రజాతంత్ర ఉద్యమాన్ని కళ్లకు కట్టేలా సాగడం మరో విశేషం. వ్యవసాయ కార్మిక సంఘం మహాసభల రెండోరోజు ఉదయం వేర్వేరు ప్రాంతాలకు చెందిన 26 మంది కళాకారులు ఒక్కసారిగా సభ జరుగుతున్న వేదిక వద్దకు చేరుకున్నారు. వెంటనే బోర్డులు ఏర్పాటు చేసుకుని అక్కడికక్కడే వాటర్ పెయింట్‌తో చకచకా బొమ్మలు గీయడం మొదలుపెట్టారు. అందరూ చూస్తుండగానే అతి తక్కువ సమయంలో కళారూపాలను ఆవిష్కరించారు. అవి కూడా సామన్య ప్రజల జీవన చిత్రాలను, ప్రస్తుతం కేంద్రం అనుసరిస్తున్న విధానాలతో రైతులు పడుతున్న ఇబ్బందులనూచిత్రీకరించారు.

రైతు నోటిని కట్టేసి, నాగలిని మేకుతో నిర్బంధిస్తున్నట్లు, రైతులు గిట్టుబాటుగాక ఉరివేసుకుంటున్నట్లు ఇలా రకరకాల చిత్రాలతో రైతులు, వ్యవసాయ కార్మికులు, కార్మికుల ఆవేదనను కళ్లకు కట్టారు. వీటితోపాటు నిరుద్యోగుల పరిస్థితులనూ చిత్రీకరించారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంత జీవన విధానం, ప్రకృతి ప్రేమికులు ఇలా అన్ని రకాల బొమ్మలనూ అతి తక్కువ కాలంలో గీశారు..

ఆకట్టుకుంటున్న వీధి నాటకాలు

బెంగాల్లో ప్రస్తుత దారుణ పరిస్థితులను వివరిస్తూ ప్రతిరోజూ కళాకారులు వీధినాటిక ప్రదర్శిస్తున్నారు. ముఖ్యంగా హత్యాకాండను, మహిళలపై గ్రామీణ ప్రాంతాల్లో జరుగుతున్న దారుణాలను వివరించే విధంగా ఈ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

పోరాటాలతో ప్రభుత్వంలో కదలిక

రేపాకుల శ్రీనివాస్, తెలంగాణ

తెలంగాణా ప్రాంతంలో పెద్దఎత్తున పోరాటాలు నిర్వహిస్తున్నామని తెలంగాణ నుండి చర్చల్లో పాల్గొన్న రేపాకుల శ్రీనివాస్ చెప్పారు. మూడో మహాసభ ఖమ్మంలో లక్షమందితో నిర్వహించామన్నారు. భూమి, ఇళ్లస్థలాలు, పోడుభూమి, భూములు కోల్పోతున్నవారు, ఉపాధి హామీ పథకంపై పెద్దఎత్తున పోరాటాలు నిర్వహించామన్నారు. ఫలితంగా ప్రభుత్వంలో కదలిక వచ్చిందన్నారు. అంతేకాకుండా ఉపాధి హామీ విషయంలో పేదలకు న్యాయం చేయాలని డిమాండు చేస్తున్నట్లు తెలిపారు . అనేక ప్రాంతాల్లో పేదల భూములను పరిశ్రమల పేరుతో ప్రభుత్వం లాక్కుంటోందన్నారు. దీనిపైనా ఆందోళన చేపట్టామన్నారు. అన్ని జిల్లా కలెక్టరేట్లు, తహశీల్దార్ కార్యాలయాల ముందు పోరాటాలు చేస్తున్నట్లు తెలిపారు.

కేంద్ర ఒత్తిడులు ఎదుర్కొంటున్నాం

రతీంద్రన్ కేరళ ప్రతినిధి

కేరళలో వ్యవసాయ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం రాష్ట్ర ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టిందని కేరళ ప్రతినిధి రతీంద్రన్ తెలిపారు. పజా పంపిణీ వ్యవస్థను బలోపేతం చేసినట్లు చెప్పారు. దీన్ని తట్టుకోలేని కేంద్రం తనిఖీల పేరుతో వేధింపులకు దిగుతోందని చెప్పారు. ఎన్ఐఎ, ఇడిని అడ్డం పెట్టుకుని దాడులకు దిగుతోందన్నారు.

పట్టణ ప్రాంతాల్లో ఉపాధి హామీ కోసం పోరు

కోదండన్, తమిళనాడు ప్రతినిధి

పట్టణ ప్రాంతాల్లోనూ ఉపాధిహామీని అమలు చేయాలని డిమాండ్ చేస్తూ తమిళనాడులో పోరాటాలు నిర్వహిస్తున్నట్లు ఆ రాష్ట్ర ప్రతినిధిప్రతినిధి కోదండన్ తెలిపారు.

తృణమూల్ హత్యాకాండను కళ్లకు కడుతున్న ఫొటో ఎగ్జిబిషన్

హౌరా నుండి ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి

వ్యవసాయ కార్మికసంఘం జాతీయ మహాసభ సందర్భంగా బెంగాల్లో వామపక్ష, ప్రజాతంత్రవాదులుపై తృణమూల్, బిజెపి కార్యకర్తలు చేస్తున్న దాడులను కళ్లకు కట్టే విధంగా ఫోటో ఎగ్జిబిషన్‌ను ఏర్పాటు చేశారు. ఈ ఎగ్జిబిషన్‌ను మహాసభ ప్రతినిధులతో పాటు స్థానికులు కూడా పెద్ద సంఖ్యలో తిలకిస్తున్నారు. బెంగాల్లో వేర్వేరు ప్రాంతాల్లో ఇప్పటి వరకూ సుమారు 270 మందికిపైగా కార్యకర్తలను దారుణంగా హత్య చేశారు. తృణమూల్ అనుకూల మీడియాలో తప్పుడు ప్రచారం చేయిస్తూ అనంతరం ఒక పద్ధతి ప్రకారం దాడులు చేయడం, ప్రతిఘటిస్తే ఆస్తులను దోచుకోవడంతోపాటు నాయకులను హత్య చేయడం పనిగా పెట్టుకున్నారు. ఈ దారుణ హత్యలకు సంబంధించి వేర్వేరు పత్రికల్లో వచ్చిన వార్తల తాలూకూ ఫోటోలను ఎగ్జిబిషన్లో ప్రత్యేకంగా ప్రదర్శింపజేశారు. దారుణంగా చంపబడిన కార్యకర్తల ఫొటోలను చూసి అక్కడకు వచ్చిన ప్రతినిధులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అదే సమయంలో బెంగాల్లో క్రమంగా ప్రజలు వామపక్షాలవైపు మొగ్గుతున్నారని తెలిపే విధంగా జరిగిన సభలతో కూడిన ఫోటోలనూ ఏర్పాటు చేశారు. తృణమూల్ కాంగ్రెస్ ఆకృత్యాలకు ప్రజల్లో వచ్చిన తిరుగుబాటు ఆందోళనల చిత్రాలనూ పెట్టారు. ఫొటో ఎగ్జిబిషన్ మహాసభకు వచ్చిన ప్రతినిధులను ఆలోచింపజేసింది.

మూడో రోజూ బిబిసి కార్యాలయాల్లో ఐటి సోదాలు

న్యూఢిల్లీ : వరసగా మూడోరోజూ బిబిసి ఇండియా కార్యాలయాల్లో ఆదాయపన్ను శాఖ (ఐటి) సోదాలు కొనసాగాయి. న్యూఢిల్లీ, ముంబయిలోని బిబిసి కార్యాలయాల్లో గురువారం ఐటి శాఖ అధికారులు సోదాలు నిర్వహించారు. కొంతమంది ఎంపిక చేసిన బిబిసి సిబ్బందిని అధికారులు ప్రశ్నించి, సంస్థ ఆర్థిక సమాచారాన్ని సేకరించారు. మంగళవారం ఉదయం 11:30 నుంచి బిబిసి కార్యాలయాల్లో ఐటి శాఖ సోదాలు ప్రారంభమయ్యాయి. ఈ సోదాల గురించి బుధవారం ఐటి అధికారులు మాట్లాడుతూ ఈ కసరత్తు మరికొంత కాలం పాటు కొనసాగుతుందని వెల్లడించారు. సంస్థ ఆర్థిక లావాదేవీలు, కంపెనీ నిర్మాణం, సంస్థ ఇతర వివరాల కోసం సోదాలు కొనసాగుతున్నట్లు సమాచారం. మరొకవైపు 'ప్రతీకార రాజకీయాలు'లో భాగంగానే బిబిసి ఇండియాపై ఐటి శాఖ సోదాలు జరుగుతున్నాయని పలువురు విమర్శిస్తున్నారు. బిబిసిలో ఇటీవల రెండు భాగాలుగా ప్రసారమైన 'ఇండియా: ది మోడీ క్వశ్చన్' డాక్యుమెంటరీ ప్రపంచవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. ఇందులో 2002 గుజరాత్ అల్లర్లకు మోడీనే ప్రధాన కారణమని పేర్కొన్నారు. ఈ డాక్యుమెంటరీ ప్రసారం చేసినందుకే కేంద్ర ప్రభుత్వం ఐటి శాఖతో దాడులు నిర్వహిస్తోందని విమర్శలున్నాయి.

రామసేతుపై పిటిషన్‌ను విచారించనున్న సుప్రీం

న్యూఢిల్లీ : రామసేతును జాతీయ వారసత్వ కట్టడంగా ప్రకటించాలని కేంద్రానికి ఆదేశాలు జారీ చేయాలని కోరుతూ రాజ్యసభ మాజీ ఎంపి సుబ్రమణ్య స్వామి దాఖలు చేసిన పిటిషన్ విచారణకు స్వీకరించేందుకు సుప్రీం కోర్టు గురువారం అంగీకరించింది. ఇంతవరకు దీనిపై ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని, అందువల్ల ఇప్పుడు విచారణకు స్వీకరిస్తున్నట్లు ప్రధాన న్యాయమూర్తి చంద్రచూడ్ నేతృత్వంలోని బెంచ్ తెలిపింది. రాజ్యాంగ ధర్మాసనం చేపట్టిన అంశాలపై విచారణ పూర్తికాగానే దీన్ని విచారిస్తామని చంద్రచూడ్ చెప్పారు. ఢిల్లీ – కేంద్రం మధ్య నెలకొన్న వివాదాన్ని కూడా విచారణకు చేపట్టనున్నారు. రామ సేతును జాతీయ వారసత్వ సంపదగా ప్రకటించే విషయాన్ని కేంద్రం పరిశీలిస్తోందంటూ జనవరి 19న సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా కోర్టుకు తెలియజేశారు.

భూమి కోసం.. ఇంటికోసం.. ఐక్యపోరాటం

వ్యవసాయ కార్మిక మహాసభ పిలుపు

జ్యోతిబసు నగర్ నుండి ప్రజాశక్తి ప్రతినిధి

భూమి కోసం, ఇంటికోసం ఐక్యపోరాటానికి సిద్ధం కావాలని వ్యవసాయ కార్మికసంఘం పిలుపునిచ్చింది. హౌరాలోని జ్యోతిబసు నగర్‌లో జరుగుతున్న వ్యవసాయకార్మికసంఘం జాతీయమహాసభలో గురువారం ఈ మేరకు ప్రవేశపెట్టిన తీర్మానాన్ని ఏకగ్రీవంగా ఆమోదించారు. ఈ తీర్మానాన్ని స్టీరింగ్ కమిటీ సభ్యులు శివదాసన్ ప్రవేశపెట్టగా ఆంధ్రప్రదేశ్ ప్రతినిధి దడాల సుబ్బారావు బలపరిచారు. దేశవ్యాప్తంగా 2015 నేషనల్ శాంపిల్ సర్వే ప్రకారం గ్రామీణ ప్రాంతాల్లో 47 శాతం మందికి నేటికీ భూమి, ఇల్లు లేదని తెలిపారు. భూమిలేని వారిలోనూ 57.3 శాతం దళితులు, 53.1 శాతం మైనారిటీలు 32.18 శాతం ఆదివాసీలు ఉన్నారని వివరించారు. ముఖ్యంగా దేశవ్యాప్తంగా 10.3 శాతం మంది మహిళలకు మాత్రమే భూములపై హక్కులు ఉన్నట్లు జాతీయ కుటుంబ సర్వే నివేదిక చెబుతోందని తెలిపారు దేశంలో . భూసంస్కరణలు అమలు చేయడంలో బూర్జువావర్గం చారిత్రక తప్పిదం చేసిందని తీర్మానంలో పేర్కొన్నారు. పశ్చిమబెంగాల్, కేరళ, త్రిపురలో వామపక్ష ప్రభుత్వాల హయంలోనే భూ సంస్కరణలు అమలు జరిగాయని తెలిపారు. దేశవ్యాప్తంగా 18 లక్షల ఎకరాల మిగులు భూములు ఉన్నట్లు ప్రకటించారని, కానీ ఇంతవరకు పేదలకు పంపిణీ చేయలేదని పేర్కొన్నారు. పేదలకు భూమిని పంచడానికి బదులు కార్పొరేట్ కంపెనీలకు కట్టబెడుతున్నారని విమర్శించారు. మోడీ అధికారంలోకి వచ్చిన తరువాత ప్రక్రియ మరింత వేగవంతంగా సాగుతోందని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో పేదరికం పోవాలంటే వ్యవసాయంతోపాటు అనుబంధ రంగాల్లోనూ ఉపాధి పెరగాలని అన్నారు. దీంతోపాటు సామ్రాజ్యవాద విధానా లను అడ్డుకోవడంతోపాటు పేదల ఆర్థికస్థితిని బలోపేతం చేయొచ్చని తెలిపారు. కార్మిక, కర్షక ఐక్య పోరాటాల ద్వారానే ఇది సాధ్యమవుతుందని తీర్మానంలో పేర్కొన్నారు.

పోరాటాల ద్వారా విస్తరణ

ప్రసాదు, తెలంగాణా ప్రతినిధి

కోవిడ్ సమయంలో వ్యవసాయ కార్మిక సంఘం సేవా కార్యక్రమాలు అమలు చేసిందని తెలంగాణ తెలిపారు. అలా చేసిన పోరాటాల వల్ల కొత్త ప్రాంతాల్లోకి విస్తరించామని తెలిపారు. అనేక సామాజిక పరమైన అంశాల్లో ప్రజలను చైతన్యం చేస్తున్నామని తెలిపారు. మహిళా వ్యవసాయ కార్మిక సంఘం కన్వీనింగ్ కమిటీని ఏర్పాటు చేశామని వివరించారు. మహిళా కార్మికులు ఉద్యమంలోకి ఎక్కువగా వస్తున్నారని వివరించారు. వారిని మరింత చైతన్యం చేసేందుకు అనేక సమావేశాలు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. అలాగే భూపోరాటాల్లోకి పెద్దఎత్తున పేదలు కదలివస్తున్నారని తెలిపారు. తెలంగాణాలో పెట్టిన ధరణి వెబ్‌సైట్ వల్ల అనేక సమస్యలు ఉత్పన్నం అవుతున్నాయని, వాటిపైనా పోరాడుతున్నామని చెప్పారు.

మత విద్వేషాలను తిప్పికొట్టండి

- మహాసభలో తీర్మానం
- ప్రవేశపెట్టిన తుషార్‌ఘోష్, బలపరిచిన పళనిస్వామి

జ్యోతిబసు నగర్ నుండి ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి

పళనిస్వామి

దేశంలో రోజురోజుకూ పెరుగుతున్న మత విద్వేషాలను తిప్పికొట్టాలని వ్యవసాయ కార్మికసంఘం జాతీయ మహాసభ పిలుపునిచ్చింది. ఈ మేరకు ప్రతిపాదించిన తీర్మానాన్ని మహాసభ ఏకగ్రీవంగా ఆమోదించింది. ఈ తీర్మానాన్ని సంఘం జాతీయ సహాయ కార్యదర్శి తుషార్‌ఘోష్ ప్రతిపాదించగా తమిళనాడు ప్రతినిధి పళనిస్వామి బలపరిచారు. మతోన్మాదానికి వ్యతిరేకంగా కార్మికవర్గం ఎక్కడికక్కడ ఐక్యం కావాలని తీర్మానంలో పేర్కొన్నారు బిజెపి అధికారంలోకి వచ్చిన తరువాత లౌకికతత్వంపై దాడి పెరగడం ఆందోళనమని, మోడీ వచ్చిన తరువాత ఇది మరింత పెరిగిందని తెలిపారు. అధికారిక సంస్థలను ఉపయోగించడం ద్వారా దీన్ని ముందుకు తెచ్చారని పేర్కొన్నారు. గతంలో ఎన్నడూ లేనంతగా లౌకికతత్వం ప్రమాదంలోకి వెళ్లిందని తీర్మానంలో పేర్కొన్నారు. గత మూడేళ్లలో దేశంలో 50 చోట్ల మతపరమైన ఘర్షణలు జరిగాయంటే పరిస్థితి తీవ్రత అర్థమవుతోందని వివరించారు. ఆహార అలవాట్లపైనా, మైనార్టీలు, చర్చిలపైనా దాడులు పెరిగాయని వివరించారు. ముస్లిములపై దాడులు చేయడం లవ్‌జిహాద్ పేరుతో హత్యలకు పాల్పడుతున్నారని పేర్కొన్నారు. అలాగే వారి ఆస్తులను బుల్‌డోజ్ చేస్తున్నారని తీర్మానంలో పొందుపరిచారు. సిఎఎ పేరుతో ముస్లిములను ద్వితీయశ్రేణి పౌరులుగా చిత్రీకరిస్తున్నారని పేర్కొన్నారు. . బిజెపి పాలిత రాష్ట్రాల్లో ముస్లిం వ్యతిరేక ప్రచారం తీవ్రస్థాయిలో జరుగుతోందని పేర్కొన్నారు. ఆవులు, ఆహారం పేరుతో పేదలపై నిరంతరం దాడులు చేయడంతోపాటు పెట్టుబడిదారుల దోపిడీకి దీన్ని ఒక ఆయుధంగా వినియోగిస్తున్నారని చెప్పారు. దీనికి వ్యతిరేకంగా బలమైన లౌకికతత్వంతో కూడిన పోరాటాలు నిర్మించాల్సిన అవసరం ఉందని వివరించారు. మతం, కార్పొరేట్ అనుబంధ దోపిడీకి వ్యతిరేకంగా పోరాటం నిర్వహించాలని తీర్మానించారు.

ఉపాధి హామీ వేతనాల్లో సగం రాష్ట్రాలు చెల్లించాల్సిందే..

- రాష్ట్రాలకు కేంద్రం అల్టిమేటం

న్యూఢిల్లీ : మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (ఎంజిఎన్‌ఆర్‌ఇజిఎస్) వేతనాలను భారాన్ని రాష్ట్రాలు కూడా భరించాల్సిందేనని కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేసింది. వేతనాల భారాన్ని రాష్ట్రాలు కూడా భరించినప్పుడే ఈ పథకంలో అవినీతిని నియంత్రించడంలో రాష్ట్రాలు చురుగ్గా ఉంటాయని కేంద్రం తెలిపింది. ఈ విషయాన్ని కేంద్ర గ్రామీణ అభివృద్ధి శాఖ మంత్రి గిరిరాజ్ సింగ్ గురువారం వెల్లడించారు. ఢిల్లీలో విలేకరుల సమావేశంలో మంత్రి మాట్లాడుతూ ఎంజిఎన్‌ఆర్‌ఇజిఎస్ పథకాన్ని ఒక సాధారణ ఉపాధి హామీ పథకం మాదిరిగా చూడవద్దని చెప్పారు. ఈ పథకం పారదర్శకత విషయంలో కేంద్రం రాజీ పడదని చెప్పారు. ఈ పథకం కంట్రిబ్యూషన్‌ను 60–40 శాతంగా మార్చడానికి ఎంజిఎన్‌ఆర్‌ఇజిఎస్ చట్టంలో సవరణ కోసం పార్లమెంట్‌కు వెళ్లడానికి కూడా సిద్ధంగా ఉన్నామని మంత్రి వెల్లడించారు. ఈ పథకంలో రాష్ట్రాలు కూడా వేతన భారాలు భరించినప్పుడే ఈ పథకంలో అవినీతి జరగకుండా రాష్ట్రాలు అప్రమత్తంగా ఉంటాయని మంత్రి చెప్పారు. ఈ పథకంలో ఇప్పటి వరకూ 100 శాతం వేతనాలను కేంద్రమే భరిస్తుంది. అయితే వేతన చెల్లింపుల్లో మార్పులు చేస్తూ జనవరి 30న కేంద్రం ఉత్తర్వులు జారీ చేసింది. ఫిబ్రవరి 1 నుంచి ఇది అమల్లోకి వస్తుందని కూడా తెలిపింది. దీనిపై ఆందోళనలు వ్యక్తమవుతున్నా కేంద్రం వెనక్కి తగ్గడం లేదు.

త్రిపురలో భారీ పోలింగ్

(మొదటి పేజీ తరువాయి)

చేశారు. బిజెపి బెదిరింపులకు ఓటర్లు భయపడకుండా తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. చాలా చోట్ల దాడి చేసిన వారిపై ఓటర్లు నేరుగా ఎన్నికల అధికారులకు ఫిర్యాదు చేశారు. బిజెపి దాడిలో గాయపడిన సిపిఎం కార్యకర్తలు చందందాస్, షిపాన్ మజుందార్‌లను ఆస్పత్రిలో చేర్చారు. కొన్నిచోట్ల రాత్రి పేలుడు పదార్థాలను పేల్చి ఓటర్లలో భయాందోళనలు రేపేందుకు బిజెపి సభ్యులు ప్రయత్నించారు గోమతి జిల్లాలోని కక్రాబాన్‌లో దొంగ ఓట్లను అడ్డుకోవడానికి ప్రయత్నించిన ఇద్దరు సిపిఎం పోలింగ్ బూత్ ఏజెంట్లపై దాడి చేశారు. సఫాయిజలా జిల్లాలోని బాక్సానగర్ ఏరియాలో గుర్తు తెలియని వ్యక్తులు జరిపిన దాడిలో సిపిఎం స్థానిక కమిటీ కార్యదర్శి గాయపడ్డారు. . సిపిఎం అభ్యర్థి పవిత్ర కర్ పోలింగ్ ఏజెంట్‌కి చెందిన వాహనాన్ని కూడా ఖయార్‌పూర్‌లో ధ్వంసం చేశారు. సిపిఎం మద్దతుదారుడైన ఒక వ్యక్తిని దక్షిణ త్రిపుర జిల్లాలోని కలాచెర్రా పోలింగ్ స్టేషన్ వెలుపల చావబాదినట్లు ఎన్నికల కమిషన్ ధృవీకరించింది. ఇసి అధికారులు ఆ వ్యక్తిని ఆస్పత్రికి తీసుకెళ్ళారని, దాడిజరిపిన వారి పేర్లను ఆయన చెప్పలేకపోయారని త్రిపుర ముఖ్య ఎన్నికల అధికారి ట్వీట్ చేశారు. శాంతిబజార్ పోలీసు స్టేషన్‌లో సుమోటో ఎఫ్ఐఆర్ దాఖలు చేసినట్లు తెలిపారు. సూర్యమణినగర్‌లో బిజెపి కార్యకర్తలు 26,28,29 బూత్‌లపై దాడికి ప్రయత్నించారని త్రిపుర కాంగ్రెస్ ఆరోపించింది. ప్రచారం సందర్భంగా నిర్వహించిన తనిఖీల్లో డబ్బు, మద్యం, మత్తు పదార్థాలు సహా రూ. 45 కోట్ల విలువైన వస్తువులను స్వాధీనం చేసుకున్నట్లు ఎన్నికల సంఘం తెలిపింది. హెలికాప్టర్లు, విమానాల్లో త్రిపురకు అక్రమంగా డబ్బు తరలిస్తున్నారని ప్రతిపక్షాలు ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేశాయి. గత అసెంబ్లీ ఎన్నికలతో పోలిస్తే ఓటర్లకు పంచడానికి స్వాధీనం చేసుకున్న వస్తువులు 20 రెట్లు ఎక్కువని ఎన్నికల సంఘం తెలిపింది

దాడులు చేశారు : సిపిఎం

రాష్ట్రంలోని కొన్ని ప్రాంతాల్లో బిజెపి దుండగులు హింసకు పాల్పడ్డారని సిపిఎం నేత, మాజీ ముఖ్యమంత్రి మాణిక్ సర్కార్, తిప్రా చీఫ్ ప్రద్యోత్ విక్రమ్ మాణిక్య దేవ్ బర్మన్‌లు విమర్శించారు. ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకోనివ్వకుండా అడ్డుపడ్డారని మాణిక్ సర్కార్ తెలిపారు. అయినా ప్రజలు సాధ్యమైనంత వరకు తమ ఓటు హక్కు ఉపయోగించుకునేందుకే చూశారని అన్నారు. ధన్‌పూర్, మోహన్‌పూర్‌ల్లో పాలక పార్టీ హింసకు పాల్పడినట్లు తమకు సమాచారం అందిందన్నారు. . కొన్ని చోట్ల రహదారులను దిగ్బంధిస్తూ, ఓటర్లను ఓటువేయనివ్వకుండా అడ్డుకున్నారని మాణిక్ సర్కార్ తెలిపారు.

బిజెపి నేతకు నోటీసులు

ఒకపక్క పోలింగ్ జరుగుతుంటే మరోపక్క తమ పార్టీకి ఓటు వేయాలని కోరుతూ ట్విట్టర్‌లో ప్రజలను కోరినందుకు బిజెపి జాతీయ ప్రధాన కార్యదర్శి దిలీప్ సైకియాకు, బిజెపి, కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షులకు ఎన్నికల అధికారి నోటీసులు జారీ చేశారు. పోలింగ్ జరగడానికి 48గంటల ముందు నుండి ప్రచారంచేయరాదని అయినా సామాజిక మాధ్యమాల్లో ఓటు వేయాలని కోరినందుకు వారు ఎన్నికల చట్టాన్ని అతిక్రమించినట్లేనని ఇసి పేర్కొంది.

సిద్ధరామయ్యను చంపేయండి : కర్ణాటక మంత్రి

బెంగళూరు : కర్ణాటక ఉన్నత విద్యా శాఖ మంత్రి అశ్వత్ నారాయణ్ హద్దుమీరి మాట్లాడారు. రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు సిద్ధ రామయ్యను చంపేయండని బిజెపి కార్యకర్తలకు ఆయన పిలుపునివ్వడం అత్యంత వివాదంగా మారింది. మాండ్యలో జరిగిన ఒక బహిరంగ సమావేశంలో అశ్వత్ నారాయణ్ మాట్లాడుతూ 'మీకు టిప్పు సుల్తాన్ కావాలా? హిందుత్వ సిద్ధాంత కర్త సావర్కర్ కావాలా? గతంలో టిప్పు సుల్తాన్‌ను ఎక్కడికి పంపారు? నంజె గౌడ ఏం చేశాడు? ఇప్పుడు సిద్ధ రామయ్యను కూడా అలాగే చేయాలి' అని అన్నారు.మంత్రి వ్యాఖ్యలపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కాంగ్రెస్, జెడిఎస్ మంత్రి వ్యాఖ్యలను ఖండించాయి.

మీకోసం

పప్పులు, రవ్వ ముక్కిపోకుండా ఉండాలంటే వాటిని దోరగా వేయించి చల్లారాక డబ్బాల్లో నిల్వ చేసుకోవాలి.

జీవన సౌరభం

మన స్థాయిని పెంచేది మన ప్రవర్తన తప్ప ఎదుటి వారి పొగడ్త కాదు.

అమ్మా... బడికెళ్తా..!



చదువులో ఎప్పుడూ ముందుండే శైలజ ఈమధ్య పాఠశాలకు రావడం లేదు. తన స్నేహితులను ఖాన్ మాస్టారు అడిగితే 'వాళ్ళ అమ్మ తనతో పాటు పనికి తీసుకెళ్తుంది సార్' అని చెప్పారు విద్యార్థులు. శైలజ తెలివైన అమ్మాయి. తాను చదువుకుంటే తండాలో ఉన్న పిల్లలకు ఆదర్శంగా నిలుస్తుందని భావించి శైలజ వాళ్ళ ఇంటికి ఖాన్ మాస్టారు వెళ్లారు.

'ఇంట్లో పెద్ద దిక్కు లేడు. దాన్ని పైచదువు చదివించే స్థోమత నా దగ్గర లేదు. పనికి పోతే కొన్ని పైసలన్న వస్తే దాని పెళ్లి ఖర్చులకు సహాయపడతాయి' అని తన బాధను చెప్పుకుంది శైలజ వాళ్ళ అమ్మ. మాస్టారు నచ్చజెప్పేందుకు ప్రయత్నించారు. కాని శైలజను బడికి పంపడానికి ఒప్పుకోలేదు.

ఒకరోజు శైలజ వాళ్ళ మామయ్య ఇంటికి వచ్చి 'ఏంటి అక్కా! శైలజ బడికి పోవడం లేదా? ఇంట్లోనే ఉంది' అని అడగ్గానే 'లేదు తమ్ముడు.. నాతో పాటు పనికి తీసుకెళ్తున్న' అని సమాధానం చెప్పింది.

'శైలజ బాగా చదువుతుంది. తెలివైనది. చదువుకుంటే మన లాగా కూలీ పని చేయాల్సిన పని ఉండదు. తనని గురుకుల పాఠశాలలో వేసి చదివిస్తాను' అని అన్నాడు. దాంతో శైలజ 'అమ్మా చదువుకుంటా...' అని ఏడ్చింది. చదువు మీద ఉన్న ప్రేమను చూసి తల్లి ఒప్పుకుంది. మామయ్య గురుకుల పాఠశాల్లో చేర్పించాడు. అక్కడ తను బాగా చదువుకుని మంచి మార్కులు తెచ్చుకుంది. శైలజను ఆదర్శంగా తీసుకుని తండా వాసులంతా తమ పిల్లల్ని కూడా బడిలో చేర్పించారు. శైలజ వాళ్ళ అమ్మ చాలా సంతోషించింది. నాతో పాటే పనికి తీసుకెళ్తే నా బిడ్డ ఇంత గొప్పది అయ్యేది కాదు కదా! అనుకొని తను చేసిన పనికి మనసులోనే బాధపడింది.

- తూరపాటి శైలజ,
6వ తరగతి,
మేళ్లచెర్వు, సూర్యాపేట.

లెక్క తేల్చండి

చిన్నారులూ... ఇక్కడున్న పట్టికలో రకరకాల బొమ్మలున్నాయి. వాటిని నెంబర్లు గా గుర్తించి గణించాము. చివరి లైన్లో ఉన్న బొమ్మల అంకెల ఆధారంగా మీరు జవాబు రాబట్టండి.



జవాబు : 100

నేను గీసిన బొమ్మ



- ఆర్. హాసిని, 7వ తరగతి,
అరవింద హైస్కూలు, కుంచనపల్లి,
గుంటూరు జిల్లా.

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

వారిలో మార్పు కోసం...

దేశంలో మత్తు పదార్థాలు వాడుతున్న వారి సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. మాదకద్రవ్యాలు నరాలు, మెదడుపై తీవ్ర ప్రభావం చూపి, విచక్షణ కోల్పోయేలా చేస్తాయి. అటువంటి వారిని కుటుంబసభ్యులు సైతం వదిలేస్తే ...పామ్‌ఖుయిలా షైజా చేరదీసి కాపాడుతుంది. కౌన్సిలింగ్ ఇవ్వడమే కాకుండా వైద్యం సదుపాయాలూ కల్పిస్తున్నారు. అందుకు తన ఉద్యోగాన్ని వదులుకున్నారు. ఆస్తినీ అమ్మారు. ఈ దారిలో ఎన్నో సవాళ్లు. నిత్యం కత్తి మీద సాములాంటిదే అయినా వెనకాడలేదు. మతిస్థిమితం కోల్పోయిన వారికి మామూలు మనుషుల్లా మార్చుతున్నారు.

మణిపూర్‌కు చెందిన పామ్‌ఖుయిలా షైజాకు ఒక అన్నయ్య ఉన్నాడు. చిన్నతనంలో అతనితో కలిసి ఆడుకోవడం, అతనితో గడిపిన క్షణాలు ఆమెకు తీపి జ్ఞాపకాలు. ఆమె కన్నా అతను చురుకైన, తెలివైన వాడు. చాలా సందర్భాల్లో ఆమె కన్నా అతను విజేతగా నిలిచేవాడు. ఆమె 20 ఏళ్ల క్రితం పై చదువుల నిమిత్తం షిల్లాంగ్, ఢిల్లీ, యూరప్ ప్రాంతాలకు వెళ్లింది. ఆ సమయంలో అన్నయ్య మత్తు పదార్థాలకు బానిస అయ్యాడు. ఇంట్లో తల్లిదండ్రులకు ఎదురుతిరగడం, డబ్బు కావాలంటూ గొడవ పడటం చేసేవాడు. తరువాత తనవల్ల తల్లిదండ్రులు బాధపడుతున్నారని గ్రహించి ఇంటికి రావడం మానేశాడు. ఇంటికి తిరిగొచ్చిన షైజా అన్న కోసం ఆరా తీసింది. కొన్నాళ్లగా మతిచలించి అనారోగ్యానికి గురై, ఇంట్లో నుంచి వెళ్లిపోయినట్లు తెలుసుకుంది. వేదనకు గురి అయ్యింది. మత్తు ఉచ్చులో పడి బంధాలు వదులుకున్నాడని రోదించింది.

ఉద్యోగం వదిలి

షైజా చదువు పూర్తయ్యాక ట్యూషన్లు చెప్పారు. చాలా రచనలు చేశారు. మణిపూర్‌లో ఆధునికత ఎలా ప్రారంభమైందో తెలియజేస్తూ ఓ పుస్తకం కూడా రాశారు. కన్నూర్ యూనివర్సిటీలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా ఉద్యోగమూ చేశారు. ఈ క్రమంలో ఓ 20 ఏళ్ల ఓ విద్యార్థి డ్రగ్స్‌కు అడిక్ట్ అయ్యి ఆరు నెలల్లో రక్తం కక్కుకొని చనిపోయాడు. ఈ సంఘటన షైజాను మరింత బాధపెట్టింది. అన్నయ్య పరిస్థితి తలచుకుని ఏడ్చింది. డ్రగ్స్ వల్ల బాధితులతో పాటు కుటుంబసభ్యులు ఎంత క్షోభకు గురవుతారో అర్థమైంది. అప్పటి నుంచి మాదకద్రవ్యాలు సేవించిన వారి మానసిక పరిస్థితి ఎలా ఉంటుందో గ్రహించడం మొదలుపెట్టింది. ఆ మత్తు నుంచి బయట పడాలనుకునేవారి కోసం ఏదో ఒకటి చేయాలని నిర్ణయించుకుంది. దాంతో ఉఖ్రుల్ జిల్లా పరిధిలో 'బ్రెడ్‌వెల్ కరెక్షనల్ ఫెసిలిటీ' అనే కౌన్సెలింగ్ సెంటర్‌ను స్థాపించింది. దీని కోసం ఆమె ఎన్నో అవమానాలూ ఎదుర్కొంది. ఆర్థికంగా ఇబ్బందులూ పడింది. అయినా తన సంకల్పం చెదరకుండా చూసుకుంది. దాచుకున్న సొమ్ము మొత్తం ఖర్చు పెట్టింది. అత్యవసర పరిస్థితుల్లో తన ఆస్తిని కూడా అమ్మింది. అందుకు కుటుంబం కూడా ఎంతో సహకరించింది. కౌన్సిలింగ్ సెంటర్ కావడంతో ప్రభుత్వం నుంచి ఎటువంటి సాయం అందలేదు. కాని పెట్టిన కొద్ది నెలల్లో వందల మంది బాధితులు కౌన్సిలింగ్ సెంటర్‌కు రావడం చూసి వారి కోసం ఇంకా ఏదో చేయాలన్న తపన పెరిగింది. వారిని మత్తుకు దూరంగా ఉండేలా సలహాలు, సూచనలూ చేస్తుంది. రోగుల తల్లిదండ్రులకు కౌన్సిలింగ్ ఇస్తుంది. నిరాశ్రయులకు ఆశ్రయం కల్పించింది. ఈ క్రమంలో డ్రగ్స్ మానుకున్న రోగులకు ఇతర వ్యాధులు రావడం మొదలుపెట్టాయి. మత్తు పదార్థాలు మనిషిని, శరీర అవయవాలను ఎలాగ నాశనం చేస్తాయో తెలుసుకుని ఆశ్చర్యపోయింది. వాటి నుంచి బయటపడేలా వైద్యనిపుణుల చేత వైద్య సదుపాయం అందించింది.

మానసిక మార్పుకు

రోగుల మానసిక ఎదుగుదలకు ఆటలు ఆడించడం, సామాజిక కార్యక్రమాల్లో పాల్గొనేలా చేయడం, ఇతర అంశాలపై దృష్టి మళ్లేలా పని చేయించడం చేసింది. అయినా కొంతమంది మత్తు మానుకోలేక డ్రగ్స్ కోసం వెంపర్లాడటం ఆమెను భయందోళనకు గురి చేసింది. అయినా వారిలో మార్పు కోసం మళ్లీ మళ్లీ ప్రయత్నించింది. అటువంటి వారిని ఒకే చోట ఉంచకుండా మరొక చోట కౌన్సిలింగ్ చేయించింది.

అవహేళనలు ఎదురైనా

మాదకద్రవ్యాలు తీసుకుంటున్న వారిలో 20 సంవత్సరాల లోపు వారు ఉండటం ఆమెలో మరింత కలవరం కలిగించింది. ఆ పిల్లలు మొత్తం హైస్కూల్ డ్రాపౌట్స్. వీరిలో చాలా మంది పునరావాసం లేక చనిపోయినట్లు గుర్తించింది. అంతేకాకుండా తినే ఆహారంలో మత్తు కలుస్తున్నట్లు తెలుసుకుని అధికారులకు తెలిపింది. ఈ నేపథ్యంలో ఆమెకు ఎన్నో విమర్శలు, అవమానాలూ ఎదురయ్యాయి. డ్రగ్స్‌మాఫియా నుంచి బెదిరింపులు, పోలీసుల నుంచి వేధింపులు ఆమెను నిత్యం ఒత్తిడికి గురిచేశాయి. దాంతో కౌన్సిలింగ్ సెంటర్‌ను మూసివేయమని సన్నిహితులు హైజాకు నచ్చజెప్పారు. అయినా ఆమె భయపడలేదు. మాదకద్రవ్యాల వ్యసనం నుంచి కొంతమందిని కాపాడానన్న తృప్తి ఆమెను మరింత బలంగా మార్చింది. స్థానిక చర్చి పాస్టర్లు సెంటర్‌కు సహాయం చేస్తున్నారు. తోడుగా నిలిచి చేయూతనందిస్తున్నారు. రచయిత కావాలన్న హైజా తన లక్ష్యాన్ని పక్కనబెట్టి వారిలో మార్పు కోసం కృషి చేయడం చూసి బాధిత తల్లిదండ్రులు హర్షిస్తున్నారు.

ఒత్తిడిని తరిమే బాక్సింగ్

ప్రస్తుతం చాలా మంది మానసిక ఒత్తిడికి లోనవుతున్నారు. పిల్లలు చదువు, పరీక్షలతో నిత్యం ఒత్తిడి ఎదుర్కొంటున్నారు. మహిళలు ఉద్యోగం, ఇంటి బాధ్యతలతో సతమతం అవుతున్నారు. వీటి నుంచి బయటపడేందుకు చిన్న చిన్న వ్యాయామాలు తప్పనిసరిగా చేయాలని వైద్య నిపుణులు సూచిస్తున్నారు. వీటిలో కిక్ బాక్సింగ్ చాలా తోడ్పడుతుందంటున్నారు. బాక్సింగ్ అంటే సహజంగా పురుషులు ఆడే ఆటగా చూస్తారు. ఈ మధ్యకాలంలో కొంతమంది ఆడపిల్లలు ఈ రంగంలో శిక్షణ పొందుతూ గుర్తింపు సాధించారు.

నిజానికి కిక్ బాక్సింగ్.. శరీరానికి, మనసుకు మధ్య అనుసంధానకర్తలా పనిచేస్తుంది. బరిలో ఉన్నప్పుడు.. చాలా ఏకాగ్రతతో వ్యవహరించాలి. లేకపోతే దెబ్బలు తగులుతాయి. వాటి నుంచి తప్పించుకోవాలంటే పంచ్ కొట్టాల్సిందే. ఈ వ్యూహాత్మక అప్రమత్తత మెదడును చురుగ్గా ఉంచుతుంది. వారానికి ఐదు రోజులు, రోజూ ఓ గంట చొప్పున సాధన చేస్తే.. మనం ఆక్సిజన్‌ను తీసుకునే సామర్థ్యమూ వృద్ధి అవుతుంది. ఊబకాయాన్ని వదిలించుకోవడానికి కిక్ బాక్సింగ్ తిరుగులేని మార్గమని చెబుతున్నారు వైద్యులు. ప్రతి కిక్.. మన బుర్రలోని ఒత్తిడిని తరిమేస్తుంది. అర్థంలేని ఉద్వేగాలు దూరమవుతాయి. కాకపోతే, నిపుణుల పర్యవేక్షణలోనే సాధన చేయాలి. శారీరకంగా, మానసికంగా సమస్యలను ఎదుర్కొనే మహిళలకు కిక్ బాక్సింగ్ చాలా ఉపయోగకరం.

కేఆర్కే ఛానల్ లాంచ్ చేసిన చిరంజీవి

చిత్రసీమలో కొత్త వారికి అవకాశాలు ఇవ్వడమే లక్ష్యంగా లెజెండరీ ఫిల్మ్ మేకర్, దర్శకేంద్రుడు కె. రాఘవేంద్ర రావు యూట్యూబ్ ఛానల్ స్టార్ట్ చేశారని చిరంజీవి అన్నారు. కొన్ని రోజుల క్రితం ఆ ఛానల్ లోగోను దర్శక ఎస్.ఎస్. రాజమౌళి లాంచ్ చేశారు. ఇప్పుడు చిరంజీవి ఆన్‌లైన్‌లోకి తీసుకు వచ్చారు. ఈ విషయాన్ని సోషల్ మీడియాలో రాఘవేంద్రుడు తెలియజేశారు. తెలుగు చలన చిత్ర పరిశ్రమకు రాఘవేంద్ర రావు ఎంతో మంది నటీనటులు, సాంకేతిక నిపుణులను పరిచయం చేశారని, ఇక్కడి నుంచి కొంత మందిని హిందీకి కూడా తీసుకు వెళ్ళారని చిరంజీవి అన్నారు. ఇప్పుడీ యూట్యూబ్ ఛానల్ ద్వారా కొత్తవాళ్ళను వినోద పరిశ్రమకు పరిచయం చేయాలని సంకల్పించారన్నారు. ఈ సందర్భంగా రాగవేంద్రరావుతో తనకు ఉన్న అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు.

కళాతపస్వికి కళాంజలి

ఈ నెల 19వ తేదీ విశ్వనాథ్ 94వ పుట్టిన రోజు సందర్భంగా ఆయన జయంతి కార్యక్రమాన్ని టి. సుబ్బిరామిరెడ్డి ఘనంగా నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నారు. 'కళాతపస్వికి కళాంజలి' ఘటించబోతున్న ఈ కార్యక్రమంలో ఆయన చిత్రాలలో నటించిన పలువురు నటీనటులు, సాంకేతిక నిపుణులు హాజరు కాబోతున్నారు. ముఖ్యంగా చిరంజీవి, రాధిక, సుమలత తదితరులు పాల్గొన బోతున్నారు. తెలుగు, తమిళ, కన్నడ, హిందీ రాష్ట్రాలకు చెందిన నటీనటులు ఈ వేడుకకు విచ్చేసి, విశ్వనాథ్ గారితో తమకున్న అనుబంధాన్ని స్మరించుకోబోతున్నట్లు సమాచారం.

కార్తీతో పరశురామ్ కొత్త ప్రాజెక్టు

పరశురామ్ దర్శకత్వంలో మరో ప్రాజెక్ట్ వస్తోంది. తమిళ హీరో కార్తీ కోసం కథ సిద్ధం చేసిన పరశురామ్ ఇటీవల చెన్నైలో కార్తిని కలిశారని తెలుస్తోంది. పరశురామ్ కథ కార్తికి బాగా నచ్చడంతో వెంటనే ప్రాజెక్టుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారని సమాచారం. అయితే పరశురామ్ ఇదివరకే విజయ్ దేవరకొండతో ఓ సినిమా ప్రకటించారు. మొదట ఆ ప్రాజెక్టు పూర్తి చేస్తాడని సన్నిహిత వర్గాల నుంచి సమాచారం. ఈ సినిమా తర్వాతే కార్తి సినిమా ఉంటుందని ఫిల్మ్‌నగర్ టాక్.

అందరి పై దయ చూపించండి

మయోసైటిస్‌తో బాధపడుతున్న సమంత కొంతకాలంగా ఇంటికే పరిమితమై ట్రీట్‌మెంట్ తీసుకుంటున్నారు. ఇటీవల కాస్త కోలుకున్న ఆమె సోషల్ మీడియాలో యాక్టివ్ అయ్యారు. తాజాగా సోషల్ మీడియాలో ఓ పోస్ట్ పెట్టారు. బాక్సింగ్ ప్రాక్టీస్ చేస్తున్న ఫొటో షేర్ చేసి 'అందరి పై దయ చూపించండి' అంటూ ఇన్‌స్టాగ్రామ్ స్టోరీలో షేర్ చేశారు. 'ఎవరు ఏ సమస్యతో పోరాడుతున్నారో తెలీదు. అందుకే అందరి పై దయ చూపించండి" అని ఆ ఫొటోకు క్యాప్షన్ ఇచ్చింది.

'వెయ్ దరువేయ్' టీజర్ విడుదల

పూరీ జగనన్నాథ్ తమ్ముడు సాయిరామ్ శంకర్ హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'వెయ్ దరువెయ్'. నవీన్‌రెడ్డి ఈ సినిమాకు దర్శకత్వం వహించగా, దేవరాజ్ నిర్మించారు. ఇప్పటికే విడుదలైన పాటలకు మంచి రెస్పాన్స్ లభిస్తుంది. తాజాగా ఈ సినిమా టీజర్‌ను హీరో సాయిధరమ్ తేజ్ విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. టీజర్ చాలా ఇంట్రెస్టింగ్‌గా ఉందని, సినిమా ఎప్పుడెప్పుడు చూడాలా అన్న కుతూహలం కలుగుతుందన్నారు. ఈ సందర్భంగా మూవీ టీంకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం హీరో సాయి రామ్ శంకర్ మాట్లాడుతూ టీజర్‌ను సాయిధరమ్ తేజ్ రిలీజ్ చేయడం ఆనందంగా ఉందని, ఇప్పటికే తమ సినిమా పాటలను యూట్యూబ్‌లో చూసేందుకు ఆసక్తి కనబరుస్తున్నారన్నారు.

సాఫ్ట్ టైటిల్‌తో సస్పెన్స్ థ్రిల్లర్

కోలీవుడ్ నటుడు ఉదయనిధి స్టాలిన్ నటించిన చిత్రం 'కన్నై నంబాదే'. అంటే తెలుగులో 'మీ కళ్లను నమ్మవద్దు' అని అర్థం. ఈ చిత్రాన్ని సస్పెన్స్ థ్రిల్లర్‌గా తెరకెక్కించారు. ఈ చిత్రం త్వరలోనే విడుదలకి సిద్ధమవుతోంది. ఈ నేపథ్యంలో సంగీత దర్శకుడు సిద్ధు కుమార్‌తో కలిసి దర్శకుడు ము.మారన్ తాజాగా ఓ ప్రమోషనల్ కార్యక్రమంలో పలు ఆసక్తికర విషయాలను పంచుకున్నాడు. లవ్ స్టోరీ చేయాలన్న ఆలోచనతో ఉదయనిధిని సంప్రదించానని, ఆయన థ్రిల్లర్ జోనర్‌లో చేసేందుకు ఆసక్తి చూపించారు. దీంతో 'కన్నై నంబాదే' అనే సాఫ్ట్ టైటిల్‌లో సస్పెన్స్ థ్రిల్లర్ మూవీ తెరకెక్కించామన్నారు. ఆత్మిక హీరోయిన్. భూమిక చావ్లా ఓ ప్రధాన పాత్ర పోషించారు. నేపథ్య సంగీతం సినిమాకు హైలెట్‌గా నిలుస్తుంది. లిపి సినీ క్రాఫ్ట్స్ బ్యానరుపై వీఎన్ రంజిత్ కుమార్ నిర్మించారు.

అశ్విన్, జడేజాపైనే భారం

ఆస్ట్రేలియాతో రెండో టెస్ట్ నేటినుంచే..

న్యూఢిల్లీ: తొలి టెస్ట్‌లో ఇన్నింగ్స్ తేడాతో గెలిచిన టీమిండియా.. ఇక రెండో టెస్ట్‌పై దృష్టి సారించింది. చాలారోజుల తర్వాత ఫిరోజ్‌షా కోట్లా మైదానంలో టెస్ట్ మ్యాచ్ జరుగుతుండడంతో భారత్-ఆస్ట్రేలియా జట్ల మధ్య జరిగే రెండోటెస్ట్ మ్యాచ్ టికెట్లన్నీ హాట్ కేకుల్లా అమ్ముడై పోయాయి. ఆన్‌లైన్‌లో సుమారు 24వేల టికెట్లు పెట్టగా తొలిరోజుల ఆటకు సంబంధించి టికెట్లన్నీ అయిపోయినట్లు నిర్వాహకులు తెలిపారు. ఇక బోర్డర్-గవాస్కర్ ట్రోఫీ నాలుగు టెస్ట్ మ్యాచ్‌ల సిరీస్‌లో భాగంగా జరిగే రెండో టెస్ట్‌మ్యాచ్‌లోనూ భారత్ గెలిస్తే.. ప్రపంచ టెస్ట్ ఛాంపియన్‌షిప్ ఫైనల్స్‌కు భారత్ చేరువ కానుంది. తొలిటెస్ట్‌లో రవీంద్ర జడేజా, రవిచంద్రన్ అశ్విన్ సంయుక్తగా చెలరేగడంతో భారతజట్టు సునాయాసంగా గెలిచింది. తొలిటెస్ట్ జరిగిన నాగ్‌పూర్ పిచ్ మాదిరిగానే.. ఫిరోజ్ షా మైదానం కూడా స్పిన్నర్లకు అనుకూలించనుంది.

ఈ మైదానంలో ఇరుజట్లు 7సార్లు తలపడగా.. భారతజట్టు 3టెస్టుల్లో గెలిచి ఒక్క టెస్ట్‌లో మాత్రమే ఓటమిపాలైంది. 2013లో ఈ మైదానంలో ఆడిన చివరి మ్యాచ్‌లో భారతజట్టు ఆస్ట్రేలియాపై గెలిచింది. ఇక ఆస్ట్రేలియాజట్టు విషయానికొస్తే.. సీనియర్ స్పిన్నర్ నాథన్ లియాన్‌కు తోడు.. యువ స్పిన్నర్ మర్ఫీపైనే ఆశలు పెట్టుకుంది.

జట్లు(అంచనా)..

భారత్: రోహిత్(కెప్టెన్), కేఎల్ రాహుల్, గిల్, కేఎస్ భరత్(వికెట్ కీపర్), పుజారా, శ్రేయస్, కోహ్లి, అక్షర్/అశ్విన్, జడేజా, సిరాజ్, షమీ.

ఆస్ట్రేలియా: కమిన్స్(కెప్టెన్), స్మిత్, వార్నర్/అగర్, మర్ఫీ, క్యారీ(వికెట్ కీపర్), గ్రీన్, హ్యాండ్‌కోంబ్, హేజిల్‌వుడ్, ఖవాజా, లబూషేన్, లియాన్.

నిప్పులు చెరిగిన ఉనాద్కట్, సకారియా

బెంగాల్ తొలి ఇన్నింగ్స్ 174ఆలౌట్.. రంజీట్రోఫీ ఫైనల్

కోల్‌కతా: సౌరాష్ట్ర కెప్టెన్, పేసర్ జయదేవ్ ఉనాద్కట్ మెరుపు బౌలింగ్‌కు తోడు.. యువ పేసర్ చేతన్ సకారియా బౌలింగ్‌లో చెలరేగడంతో బెంగాల్ జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 174పరుగులకే కుప్పకూలింది. ఈడెన్ గార్డెన్స్ వేదికగా గురువారం నుంచి ప్రారంభమైన రంజీట్రోఫీ ఫైనల్లో టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన బెంగాల్ జట్టుకు శుభారంభం దక్కలేదు. బెంగాల్ ఓపెనర్లు సమంత గుప్తా(1), అభిమన్యు ఈశ్వరన్(0)కి తోడు గరామీ(0) నిరాశపరచడంతో బెంగాల్ జట్టు 2 పరుగులకే మూడు వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. ఈ క్రమంలో సౌరాష్ట్ర యువ బౌలర్ చేతన్ సకారియా మరో ఎండ్‌లో చెలరేగడంతో బెంగాల్ జట్టు 66పరుగులకే 6వికెట్లు కోల్పోయి పీకల్లోతు కష్టాల్లో పడింది. ఆ దశలో షాబాద్(69), అభిషేక్ పొరెల్(50) కలిసి 7వ వికెట్‌కు సెంచరీ భాగస్వామ్యాన్ని నెలకొల్పి ఆదుకున్నారు. వీరిద్దరి నిష్క్రమణ అనంతరం లోయర్ ఆర్డర్ బ్యాటర్స్ ఇలా వచ్చి అలా వెళ్లిపోవడంతో బెంగాల్ జట్టు తొలిఇన్నింగ్స్ 174పరుగుల వద్ద ముగిసింది. ఉనాద్కట్, సకారియాకు మూడేసి, ధర్మేంద్ర, చిరాగ్‌కు రెండేసి వికెట్లు దక్కాయి. అనంతరం తొలి ఇన్నింగ్స్ ప్రారంభించిన సౌరాష్ట్ర జట్టు తొలిరోజు ఆట ముగిసే సమయానికి 2 వికెట్లు కోల్పోయి 81పరుగులు చేసింది. ఓపెనర్ హర్విక్ దేశాయ్(38), చేతన్ సకారియా(2) క్రీజ్‌లో ఉన్నారు.

ఫుట్‌బాల్ లెజెండరీ

తులసీదాస్ బలరామ్ కన్నుమూత

కోల్‌కతా: ఫుట్‌బాల్ దిగ్గజం, వెటరన్ తులసీరామ్ బలరామ్(86) కన్నుమూశారు. వృద్ధాప్యలేమి, అనారోగ్య సమస్యల కారణంగా మంగళవారం అర్ధరాత్రి మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు గురువారం వెల్లడించారు. గత నెలలో అపోలో ఆసుపత్రిలో చేర్పిన బలరామ్ పరిస్థితి విషమించడంతో ఐసి యుకు తరలించారు. మెదడులో రక్తప్రసరణ నిలిచిపోవడంతో మరణంచినట్లు డాక్టర్లు తెలిపారు. 1936, అక్టోబర్ 4న తమిళనాడులోని అమ్ముగూడ గ్రామంలో ముత్తమ్మ-తులసీదాస్ దంపతులకు జన్మించిన బలరామ్.. ఉద్యోగ రీత్యా కొంతకాలం సికింద్రాబాద్‌కు మారారు. 1951-62మధ్యకాలంలో భారత ఫుట్‌బాల్ జట్టుకు ఆడిన బలరామ్.. 1956, 1960లో ఒలింపిక్స్‌లో ప్రాతినిధ్యం వహించారు. 1962లో జకార్తా వేదికగా జరిగిన ఆసియా క్రీడల ఫైనల్లో భారతజట్టు జట్టు 2-1గోల్స్ తేడాతో దక్షిణ కొరియాను ఓడించి స్వర్ణ పతకాన్ని గెలుచుకోవడంలో కీలకపాత్ర పోషించారు. కెరీర్‌లో 131గోల్స్ కొట్టగా.. అందులో 14 అంతర్జాతీయంగా గోల్స్ ఉన్నాయి.

క్వార్టర్స్‌కు సుమిత్ నాగల్

చెన్నై: చెన్నై ఓపెన్ ఛాలెంజర్స్ టెన్నిస్ టోర్నీ పురుషుల సింగిల్స్ క్వార్టర్‌ఫైనల్లోకి సుమిత్ నాగల్ ప్రవేశించాడు. గురువారం జరిగిన ప్రిక్వార్టర్స్ పోటీలో సుమిత్ 3-6, 6-2, 6-0తో జాసన్ జంగ్(తైపీ)పై పోరాడి నెగ్గాడు. పురుషుల డబుల్స్‌లో శ్రీరామ్ బాలాజీ-నెడుంఛెంజీయన్ జోడీ సెమీఫైనల్లోకి దూసుకెళ్లారు. క్వార్టర్స్‌లో భారతజోడీ 7-6(7-5), 6-0తో భారత్‌కే చెందిన సుమిత్-ముకుంద్‌పై సునాయాసంగా గెలిచారు. అలాగే అర్జున్ ఖండే జోడీ కూడా 1-6, 7-6(10-8), 10-8తో కొరియా జోడీపై నెగ్గి సెమీస్‌కు చేరింది.

హ్యాట్రిక్ విజయాలతో సెమీస్‌కు ఆస్ట్రేలియా

టి20 మహిళల ప్రపంచకప్

లకేప్‌టౌన్: ఐసిసి మహిళల టి20 ప్రపంచకప్ సెమీఫైనల్లోకి ఆస్ట్రేలియా జట్టు దూసుకెళ్లింది. గురువారం జరిగిన గ్రూప్-ఏ లీగ్ మ్యాచ్‌లో ఆస్ట్రేలియా జట్టు 10వికెట్ల తేడాతో శ్రీలంకను చిత్తుచేసింది. తొలుత ఆసీస్ బౌలర్లు ధాటికి లంక జట్టు 20 ఓవర్లలో 8వికెట్ల నష్టానికి 112పరుగులే చేయగల్గింది. స్కట్‌కు నాలుగు, హర్రీస్‌కు రెండు వికెట్లు దక్కాయి. ఛేదనలో ఆస్ట్రేలియా ఓపెనర్లు హీలీ(54), మూనీ(56) అర్ధసెంచరీలతో రాణించడంతో ఆసీస్ జట్టు 15.5 ఓవర్లలో వికెట్లేమీ నష్టపోకుండా 113పరుగులు చేసి సునాయాసంగా గెలిచింది.

మునీబా సెంచరీ



పాకిస్తాన్ ఓపెనర్ మునీబా సెంచరీతో గ్రూప్-బిలో పాకిస్తాన్ 70పరుగుల తేడాతో ఐర్లాండ్‌పై గెలిచింది. తొలిగా పాక్ ఓపెనర్ మునీబా(102) సెంచరీకి తోడు నిదా ధార్(33) బ్యాటింగ్‌లో రాణించడంతో 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 165పరుగులు చేసింది. ఛేదనలో ఐర్లాండ్ జట్టు 16.3ఓవర్లలో 95పరుగులకే కుప్పకూలింది.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68